PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 234 | విజయవాడ, మంగళవారం 28 మార్చి 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Tuesday 28 March 2023 | Rs

ఇఒఐకి విశాఖ స్టీల్

- డబ్బు అయినా ఇవ్వండి... ముడి సరుకైనా పంపండంటూ ప్రకటన
- ప్రయివేట్ సంస్థల ముందు మోకరిల్లేలా కేంద్రం కుట్ర

లోపలి పేజీలో..



జ్యుడీషియల్ సంస్కరణలను నిరసిస్తూ ఇజ్రాయిల్‌లో సమ్మె

- స్తంభించిన పలు రంగాలు, సేవలు

లోపలి పేజీలో..

పారిశ్రామిక తీరం

జల రవాణాకు ప్రాధాన్యత • లోకాస్ట్, లోరిస్క్ బిజినెస్ • 21 రోజుల్లో అన్ని క్లియరెన్సులు • 2023-27 ఇండస్ట్రియల్ పాలసీ ఆవిష్కరణ

ప్రజాశక్తి -పిఎం పాలెం, విశాఖపట్నం

రాష్ట్రంలో 974 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతాన్ని పూర్తిగా పారిశ్రామిక అవసరాలకు వినియోగించనున్నారు. తీరం వెంబడి పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంతోపాటు వాటికి అనుకుని ఉన్న 48 వేల ఎకరాల్లో పోర్టు ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విశాఖలో జరిగిన ఒక కార్యక్రమంలో 2023-27 నూతన పారిశ్రామిక పాలసీని పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్ ఆవిష్కరించారు. ఈ విధానంలో భూ కేటాయింపుల, రాయితీలు తదితర అంశాల్లో పారిశ్రామికవేత్తలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించారు. లోకాస్ట్, లోరిస్క్ బిజినెస్‌కు ప్రాధాన్యత ఇచ్చారు. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాన్ని పూర్తిగా పారిశ్రామిక అవసరాలకు కేటాయించనున్నారు. విశాఖ చెన్నై పారిశ్రామిక జోన్లో భాగంగా గతంలోనే ఈ పాలసీని తీసుకొచ్చినప్పటికీ ఇటీవల జరిగిన విశాఖ సమ్మిట్ సందర్భంగా మెరుగులు దిద్దారు. నూతన పాలసీలో తీరం వెంబడి పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టడంతో పాటు, వీటిని ఆనుకుని సుమారు 48 వేల ఎకరాలలో పోర్టు ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నారు. రోడ్డు రవాణా వాడకాన్ని తగ్గించి, జల రవాణాను ప్రోత్సహించనున్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఉండేందుకు వీలుగా 21 రోజుల్లోనే సింగిల్ విండో పద్ధతిలో భూముల కేటాయింపుతోపాటు అన్ని రకాల అనుమతులూ ఇవ్వనున్నట్లు మంత్రి ప్రకటించారు. అనుమతులకు సంబంధించి వైఎస్ఆర్ ఎపి 1 యాప్‌ను కూడా ప్రారంభించారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన 96 క్లియరెన్స్‌లను 21 రోజుల్లోనే మంజూరు చేస్తామని ప్రకటించారు. పారిశ్రామిక వేత్తలు వారికి ఏమి కావాలనే విషయాన్ని యాప్‌లో పొందుపరిస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని, ఈ యాప్ కేంద్ర స్థానాన్ని విశాఖలోనే పెడుతున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత పాలసీలో ఎక్కువ పరిశ్రమలు, మధ్యస్త పరిశ్రమలు ఉన్న జిల్లాలను వేర్వేరు జోన్లుగా విడగొట్టారు. దానికి అనుగుణంగా రాయితీలూ ప్రకటించారు. ఇటీవల జరిగిన గ్లోబల్ సమ్మిట్లో ఫుడ్ ప్రాసెసింగ్, మెడికల్ డివైజెస్ తయారీ, గ్రీన్ హైడ్రోజన్, రెన్యువబుల్ ఎనర్జీ రంగాలలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు పలువురు ముందుకు వచ్చారు. అలాగే డిఫెన్స్, ఎరోస్పేస్ రంగాల్లో రూ.15,000 కోట్ల జాయింట్ వెంచర్ ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. మొత్తం 14 రంగాలకు తొలి ప్రాధాన్యతలో అవకాశాలు కల్పించారు.



2023-27 నూతన పారిశ్రామిక పాలసీని ఆవిష్కరిస్తున్న పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్ తదితరులు

పిపిపి కింద కొత్త పాలసీ

కొత్త పాలసీ ప్రకారం పిపిపి కింద ప్రైవేట్ ఎంఎస్ఎంఇ పార్కులను అభివృద్ధి చేయనున్నారు. ఇన్నోవేషన్ రంగాన్ని ప్రోత్సహించేందుకు విశాఖలో ఐ స్పేస్ పేరుతో ఐకానిక్ టవర్‌ను నిర్మించనున్నారు. ముఖ్యంగా వేర్‌హౌసింగ్‌కు పరిశ్రమల హోదా కల్పించారు. రాష్ట్రంలో లోకాస్ట్, లోరిస్క్ బిజినెస్ ప్రధానంగా పాలసీని తీసుకొస్తున్నామని వివరించారు.

జల రవాణాకు ప్రాధాన్యత

రాష్ట్రంలో 888 కిలోమీరట్ల మేర ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్‌ను ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది. దీనికి సంబంధించి ఇటీవల అసెంబ్లీలోనూ బిల్లు పెట్టింది. నూతన పారిశ్రామిక విధానంలో ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్‌కు ఎక్కువ ప్రాధాన్యత కల్పించారు. కేంద్రం తీసుకొచ్చిన ఈ విధానానికి రాష్ట్ర వేగంగా అమల్లోకి తెచ్చే ప్రయత్నాలు మొదలుపెట్టింది.

అదానీలకు ఉపయోగం

ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 974 కిలోమీటర్ల తీర ప్రాంతంలో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, రోడ్డు రవాణా, రైలు మార్గాలన్నిటినీ కేంద్రం అదానీ కంపెనీలకు అప్పగించింది. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా వారికి కావాల్సిన మార్కెట్‌ను కల్పించే బాధ్యత కేంద్రం తీసుకుంది. ప్రస్తుత పాలసీలో ప్రభుత్వం కేటాయించాలనుకున్న 48 వేల ఎకరాలూ వారి చేతుల్లోకి వెళ్లే అవకాశాలూ ఎక్కువగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

అదానీని కాపాడేందుకే



మోడీ సర్కార్ తీరుపై సీతారాం ఏచూరి

ప్రజలపై భారాలు పెరుగుతున్నాయి

ఐక్య పోరాటాలకు కలిసి రావాలని పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పెద్దయెత్తున దేశ సంపద లూటీ చేసిన అదానీకి కొమ్ముకాస్తున్న మోడీ ప్రభుత్వంపై ఐక్య పోరాటాలకు కలసి రావాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. రెండు రోజుల పాటు జరిగిన సిపిఎం పొలిట్ బ్యూరో సమావేశ నిర్ణయాలను సోమవారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. సిపిఎం ముద్రించిన 'పేలిపోతున్న అదానీ బుడగ' అనే బుక్‌లెట్‌ను ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు. ప్రతిపక్షాలను వేధించడానికి ఇడి, సిబిఐ దుర్వినియోగంతోపాటు నేర పరువునష్టం మార్గాన్ని బిజెపి ప్రభుత్వం ఎంచుకుందని ఆయన విమర్శించారు. 2024 ఎన్నికల్లో గెలుస్తామన్న నమ్మకం బిజెపికి లేదని, అందుకే ప్రతిపక్షాలను టార్గెట్ చేయడం, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయడం వంటి చర్యలకు పూనుకుంటున్నదన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, చట్టబద్ధమైన పాలనను కాపాడేందుకు అన్ని లౌకిక, ప్రజాతంత్ర శక్తులు కలసిరావాలని ఆయన కోరారు.

సమాధానం చెప్పాల్సి వస్తుందనే పార్లమెంట్‌ను నడవనీయటం లేదు

దేశంలో అదానీ గురించి ప్రతి రోజూ కొత్త కొత్త అంశాలు వెలుగులోకి వస్తున్నాయని, ప్రజల సంపదను అదానీకి దోచిపెడుతున్నారని ఏచూరి విమర్శించారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి వస్తుందనే పార్లమెంట్ సజావుగా నడవకుండా ప్రభుత్వం చూస్తుందని అన్నారు. ఈ ప్రశ్నలకు ప్రధాని మోడీ

మిగతా 7లో

తప్పుడు వార్తలు ప్రసారం చేయొద్దు

తప్పుడు వార్తలను ప్రసారం చేయడం మానుకోవాలని మీడియాకు సీతారాం ఏచూరి హితవు పలికారు. "బివి రాఘవులు ఎన్నికైన పొలిట్ బ్యూరో సభ్యులు. ప్రస్తుతం కూడా ఆయన పొలిట్ బ్యూరో సభ్యులుగానే ఉన్నారు. కొనసాగుతారు. రాఘవులు సమస్య ఏమీ లేదు" అని ఆయన స్పష్టం చేశారు. రాఘవులు లేఖకు సంబంధించి తాను మీడియాతో ఏమీ చెప్పలేదని, కానీ తాను చెప్పినట్లు ఒక ఛానెల్ (ఎబిఎన్ ఆంధ్రజ్యోతి) ప్రసారం చేసిందని పేర్కొన్నారు. దేశంలో నేర పరువు నష్టం కేసులు నడుస్తున్నాయని, జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్ పార్టీలో కొన్ని నిర్మాణ, అంతర్గత సమస్యలపై పొలిట్ బ్యూరోలో చర్చించాం. ఆయా సమస్యలపై నిర్ణయాలు తీసుకున్నాం. వాటిని రాష్ట్ర కమిటీలో చర్చించి అమలు చేస్తామని ఏచూరి తెలిపారు. ఎంఎ గఫూర్ రాజీనామా చేశారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఏచూరి స్పందిస్తూ తమకు అటువంటి సమాచారం ఏమీ రాలేదని, ఆయన పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడని అన్నారు. అసలు ఇలాంటి వార్తలు మీకు ఎలా వస్తున్నాయని విలేకరులను ప్రశ్నించారు.

నల్ల దుస్తులతో నిరసన ర్యాలీ

- పార్లమెంటులో కొనసాగిన ప్రతిపక్షాల ఆందోళన
- రాజ్యసభలో ఆర్థిక బిల్లు ఆమోదం

లోపలి పేజీలో..

ఎన్ఇపితో పేదలు విద్యకు దూరం

- పిల్లల మెదడుల్లో అశాస్త్రీయ భావజాలం
- ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు విపి సాను

లోపలి పేజీలో..

గురుకుల గెస్ట్ ఫ్యాకల్టీ వేతనాల పెంపు

- ఆమోదం తెలిపిన బిఒజి : మంత్రి మేరుగ నాగార్జున

మంత్రివర్గ విస్తరణపై...

గవర్నరుతో సిఎం సుదీర్ఘ చర్చ

- అసెంబ్లీలో పరిణామాలపై వివరణ



సోమవారం రాజ్ భవన్‌లో గవర్నర్ నజీర్‌తో ముచ్చటిస్తున్న ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గవర్నరు జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌తో సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. సాయంత్రం 5.05 నిమిషాలకు రాజ్‌భవన్‌కు చేరుకున్న సిఎం 6.30 గంటల వరకు గవర్నరుతో పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా క్యాబినెట్‌లో మార్పులు, చేర్పులు చేయనున్న విషయంతోపాటు రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలు, విశాఖలో ఈ నెల 28న జరగనున్న జి-20 ప్రతినిధుల సమావేశం గురించి కూడా చర్చించినట్లు తెలిసింది. సుప్రీంకోర్టులో నడుస్తున్న అమరావతి రాజధాని అంశం గురించి వీరి భేటీలో చర్చకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. రాజధాని అంశం, భూములిచ్చిన రైతుల డిమాండ్లపైన కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. గవర్నరు ప్రసంగంలో మూడు రాజధానుల అంశం ఎందుకు చేర్చలేకపోయామనే అంశం, న్యాయపరమైన అంశాల గురించి గవర్నరుకు సిఎం వివరణ ఇచ్చినట్లు తెలిసింది. ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వం మధ్య కుదిరిన ఎంఒయులు, ఆయా పరిశ్రమలు వేగవంతంగా గ్రౌండింగ్ అయ్యేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి సిఎం గవర్నరుకు వివరించారు. పట్టభద్రులు, ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార వైసిపి అనూహ్యంగా ఓటమిని చవిచూడటాన్ని ఆ పార్టీ జీర్ణించుకోలేకపోతున్నట్లు పార్టీలో చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర నుంచి మంత్రి సీదిరి అప్పలరాజు, రాయలసీమ నుంచి గుమ్మనూరు జయరామ్, ఉషశ్రీ చరణ్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఒకరిని మంత్రి పదవి నుంచి తొలగించనున్నట్లు గవర్నరు దృష్టికి సిఎం తీసుకెళ్ళినట్లు తెలిసింది. వీరి స్థానంలో సామాజిక వర్గాల సమీకరణాల వారీ లెక్కలు వేసుకుని కొత్తవారికి అవకాశం కల్పించే విషయాన్ని సిఎం, గవర్నరు వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. నూతన మంత్రి వర్గ విస్తరణ విషయాన్ని గవర్నరుకు ముందస్తుగా సిఎం సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలనుద్దేశించి గవర్నరు ప్రసంగం చేస్తున్న సమయంలో జరిగిన పరిణామాల పట్ల గవర్నరు కొంత కలత చెందినట్లు సమాచారం. సభలో అటువంటి పరిస్థితులకు దారి తీసిన కారణాలేమిటని, సిఎంను గవర్నరు వివరణ కోరినట్లు తెలిసింది. రంజాన్ ప్రారంభమైన సందర్భంగా గవర్నరు దంపతులకు సిఎం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

వివేకా హత్య కేసు సిబిఐపై సుప్రీం సీరియస్

- విచారణాధికారిని మార్చండి
- లేదా ఆయనతోపాటు మరొకరిని నియమించండి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు ఇంకా ఎంతకాలం విచారిస్తారని సిబిఐని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. కేసు విచారణ వేగవంతం చేయడానికి విచారణాధికారిని మార్చాలని, లేదా ప్రస్తుత విచారణ అధికారితో పాటు మరో అధికారిని నియమించాలని ఆదేశాలు జారీ చేసింది. దర్యాప్తు వేగంగా సాగటం లేదని, విచారణ అధికారి (ఐఒ)ని మార్చాలని కోరుతూ వివేకా హత్య కేసులో ఎ-5 నిందితుడిగా ఉన్న శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సిటి రవికుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది.

సిబిఐ దాఖలు చేసిన సీల్డ్ కవర్ నివేదికను మొత్తం చదివామని, అందులో రాజకీయ శత్రుత్వంతోనే వివేకా హత్య జరిగిందని పేర్కొన్నారని జస్టిస్ ఎంఆర్ షా అన్నారు. రాజకీయ శత్రుత్వమంటూ విచారణ జరిగితే, ఎప్పటికీ దోషులకు శిక్ష పడదని, హత్యకు గల ప్రధాన కారణాలు, దాని వెనుకున్న ఉద్దేశాలు బయటపెట్టాలని సిబిఐని ఆదేశించింది. స్టేటస్ రిపోర్టులో ఎలాంటి పురోగతి లేదని అసహనం వ్యక్తం చేసింది. తదుపరి దర్యాప్తు పేరుతో ఎంతకాలం సాగదీస్తారని నిలదీసింది. మెరిట్స్ మీద ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వడం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. సిబిఐ డైరెక్టరు నుంచి తగిన ఆదేశాలు తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించింది. కేసు విచారణను 29కు వాయిదా వేసింది.

ఎపి అసెంబ్లీ సెక్రటరీ జనరల్‌గా

రామాచార్యులు

- మూడేళ్ల కాలపరిమితితో కొత్తగా నియామకం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి కొత్తగా సెక్రటరీ జనరల్‌ను నియమించారు. రాజ్యసభ సెక్రటరీ జనరల్‌గా వ్యవహరించి రిటైరైన పిపికె రామాచార్యులును మూడేళ్ల కాలపరిమితితో నియమిస్తున్నట్లు లెజిస్లేచర్ సెక్రటరీ పి బాలకృష్ణమాచార్యులు ఉత్తర్వులు విడుదల చేశారు. ఈనెల 23వ తేదీన విడుదల చేసిన ఉత్తర్వులు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. 23వ తేదీ నుంచే నియామకం అమల్లోకి వచ్చినట్లు వాటిలో పేర్కొన్నారు. ఎపి లెజిస్లేచర్‌కు ఆయన ప్రధాన అధికారిగా ఉంటారని ఉత్తర్వుల్లో తెలిపారు. ఆయన 2017 జూన్‌లోనే కార్యదర్శిగా నియమితులు కాగా, నాలుగు నెలలు మాత్రమే ఆ పదవిలో కొనసాగారు.


జర్మనీలో అతిపెద్ద సమ్మె

- స్తంభించిన రవాణా రంగం

లోపలి పేజీలో..

పోలవరంపై పూటకో మాట

- ఎత్తు 45.72 మీటర్లని తెలిపిన కేంద్రం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం ప్రాజెక్టు ఎత్తు తదితర అంశాలపై కేంద్రప్రభుత్వం పూటకో మాట మాట్లాడుతోంది. పోలవరం మొదటి దశ నిర్మాణం 41.15 మీటర్ల ఎత్తు వరకేనని ఇటీవల కేంద్ర జలశక్తి సహాయమంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ లోక్‌సభలో లిఖిత పూర్వక సమాధానం ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా, ప్రాజెక్టు నీటి నిల్వ ఎత్తు 45.72 మీటర్లని కేంద్ర జలశక్తి సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు తెలిపారు. రాజ్యసభలో టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 1980 నాటి గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం.. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం ఎత్తు 45.72 మీటర్లని తెలిపారు. పోలవరం డ్యాం ఎఫ్ఆర్ఎల్ తగ్గింపునకు సంబంధించి రాష్ట్రప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదన చేసినట్టు సమాచారం లేదని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని 2017-18 సంవత్సరాల లెక్కల ప్రకారం రూ.55,548.87 కోట్లుగా 2019లో సవరించిన వ్యయ కమిటీ (ఆర్‌సిసి) చేసిన సిఫార్సును జలశక్తి సలహా కమిటీ ఆమోదించినా ఆ తరువాత వేసిన కమిటీ ఆ మొత్తాన్ని తగ్గిస్తూ సిఫార్సు చేశాయని తుడు తెలిపారు. కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానమిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 2020 మార్చిలో నియమించిన ఆర్‌సిసి పోలవరం అంచనా వ్యయాన్ని 2013-14 లెక్కల ప్రకారం రూ.29,027.95 కోట్లుగా, 2017-18 లెక్కల ప్రకారం రూ.47,725.74 కోట్లుగా సిఫార్సు చేసిందని మంత్రి వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటి వరకు రూ. 13,463.21 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.10,151 కోట్ల నుంచి రూ.55,548 కోట్లకు పెరిగినట్లు పేర్కొన్నారు. 2009 ఫిబ్రవరిలో రూ.10,151 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించిన పోలవరం ప్రాజెక్ట్ పూర్తి కావడానికి 2014 ధరలకు అనుగుణంగా సవరించిన అంచనాల ప్రకారం రూ.55,548 కోట్ల వ్యయం చేయాల్సి ఉంది. అంటే 2009లో నిర్ణయించిన అంచనా వ్యయం కంటే మరో రూ.45,397 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉన్నట్లు మంత్రి రావ్ ఇందర్‌జిత్ పేర్కొన్నారు.

పట్టణాలపై పన్నుల మోతకే!

- నేటి నుంచి 31 వరకూ విశాఖలో జి-20 దేశాల ఐడబ్ల్యుజి సమావేశాలు
- విశాఖకు 63 మంది దేశ, విదేశీ ప్రతినిధులు
- నేటి రాత్రి విందుకు హాజరు కానున్న సిఎం జగన్

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ వేదికగా ఈ నెల 28, 29 తేదీల్లో జి-20 దేశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ (ఐడబ్ల్యుజి)-2 సమావేశాలు, 30న శిక్షణ, 31న లక్ష్యాల దిశగా అవగాహన కార్యక్రమాలు జరగనున్నాయి. ఇప్పటికే ఈ సమావేశాల కోసం జిల్లా అధికార యంత్రాంగం విశాఖ సాగర తీరాన్ని భీమునిపట్నం వరకూ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతూ రూ.150 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టింది. దేశంలోని వివిధ నగరాలు, పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు అమలు చేసే ప్రాజెక్టులు, వాటిని పిపిపిలో ఎలా చేపట్టాలి? రెవెన్యూను మున్సిపాల్టీలు ఎలా పెంచుకోవాలి? బ్యాంకుల నుంచి రుణం పొందాలంటే ఎలాంటి ఆస్తి పన్ను, యూజర్ ఛార్జీలు, ఇతరత్రా వడ్డనలకు సంబంధించి ఏ తరహా చర్యలు తీసుకోవాలన్నదే ప్రధాన అజెండాగా కనిపిస్తోంది. పట్టణాల్లో పెరుగుతున్న జనాభా అవసరాలు నెరవేరేందుకు నగరాల్లో సుస్థిర ఆర్థిక ప్రగతికి పిపిపి ప్రాజెక్టులు అత్యంత కీలకమంటూ ఈ జి-20 సమావేశాల్లో చర్చించనున్నట్లు తెలుస్తోంది. పట్టణాలు, నగరాల్లో పలు ప్రాజెక్టులకు సాయం అందించే ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, ఐఎంఎఫ్, ఒఇసిడి దేశాల ప్రతినిధులు జి-20లో కీలక పాత్ర పోషిస్తున్నారు.

నగర వాసులపై ఆస్తి పన్ను, సేవల పన్నులు వంటివి అజెండా కానున్నాయి. పట్టణాలు అభివృద్ధి కావాలంటే ఫండింగ్ ఉండాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చేవే కాకుండా సొంతంగా వనరులను కూడబెట్టుకోవడం ఎలా? అన్నది జి-20 సమావేశాల్లో 28, 29 తేదీల్లో ప్రధానంగా చర్చించనున్నారు. దేశంలోని సూరత్, విశాఖ, నాగపూర్‌లో బాగానే పన్నుల వసూళ్లు జరుగుతున్నట్లు జి-20 దేశాలకు ప్రస్తుతం నాయకత్వం వహిస్తోన్న భారత్ ప్రతినిధులు భావిస్తున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మంగళవారం రాత్రి విశాఖ వచ్చి జి-20 దేశాల ప్రతినిధులతో విందులో పాల్గొననున్నారు. అనంతరం తాడేపల్లి వెళ్లనున్నారు.

పట్టణీకరణ ప్రపంచంలో ఒక ట్రెండ్ అయింది : సోలోమన్



ప్రపంచంలో పట్టణీకరణ ఒక ట్రెండ్‌గా మారిందని, దీనిపై సుదీర్ఘంగా జి-20 సమావేశాల్లో చర్చించనున్నామని భారతదేశ జి-20 ప్రతినిధి, ఐఎఎస్ మాజీ అధికారి సోలోమన్ ఆరోకియా రాజ్ చెప్పారు. మీడియాతో సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం మధ్యాహ్నం ఐడబ్ల్యుజి జి-20 సమావేశాలు విశాఖ నగరంలోని రాడిసన్ బ్లూ లో ప్రారంభం కానున్నాయని, 20 దేశాలు పాల్గొంటాయని, 63 మంది ప్రతినిధులకుగానూ 57 మంది ట్రావెల్ మ్యాప్‌ను తమకు అందజేశారని తెలిపారు. ప్రపంచ జనాభాలో 50 శాతం పట్టణాలకు తరలిపోయిందని, దీనివల్ల 80 శాతం ప్రపంచ జిడిపి పట్టణాల నుంచే వస్తోందని చెప్పారు. 2050 నాటికి ఇది 70 శాతానికి చేరుతుందన్నారు. ఈ ట్రెండ్‌కనుగుణంగా మౌలిక వసతులు పెంచుకునే దిశగా జి-20 దేశాలు వ్యూహాలు, లక్ష్యాలను నిర్దేశించుకుంటాయని చెప్పారు. జి-20 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ కాన్‌క్లేవ్ ఈ ఏడాది జనవరిలో పూణెలో జరిగిందన్నారు. ఇది రెండో సమావేశమని చెప్పారు. ఈ నెల 30న ఆయా దేశాల ప్రతినిధులకు శిక్షణా కార్యక్రమం, 31న దేశంలోని మున్సిపల్ కమిషనర్లు, యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్‌లు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంక్, పిపిపి పెట్టుబడులకు సిద్ధమయ్యే సంస్థలతో అవగాహన కార్యక్రమం జరగనున్నాయన్నారు. ఈ నెల 31న యూనివర్సిటీల విసిలు, విద్యార్థులతో రాడిసన్ బ్లూ లో ఇంటరాక్షన్ ఉంటుందని తెలిపారు. తొలిరోజు మంగళవారం మూడు సెషన్స్, రెండో రోజు నాలుగు సెషన్స్ ఉంటాయని చెప్పారు. రెండో రోజు పట్టణాలు, నగరాల సమ్మిళిత అభివృద్ధిపై జి-20 దేశాల ప్రతినిధుల నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్ ఉంటుందని తెలిపారు. 30న జి-20 దేశాలకు చెందిన ప్రతినిధులకు ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను సింగపూర్, దక్షిణ కొరియా ప్రతినిధులు ఆయా దేశాల్లో అమలైన పలు ప్రాజెక్టులు ఎలా విజయవంతమయ్యాయో వివరిస్తారని చెప్పారు. 31న దేశంలోని మున్సిపల్ కమిషనర్‌లకు సింగపూర్, సౌత్ కొరియా నిపుణులు అవగాహన కల్పించనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో అమన్ గార్గ్, జితేంద్ర సింగ్ రాజ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ మినీ వర్కర్స్‌కు వేసవి సెలవులు ఇవ్వాలి

- మహిళా స్త్రీ శిశుసంక్షేమశాఖ డైరెక్టరుకు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎండల తీవ్రతతో ఏప్రిల్ 1 నుంచి అంగన్‌వాడీ సెంటర్లు మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఒంటిపూట నిర్వహించాలని, మినీ వర్కర్లకు వేసవిలో సెలవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐసిడిఎస్ డైరెక్టరుకు సోమవారం వినతిపత్రం ఇచ్చినట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి బేబిరాణి, కె సుబ్బరావమ్మ, ఎన్‌సిహెచ్ సుప్రజ, పి దీప్తిమనోజ పేర్కొన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో అంగన్‌వాడీ సెంటర్లకు వస్తున్న ప్రిస్కూల్ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇస్తున్న విధంగానే అంగన్‌వాడీ సెంటర్లకూ ఏప్రిల్ 1 నుంచి ఒంటిపూట బడులు జరిగేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

31న విద్యుత్ మీటర్ రీడర్స్ నిరసన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న మీటర్ రీడర్స్ సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 31న జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని విద్యుత్ మీటర్ రీడర్స్ గౌరవాధ్యక్షులు మిరియాల బాలకాశి తెలిపారు. విజయవాడలో విద్యుత్ మీటర్ రీడర్స్ రాష్ట్ర స్థాయి విస్తృతస్థాయి సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ఎం బాలకాశి మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చాక మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కారం కాకపోగా, మరింత పెరిగాయని అన్నారు. వేతనాలు పెంచకుండా చాలా కాలంగా అమలవుతున్న వేతనాలను కూడా తగ్గించేలా చర్యలు తీసుకుందని విమర్శించారు. పనిదినాలను తగ్గించి వేతనాలను తగ్గించేలా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఎస్‌పిడిసిఎల్, సిపిడిసిఎల్ పరిధిలో పనిదినాలు 12 రోజులు వుంటే.. ఇప్పుడు ఏడు రోజులకే కుదిస్తున్నారని తెలిపారు. ఇపిడిసిఎల్ పరిధిలో 16 రోజులున్న పనిదినాలు 14 రోజులకు తగ్గించారన్నారు. రేట్లు కూడా తగ్గించేశారన్నారు. ఈ సమస్యలను పరిష్కరించి, వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న నిరసనలు చేపట్టాలని, ఏప్రిల్ 18 తేదీ తర్వాత మంత్రి ఇంటిని ముట్టడించేందుకు సమాయత్తం కావాలని కోరారు. సమావేశంలో మీటర్ రీడర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ హజరత్‌వలి, అధ్యక్షులు ఎల్ రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కె శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే బిసిలకు రాజకీయ అవకాశం

- మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిసిలకు టిడిపితోనే రాజకీయంగా అవకాశాలు లభించాయని మాజీ మంత్రి, టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు కొల్లు రవీంద్ర అన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో సాధికార సమితి సమావేశం సోమవారం జరిగింది. బిసిలను దగా చేస్తున్న సిఎం జగన్‌కు గుణపాఠం చెప్పబోతున్నారని రవీంద్ర పేర్కొన్నారు. కార్పొరేషన్ల ద్వారా నిధులివ్వకుండా దగా చేశారని విమర్శించారు. కుల వృత్తిచేసుకునే వారికి ఉచిత విద్యుత్, ముడి సరుకులపై ఇచ్చే సబ్సిడీలు వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వచ్చే నెల నుంచి చేపట్టబోయే బిసి సాధికార సమితి సభ్యుల సమావేశాలను దిగ్విజయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు టిడి జనార్ధన్, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ, హెచ్‌ఆర్‌డి ఛైర్మన్ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు 'కోవెల'

ప్రజాశక్తి - తాళ్లరేవు(కాకినాడ జిల్లా)

తల్లిదండ్రులపై ఉన్న గౌరవంతో వారి కుమారులు కోవెల కట్టారు. కాకినాడ జిల్లా కోరంగి పంచాయతీ బొడ్డు చిన వెంకటాయ పాలెం గ్రామానికి చెందిన బొడ్డు సత్యనారాయణ, బొడ్డు కృష్ణమూర్తి అన్నదమ్ములు. వారి తల్లిదండ్రులైన బొడ్డు బైరవస్వామి, నాగమాంబలకు కోరంగి గ్రామం ముఖద్వారంలో ఎసి సుబ్బా రాయుడు సెంటర్‌లో కోవెల నిర్మించారు. అందులో గతించిన వారి తల్లిదండ్రుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. నేటితరం యువతీ, యువకులకు తల్లిదండ్రుల ప్రాముఖ్యత తెలియజేయాలనే ఆకాంక్షతో కోవెల నిర్మించినట్లు బొడ్డు సోదరులు తెలిపారు.

గవర్నరుతో బిజెపి నేతల భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్‌తో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు నేతృత్వంలోని ప్రతినిధుల బృందం సోమవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా శాసనసభలో దళిత క్రైస్తవులకు ఎస్‌సి రిజర్వేషన్ కల్పించాలంటూ చేసిన తీర్మానం ప్రవర్తనా నియమావళికి విరుద్ధమంటూ గవర్నరుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం సోము వీర్రాజు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని రద్దు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని, భవిష్యత్తులో ఇటువంటి ప్రయత్నాలను విరమించుకునేలా చూడాలని గవర్నరును కోరినట్లు తెలిపారు. మతం పేరుతో రిజర్వేషన్ల అంశం శాసనసభలో తీర్మానం ఎలా చేస్తారని, అంబేద్కర్ ఆలోచనలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసిందన్నారు.

ఎన్ఇపితో పేదలు విద్యకు దూరం

- పిల్లల మెదడుల్లో అశాస్త్రీయ భావజాలం
- ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు విపి సాను



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు సాను

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన విద్యా విధానం (ఎన్ఇపి) వల్ల పేద విద్యార్థులు విద్యకు దూరమవుతారని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు విపి సాను ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ఇపి ద్వారా అశాస్త్రీయమైన భావజాలాన్ని పాఠ్యాంశాల్లో చొప్పించడంతోపాటు చరిత్రను వక్రీకరించేందుకు పూనుకుంటుందని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'నూతన జాతీయ విద్యావిధానం - విద్యారంగంపై ప్రభావం- ప్రత్యామ్నాయ విద్యావిధానం' అనే అంశంపై విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో సోమవారం సదస్సు జరిగింది. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సాను మాట్లాడుతూ.. ఇప్పటికే బెనారస్ యూనివర్సిటీ వంటి వాటిల్లో పిడకలు వేయడం, చిలకజోస్యం వంటి కోర్సులను తీసుకొచ్చారని తెలిపారు. కర్ణాటకలో భగత్‌సింగ్ పాఠ్యాంశాన్ని తీసివేశారని పేర్కొన్నారు.

బ్రిటీష్ వారికి క్షమాపణ కోరుతూ లేఖలు రాసిన విడి సావర్కర్‌ను చేర్చారని తెలిపారు. విద్యారంగంలో ఇటువంటి వింత పోకడలకు బిజెపి ఆజ్యం పోస్తోందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలను ప్రవేశపెట్టబోతుందని, వీటిల్లో ఇంకెన్ని దారుణాలు చూడాల్సి వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా హిందీని దేశంపై రుద్దేందుకు కుట్ర జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒకే దేశం, ఒకే భాష, ఒకే మతం, ఒకే సంస్కృతి నినాదం వెనుక ఆర్ఎస్ఎస్ కుట్ర దాగి ఉందని, ఇది ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను ఎన్ఇపితో కేంద్రం తన చేతుల్లోకి లాక్కుంటుందని పేర్కొన్నారు. దీని ద్వారా రాష్ట్రాల హక్కులను కాలరాసేందుకు కుట్ర జరుగుతుందని విమర్శించారు. అందువల్లే ఎన్ఇపిని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. దీనికి ప్రత్యామ్నాయంగా అందరికీ అందుబాటులో ఉండే శాస్త్రీయ విద్యావిధానాన్ని ఎస్ఎఫ్ఐ తయారుచేసి వెబ్‌సైట్‌లో పొందుపరిచిందని, దీనిపై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. విద్యలో కేంద్రం పెత్తనం పెరిగేందుకు, విద్యను వ్యాపారం చేసేందుకు, విద్యలో కాషాయీకరణ జోడించేలా ఎన్ఇపి-2020 ఉందని విమర్శించారు. ఇప్పటికే ఈ విధానాన్ని కేరళ, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అమలుకు పూనుకోవడం బాధాకరమన్నారు. ఇప్పటికే ఎన్ఇపి పేరుతో తరగతుల విలీనం, నాలుగేళ్ల డిగ్రీ, ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు వంటివి అమలు చేస్తున్నాయని విమర్శించారు. ముక్తకంఠంతో దీనిని వ్యతిరేకించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ అశోక్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న ప్రసంగించిన ఈ కార్యక్రమంలో ఎం సోమేశ్వరరావు, ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాల గెజిట్‌ను సవాల్ చేస్తూ పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని అమరావతిలో ఆర్-5 జోన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఈ నెల 21న జారీ చేసిన గెజిట్ 337ను సవాల్ చేస్తూ గుంటూరు జిల్లా కృష్ణాయపాలెం గ్రామస్తుడు ఎ నందకిషోర్ హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్రంలోని పేదలకు అమరావతిలోని 900 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను మార్పు చేసి ఆర్-5 జోన్ ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం జారీ చేసిన గెజిట్‌ను రద్దు చేయాలని పిటిషనరు పిటిషన్‌లో హైకోర్టును కోరారు.

రాజధానియేతర ప్రాంతాలకు చెందిన పేదలకు రాజధానిలో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం గతంలో సిఆర్‌డిఎ చట్ట సవరణ చేసింది. దీనిని సవాల్ చేసిన వ్యాజ్యాలు హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారణలో ఉన్నాయి. అప్పటికే విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, తాడేపల్లి, పెదకాకాణి, మంగళగిరి దుగ్గిరాల మండలాలు, తాడేపల్లి, మంగళగిరి మున్సిపాల్టీల పరిధిలోని రాజధాని కోసం సేకరించిన భూమిలో 1,251 ఎకరాలను ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు జిఓ 107 జారీ చేసింది. ఈ జిఓను హైకోర్టు సస్పెన్షన్‌లో పెట్టింది. అప్పటికే 107 జిఓపై దాఖలైన కేసుతో ఆ కేసును విచారిస్తామని హైకోర్టు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. గెజిట్ నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనరు కోరుతున్నారు. గ్రామసభలకు విరుద్ధంగా ఉన్న గెజిట్‌ను రద్దు చేస్తూ తీర్పు చెప్పాలని కోరారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా గెజిట్ ఉందని ప్రకటించాలన్నారు. ఇందులో మున్సిపల్, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శులు, గుంటూరు జిల్లా కలెక్టరు, సిఆర్‌డిఎ కమిషనర్, కృష్ణాయపాలెం గ్రామ కార్యదర్శి, తదితరులను ప్రతివాదులుగా చేశారు. ఈ వ్యాజ్యాన్ని హైకోర్టు విచారణ చేయనుంది.



దీక్షల్లో పాల్గొన్న ఎయిమ్స్ సెక్యూరిటీ గార్డులు

ఎయిమ్స్ సెక్యూరిటీ గార్డుల నిరసన దీక్ష

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

తొలగించిన 71 మందిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎయిమ్స్ ప్రధాన ద్వారం వద్ద సెక్యూరిటీ గార్డులు సోమవారం వద్ద నిరసన దీక్ష ప్రారంభించారు. దీక్షలను సిఐటియు జిల్లా నాయకులు జెవి రాఘవులు ప్రారంభించి, మాట్లాడారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఏలా తొలగిస్తారని అధికారులను ప్రశ్నించారు. తొలగించిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ ఎస్ చంగయ్య మాట్లాడుతూ..ఎయిమ్స్ అధికారులు సెక్యూరిటీ గార్డ్స్ పట్ల వివక్షత చూపుతున్నారని విమర్శించారు. సిఐటియు రాజధాని కమిటీ అధ్యక్షులు ఎం రవి దీక్షలకు మద్దతు తెలియజేస్తూ మాట్లాడారు. ముందుగా మంగళగిరి పట్టణంలో సిఐటియు కార్యాలయం నుంచి ఎయిమ్స్ గేటు వరకు సెక్యూరిటీ గార్డులు ప్రదర్శన నిర్వహించారు.



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న నారా లోకేష్

పన్నుల భారాలు తగ్గిస్తాం

- యువగళంలో లోకేష్

ప్రజాశక్తి-గోరంట్ల టౌన్ (సత్యసాయి జిల్లా)

2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తోందని, అధికారంలోకి రాగానే ప్రజలపై పన్నుల భారం తగ్గిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పేరులో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 52వ రోజు శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం తిప్పరాజుపల్లి నుంచి మొదలైంది. యాత్ర గోరంట్ల మీదుగా గుమ్మయ్యగారిపల్లెకు చేరుకుంది. గోరంట్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి హవా కొనసాగడంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వణుకు పుడుతోందని చెప్పారు. మద్యపాన నిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మద్యాన్ని ఏరులైపారిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నా... డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలోకి రాగానే ప్రతి సంవత్సరం జాబ్ క్యాలండర్ విడుదల చేస్తామన్నారు. గత పభుత్వ హయాంలో రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్పును అందించామని తెలిపారు. అభివృద్ధిని మరచి పాలన సాగిస్తున్న జగన్మోహన్‌రెడ్డికి ఓటుతో బుద్ధిచెప్పాలని కోరారు.. తాము ఎదుర్కొంటున్న సమస్యలను వడ్డేర, నాయీ బ్రహ్మణులు లోకేష్‌కు వివరించారు. టిడిపి అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని లోకేష్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, టిడిపి రాష్ట్ర నాయకులు సబితమ్మ, మాజీ ఎంపి నిమ్మలకిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

దళిత టీచర్ హత్య కేసులో నిందితుడిని శిక్షించాలి

- నార్పల బంద్ - అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి-నార్పల (అనంతపురం)



పోలీసు స్టేషన్‌లో ఉన్న దళిత సంఘాల నాయకులు

దళిత యువతిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నార్పల మండల బంద్‌కు పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఎంఆర్‌పిఎస్, కెవిపిఎస్, సిపిఎం నాయకులు నార్పలలో నిరసన ప్రదర్శన చేపట్టేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి కుళ్లాయప్ప, ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు పుల్లప్ప, చంద్ర, రాజు, తదితరులను అరెస్టు చేసి, నార్పల పోలీసు స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సొంతపూచీకత్తుపై వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. దళిత యువతిని దారుణంగా హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. లేకుంటే ఈ ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్త ఆందోళనగా మారుస్తామని హెచ్చరించారు. అనంతపురం జిల్లా నార్పల మండలం బొందలవాడ గ్రామానికి చెందిన ప్రయివేటు దళిత ఉపాధ్యాయురాలు రమాదేవి ఈ నెల 24న దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. అదే గ్రామానికి చెందిన జాఫర్‌వలీ అనే వ్యక్తి ఈ యువతిని హత్య చేసి చెరువులో మృతదేహాన్ని పడేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ ఘటనపై గత నాలుగు రోజులుగా వామపక్ష పార్టీలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి.

ఎమ్మెల్యేను అడ్డుకున్న దళిత సంఘాలు

శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని ఎస్‌సి, ఎస్‌టి సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి ఆధ్వర్యంలో దళితులు అడ్డుకున్నారు. బొందలవాడ గ్రామానికి సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే రాగా ఆమెను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పి, అక్కడి నుంచి ఎమ్మెల్యే వెనుదిరిగారు.

టిడిపి నాయకులు నన్ను సంప్రదించారు

- గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనూరాధకు ఓటు వేయాలని ఆ పార్టీ నాయకులు కొంత మంది తనకు ఫోన్లు చేశారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ తెలిపారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కుట్రలు, కుతంత్రాలు, ఎమ్మెల్యేల కొనుగోలు, వెన్నుపోటు రాజకీయాలు చేయడంలో చంద్రబాబు దిట్ట అని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు వారం ముందు రోజుల నుండి టిడిపి నేతలు నన్ను సంప్రదించారని చెప్పారు. టిడిపి నాయకుడు తొండెపు దశరథ జనార్ధన్ ఫోన్ చేసినా తాను ఫోన్ ఎత్తలేదని కాల్ డేటాను మీడియా ముందు ప్రదర్శించారు.

ఎమ్మెల్యేల విశ్వాసం కోల్పోయిన జగన్

- మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ0

అమరావతి బ్యూరో : సిఎం జగన్ తన సొంత పార్టీ ఎమ్మెల్యేల విశ్వాసం కోల్పోయారని మాజీ ఎంపి, టిడిపి నేత కొనకళ్ల నారాయణ విమర్శించారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే కాదనుకుంటున్న వ్యక్తిని ప్రజలు ఎలా నమ్ముతారని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ నియంతృత్వ విధానాలే ఆయన పతనానికి బాటలు వేస్తున్నాయని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న వారిని డబ్బుతో కొనే అలవాటు జగన్‌కు, ఆయన పార్టీకే ఉందని విమర్శించారు. దళిత ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవిని వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలే ఎదురుదాడి చేస్తున్నారని తెలిపారు.

గురుకుల గెస్ట్ ఫ్యాకల్టీ వేతనాల పెంపు

- ఆమోదం తెలిపిన బిఒజి
- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్‌సి గురుకులాల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ వేతనాలు పెంచేందుకు బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ (బిఒజి)లో నిర్ణయం తీసుకున్నామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున వెల్లడించారు. వీటిల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్లు, పిజిటిలు, టిజిటిలు, స్టాఫ్ నర్స్, హెల్త్ సూపర్‌వైజర్, పిడి, పిఇటిలు మొత్తం 1,697 మంది ఉన్నారని తెలిపారు. వేతనాలను రూ.4,550 నుంచి రూ.8,050 వరకు పెంచుతామని వెల్లడించారు. సోమవారం జరిగిన 71వ బిఒజి సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. స్టాఫ్‌నర్సులు, హాస్టల్ కేర్‌టేకర్లు, లైబ్రేరియన్లను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ గానీ, అవుట్‌సోర్సింగ్ విధానంలో గానీ నియమించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి రావాలని తెలిపారు.

ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌పి, డిపిఐపి పాఠశాలల్లో పోస్టుల మంజూరుకు సంబంధించిన ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేయాలన్నారు. గురుకులాల్లో రూ.6.18 కోట్లతో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకు సంబంధించిన టెండర్ పూర్తయిందని తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం రూ.65.8 కోట్ల వ్యయంతో సోలార్ విద్యుత్ సరఫరా వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గురుకులాల్లో విద్యార్థులు మరణిస్తే సొసైటీ అందించే మొత్తాలను కూడా రెట్టింపు చేయాలన్న ప్రతిపాదనకు కూడా బోర్డు ఆమోదం తెలిపిందని చెప్పారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి జి జయలక్ష్మి, డైరెక్టర్ కె హర్షవర్ధన్, గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్ పావనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'పీలేరు భూ అక్రమాలపై విచారణ చేపట్టాలి'

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పీలేరు భూ అక్రమాలపై సిఐడితో గానీ, సిబిఐతో గానీ దర్యాప్తు జరిపించాలని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు సోమవారం లేఖ రాశారు. పీలేరులో భూ అక్రమాలపై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. భూ మాఫియాపై చర్యలు తీసుకోకపోగా సహకరిస్తుండటం విస్మయం కలిగిస్తోందని పేర్కొన్నారు. ఇక్కడ ఒక్కచోటే 601.37 ఎకరాల భూమిని భూ మాఫియా దోచుకుందని విమర్శించారు.

స్మార్ట్ మీటర్లపై కేంద్రం షరతులు తిరస్కరించాలి

రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అదనపు లోడు, పీక్ డిమాండ్ పేరిట ప్రజలపై దొడ్డిదారిన విద్యుత్ భారాలు వేయాలని కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని, ఈ ప్రతిపాదనలను తిరస్కరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్ల ద్వారా వినియోగదారులకు తెలియకుండా విద్యుత్ భారాలు మోపాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆదేశించడాన్ని ఖండిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. కనెక్టెడ్ లోడ్ కన్నా ఎక్కువ వినియోగిస్తే ఆ మేరకు అదనంగా ఛార్జీలు వసూలు చేయాలని, డిమాండ్ అధికంగా ఉన్న సమయంలో విద్యుత్ వినియోగిస్తే 20 శాతం అధికంగా ఛార్జీలు వసూలు చేయాలని కేంద్రం ఆదేశించిందని పేర్కొన్నారు. ఈ మేరకు తీసుకువచ్చిన ఎలక్ట్రిసిటీ (రైట్ ఆఫ్ కన్స్యూమర్) సవరణ రూల్స్-2023 ముసాయిదాపై ఏప్రిల్ 14 లోపు అభిప్రాయాలు చెప్పాలని రాష్ట్రాలను కోరిందని వివరించారు. విద్యుత్ వినియోగదార్లపై దొంగదెబ్బ తీసే ఈ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం నిర్ద్వంద్వంగా తిరస్కరించాలని డిమాండ్ చేశారు.

గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తీసుకునే సమయంలో వినియోగదారు వాడుకునే విద్యుత్ ఉపకరణాలను బట్టి కిలో వాట్, 2 కిలోవాట్, 3 కిలోవాట్... ఇలా లోడ్ ప్రకారం డిస్కంలు కనెక్షన్లు ఇస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం గృహ వినియోగదారుల నుంచి డిస్కంలు కిలోవాట్ లోడ్ కన్సంషన్ డిపాజిట్ రూ.1750, రెండు కిలోవాట్స్‌కు రూ.3,750 వసూలు చేస్తున్నాయని తెలిపారు. వినియోగదారు తీసుకున్న లోడ్‌కంటే అదనంగా మూడు నెలలు వాడకం పెరిగితే పెరిగిన కేటగిరీకి మార్చాలని తెలిపిందని వివరించారు. స్మార్ట్ మీటర్ల ద్వారా దీనిని లెక్కించాలని కేంద్రం తెలిపిందని పేర్కొన్నారు. లోడ్ పెరిగితే కేటగిరీ మార్చాలన్న కేంద్రం తీసుకున్న లోడ్ కంటే తగ్గితే ఇవ్వాల్సిన మినహాయింపునకు మాత్రం వెసులుబాటు కల్పించలేదన్నారు. ఇది కేంద్రం మోసకారితనాన్ని వెల్లడిస్తోందని విమర్శించారు. విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న సమయంలో వినియోగదారుల నుంచి 20 శాతం అధికంగా ఛార్జీలు వసూలు చేయాలని, దీనికోసం టైం ఆఫ్ డే (టిఒడి) విధానాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. 2024 ఏప్రిల్ 1లోపు పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు, ఇతర వినియోగదారులకు 2025 ఏప్రిల్ 1లోపు ఈ విధానాన్ని అమలు చేయాలని గడువులు విధించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ షరతులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రయత్నాలను తిప్పికొట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో మాట్లాడుతున్న సిఎం జగన్

విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో భాగస్వాములు కండి

- ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో తమ ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలతో ముందుకు వెళుతోందని, మరింత ముందుకు వెళ్లేందుకు ప్రపంచబ్యాంకు తమ ప్రభుత్వంలో మరింత భాగస్వామ్యం కావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సిఎంతో సోమవారం భేటీ అయ్యింది. ప్రపంచ బ్యాంకు భారత డైరెక్టర్ ఆగస్టే టానో కౌమె, ప్రతినిధులు సుదీప్ ముజుందార్, కార్తీక్ పెంటల్, ఆండ్రూ డి తదితరులు సిఎంతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతో అమలవుతున్న ఎపి ప్రజారోగ్య బలోపేతం, ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఎడ్యుకేషన్ (సాల్ట్), ఎపి ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టుల అమలు తీరుపై వారు ముఖ్యమంత్రితో చర్చించారు. తమ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రంలో కార్యక్రమాలు అమలవుతున్నాయని ప్రతినిధి బృందం కితాబిచ్చింది. దేశంలోని 22 రాష్ట్రాలకు తాము రుణాలు అందిస్తున్నామని, విద్య, వైద్యరంగాల్లో ఆంధ్రప్రదేశ్ దేశానికే మార్గదర్శకంగా వుందని తెలిపారు. సిఎం జగన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలపై మరింత సమగ్రంగా అధ్యయనం చేసి మరింత సహకారాన్ని అందించాలన్నారు. విద్యారంగంలో 12 రకాల మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. బోధన పద్ధతులను పూర్తిగా మార్చివేస్తున్నామని తెలిపారు. డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ప్రైవేటు స్కూళ్లకంటే మెరుగైన బోధన వుండాలనే లక్ష్యంతో ముందుకు పోతున్నామన్నారు. రాష్ట్రంలో ఆరు పోర్టులు వున్నాయని, మరో నాలుగు రాబోతున్నాయని తెలిపారు. వైద్యారోగ్యశాఖలో కొత్తగా సుమారు 40 వేలమందికి పైగా సిబ్బందిని నియమించడం, 17 మెడికల్ కాలేజీలు నిర్మించడం వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆర్థికంగానే కాకుండా మంచి విధానాలను అమలు చేయడంలో, సాంకేతికంగానూ తమకు సహకారం అందించాలని సిఎం కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెఎసి ఛైర్మన్ జగ్గునాయుడు

1న మానవహారం

ఉక్కు అమ్మకాన్ని నిలిపివేస్తూ పార్లమెంట్‌లో ప్రకటన చేయాలి : జెఎసి పిలుపు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

ఏప్రిల్ 1వ తేదీన జరిగే మానవహారం కార్యక్రమానికి విశాఖ కార్మిక వర్గం, ప్రజలు హాజరై జయప్రదం చేయాలని జెఎసి పిలుపునిచ్చింది. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ విశాఖ కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు ఏప్రిల్ ఒకటినాటికి రెండేళ్లు పూర్తవుతున్నందున ఆ రోజు ఉదయం పది గంటలకు ఈ కార్యక్రమం నిర్మించనున్నారు. ఈ సందర్భంగా జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో సోమవారం పడాల రమణ అధ్యక్షతన జెఎసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు మాట్లాడుతూ, దేశ ప్రజల సంపదను మోడీ ప్రభుత్వ అనుకూల కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. దీనిలో భాగంగా అశేష త్యాగలతో సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిందని, ఈ దేశద్రోహ నిర్ణయానికి వ్యతిరేకంగా రెండేళ్లుగా ఉద్యమం జరుగుతోందన్నారు. బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపరుస్తోందన్నారు. ప్లాంటుకు వర్కింగ్ క్యాపిటల్, సొంత గనులు ఇవ్వడం లేదని, ముడి ఖనిజం, బొగ్గు తదితర ముడిసరుకుల సరఫరాకు ఆటంకాలు సృష్టిస్తూ ఉత్పత్తిని దెబ్బతీసి నష్టాల్లోకి నెడుతోందని తెలిపారు. ప్రయివేటు ఉక్కు పరిశ్రమలకు రూ.లక్షల కోట్లు అప్పులున్నాయని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేవలం రూ.20వేల కోట్లు మాత్రమే అప్పు ఉందని అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం జరిగితే రూ.మూడు లక్షల కోట్ల ప్రజల ఆస్తి ప్రయివేటు పరమవుతుందని తెలిపారు. రాష్ట్రంలోని పార్లమెంట్ సభ్యులందరూ పార్టీలకతీతంగా పోరాడాలని కోరారు. ప్రతిపక్ష పార్టీల సహకారం తీసుకొని పార్లమెంటును స్తంభింప చేయాలని జగన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జెఎసి ఛైర్మన్ ఎం జగ్గునాయుడు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్, ఎఐటియుసి, సిఎఫ్‌టియు, ఐఎఫ్‌టియు, ఎఐఎఫ్‌టియు, వైఎస్‌ఆర్‌టియుసి, ఐద్వా, ప్రజానాట్యమండలి, డివైఎఫ్ఐ, కెవిపిఎస్, మోటారు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కొనడం, అమ్మడమే చంద్రబాబు రాజకీయం

అమరావతి బ్యూరో : ఎమ్మెల్యేలను కొనడం, అమ్మడమే చంద్రబాబు నాయుడు రాజకీయమని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. చంద్రబాబు రాజకీయమే ఫిరాయింపులతో మొదలైందన్నారు.సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు అంటేనే నయవంచన, నమ్మకద్రోహం, వెన్నుపోటు అని విమర్శించారు. ఉండవల్లి శ్రీదేవి స్వార్థ రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఆమెకు నియోజకవర్గంలో ఆదరణ తగ్గిందని సిఎం జగన్ ఆమె దృష్టికి తీసుకెళ్లడంతో తనకు టిక్కెట్ రాదని వైసిపిపై అభాండాలు వేస్తున్నారని పేర్కొన్నారు.

ఐఇడి బాంబు పేలి జవాన్ మృతి

ప్రజాశక్తి-చింతూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా


విజయ్ (ఫైల్)

మావోయిస్టులు అమర్చిన ఐఇడి ప్రెషర్ బాంబ్ పేలి జవాన్ మృతి చెందిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎటపల్లి పోలీస్ క్యాంపునకు ఒక కిలోమీటర్ దూరంలో తొకరీ సమీపంలో బాంబు శబ్దం రావటంతో జవాన్లు అటువైపుగా పరుగులు తీశారు. బాంబు పేలిన స్థలంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాజ్పూర్ గ్రామానికి చెందిన సిఎఎఫ్ అసిస్టెంట్ ఫ్లయింగ్ కమాండర్ విజయ్ మృతి చెంది ఉన్నారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

నళిని చిదంబరం పిటిషన్‌కు కవిత పిటిషన్ ట్యాగ్

- 3 వారాల పాటు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహిళలను ఇడి కార్యాలయానికి పిలిచి విచారణ జరిపే విషయంలో కేంద్ర మాజీ మంత్రి పి చిదంబరం భార్య నళిని చిదంబరం 2018లో దాఖలు చేసిన పిటిషన్‌కు బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం ట్యాగ్ చేసింది. అనంతరం మూడు వారాలపాటు విచారణను వాయిదా వేసింది. ఒక మహిళగా తనకు ఉన్న హక్కులను ఇడి కాలరాస్తోందంటూ సుప్రీంకోర్టులో కె కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. కవిత తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు.

రూ.33 వేల కోట్లతో మౌలిక వసతులు

- గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ దొరబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



గృహ నిర్మాణ సంస్థ 31వ బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ ఛైర్మన్ దొరబాబు

నిర్మాణాల్లో ఉన్న జగనన్న కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ.33 వేలకోట్లను వ్యయం చేస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ దవులూరి దొరబాబు తెలిపారు. విజయవాడలోని గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఛైర్మన్ దొరబాబు అధ్యక్షతన గృహ నిర్మాణ సంస్థ 31వ బోర్డు సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. కాలనీల్లో రహదారుల నిర్మాణానికి రూ.10,408 కోట్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు రూ.5,237 కోట్లు, భూగర్భ డ్రెయినేజీకి రూ.798 కోట్లు, మంచినీటి సరఫరాకు రూ.2,980 కోట్లు, విద్యుత్ సరఫరాకు రూ.4,560 కోట్లు, ఇంటర్నెట్ సదుపాయానికి రూ.707.48 కోట్లు, రెండోదశ పనులకు రూ.7,809 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. ఇప్పటి వరకు విద్యుదీకరణ పనులు 3,485 కాలనీల్లో పూర్తి కాగా, మరో 5,363 లే అవుట్లలో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. 2,37,701 మంది లబ్ధిదారుల ఇళ్లకు విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేశామని దొరబాబు పేర్కొన్నారు.

జల్‌జీవన్ పథకం కింద మంచినీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. 2,31,966 మంది లబ్ధిదారులకు మంచినీటి సౌకర్యం ఇంతవరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,127 స్వాగత ద్వారాలు ఏర్పాటుచేశామన్నారు. కాలనీల్లో తాత్కాలికంగా మౌలిక సదుపాయాల కోసం రూ.1,650 కోట్లను ప్రభుత్వం ఖర్చు పెడుతోందన్నారు. గృహ నిర్మాణ సంస్థ ఎమ్‌డి లక్ష్మీషా మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. రాష్ట్రంలో 18.63 లక్షల ఇళ్ల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయని, 2024 మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. బోర్డు సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టరు ఎం శివప్రసాద్, చీఫ్ ఇంజినీరు జివి ప్రసాద్, గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

సందర్శకుల కోసం పది విద్యుత్ ధర్మరథాలు

- ప్రారంభించిన టిటిడి ఛైర్మన్
- విరాళంగా అందించిన మేఘా సంస్థ

ప్రజాశక్తి- తిరుమల



భక్తులకు సేవలందించడానికి సిద్ధంగా ఉన్న బస్సులు

తిరుమలలో సందర్శకులను ఉచితంగా రవాణా చేసేందుకు పది నూతన విద్యుత్ ధర్మరథాలను టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి సోమవారం ప్రారంభించారు.

ఒలెక్ట్రా సంస్థకు చెందిన రూ.18 కోట్లు విలువైన ఈ విద్యుత్ బస్సులను హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థ టిటిడికి విరాళంగా అందజేసింది. తిరుమలలోని రాంభగీచా విశ్రాంతి గహాల వద్ద ధర్మరథాలను ఛైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తిరుమలలో పర్యావరణ పరిరక్షణ కోసం వాహన కాలుష్యాన్ని తగ్గించడానికి డీజిల్ వాహనాల స్థానంలో దశలవారీగా విద్యుత్ వాహనాలు ప్రవేశపెట్టాలని టిటిడి బోర్డు నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా మొదటిదశలో తిరుమలలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు 35 విద్యుత్ కార్లు ఇచ్చామని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తిరుమల-తిరుపతి మధ్య ఎపిఎస్‌ఆర్‌టిసి 65 విద్యుత్ బస్సులు నడుపుతోందని అన్నారు. ఏప్రిల్ 15 నుంచి భక్తులకు ఈ బస్సులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒలెక్ట్రా సంస్థ సిఎండి కెవి.ప్రదీప్, టిటిడి చీఫ్ ఇంజినీర్ శ్రీనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలవరంపై 3 నెలలపాటు విచారణ వాయిదా వేయండి

- ఇంకా సంప్రదింపుల దశలోనే సిఎంలు, కేంద్ర మంత్రి మధ్య భేటీ
- సుప్రీం కోర్టుకు కేంద్ర ప్రభుత్వం లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం ముంపుపై దాఖలైన పిటిషన్ల విచారణను వాయిదా వేయాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కేంద్ర ప్రభుత్వం కోరింది. మూడు నెలలపాటు విచారణను వాయిదా వేయాలని కోరుతూ లేఖ రాసింది. పోలవరం ప్రాజెక్టు వరద ముంపు తలెత్తుతున్నందున దానికి పరిష్కార మార్గాలు చూపాలని ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లు సోమవారం సుప్రీం కోర్టు విచారణ జాబితాలో ఉన్నాయి. ఈ పిటిషన్లు జస్టిస్ జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ హస్నుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ముందు విచారణకు రానున్న నేపథ్యంలో సుప్రీం కోర్టుకు కేంద్రం లేఖ రాసింది. 2022 సెప్టెంబరు 6న సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాల ప్రకారం నివేదికను ఖరారు చేయడానికి కొంత సమయం అవసరమని లేఖలో పేర్కొంది. కేంద్ర జలశక్తిశాఖ మంత్రి, ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు మధ్య సమావేశం ఇంకా సంప్రదింపుల దశలోనే ఉందని తెలిపింది.

పొరుగు రాష్ట్రాల్లో ముంపుపై కేంద్రం జోక్యం చేసుకోవాలని, భాగస్వాములతో సమావేశం నిర్వహించాలని, అవసరమైతే ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చొని మిగిలిపోయిన సమస్యలు పరిష్కరించుకోవాలని గతేడాది సెప్టెంబరు 6న సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో తుది నివేదిక అందించడానికి మూడు నెలల సమయం కావాలని కోరుతూ ఉన్నత న్యాయస్థానానికి కేంద్రం లేఖ సమర్పించింది. అందుకే ఈ కేసును మూడు నెలల పాటు వాయిదా వేయాలని కోరింది.

ప్రాధాన్యం లేని 'ప్రాధాన్యత ప్రాజెక్టులు'

- అత్తెసరు కేటాయింపులతో పూర్తయ్యేదెన్నడు?
- రైతుల ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సత్వరం పూర్తి చేస్తామంటూ వైసిపి ప్రభుత్వం చేపట్టిన ప్రాధాన్యత ప్రాజెక్టులకు కూడా బడ్జెట్‌లో అత్తెసరు కేటాయింపులే ఉండటం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత, మలి ప్రాధాన్యత అంటూ మూడేళ్ల క్రితం ప్రకటించిన 42 ప్రాజెక్టుల్లో ఇప్పటి వరకూ పూర్తయినవి కేవలం రెండు మాత్రమే. మిగిలిన ప్రాజెక్టులనూ పూర్తి చేసేందుకు కాలపరిమితి లక్ష్యం పెట్టుకున్నా.. దానికనుగుణంగా ఏ ప్రాజెక్టూ ముందుకు సాగలేదు. రాష్ట్రానికి కీలకమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని కూడా 41.15 మీటర్లకు పరిమితం చేస్తూ.. రైతులను ఆందోళనలోకి నెట్టేసింది. పోలవరంలో కీలకమైన భూసేకరణ పనులు నత్తనడకన నడుస్తున్నాయి. 2021 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామన్న పోలవరం ప్రాజెక్టును ఇప్పుడు 41.15 మీటర్లను పూర్తి చేసేందుకే ఇంకా 18 నెలలు సమయం పడుతుందంటున్న ప్రభుత్వం.. పూర్తిస్థాయిలో 45.7 మీటర్లకు ఎప్పుడు పూర్తి చేస్తుందో చెప్పలేని పరిస్థితిలో ఉంది. పోలవరం కింద పునరావాస పనులు 25 శాతం కూడా పూర్తికాలేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.5,042 కోట్లను మాత్రమే కేటాయించారు. జగన్ ప్రభుత్వం 2019 నవంబరులో ప్రాధాన్యత ప్రాజెక్టులను గుర్తించి, వాటిని తక్షణమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. 2020-21 నాటికి నెల్లూరు బ్యారేజీ, సంగం బ్యారేజీ, అవుకు రెండో టన్నల్, వంశధార-నాగావళి అనుసంధానం, వంశధార రేండో ఫేజ్, వెలిగొండ టన్నల్ నుండి నీరు పారిస్తామని చెప్పారు.

సంగం, నెల్లూరు బ్యారేజీలు మినహా మరే ప్రాజెక్టూ పూర్తికాలేదు. రాయలసీమ ఎత్తిపోతల పథకం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ఎర్రబల్లి పోతుల, రాజోలి రిజర్వాయర్, ఆర్‌డిఎస్ కుడికాలువ, గాలేరు నగరి సుజల స్రవంతి, హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టులను తొలి ప్రాధాన్యత కింద చేర్చారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి ఇంకా రూ.2 వేల కోట్లు అవసరం కాగా, ఈ బడ్జెట్‌లో కేవలం రూ.101 కోట్లను కేటాయించారు. అవుకు టన్నల్ ఇప్పటిదాకా కేవలం 58 శాతం మాత్రమే పూర్తికాగా, ప్రభుత్వం 2023కు పూర్తి చేస్తామని చెబుతోంది. రూ.3,255 కోట్లతో చేపట్టిన వంశధార ప్రాజెక్టు స్టేజ్-2 పనులకు ఇప్పటి వరకూ రూ.2,113 కోట్లను ఖర్చు చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తికి ఇంకా రూ.వెయ్యి కోట్లకు పైగా నిధులు అవసరం కాగా, ఈ బడ్జెట్‌లో కేవలం రూ.180.73 కోట్లను మాత్రమే ప్రభుత్వం కేటాయించింది. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ఫేజ్-1, 2 పూర్తి అయ్యేందుకు ఇంకా రూ.4 వేలకోట్లు అవసరం కాగా, కేవలం ఈ బడ్జెట్‌లో రూ.122.69 కోట్లను కేటాయించింది. గాలేరు నగరి పూర్తికి ఇంకా రూ.4 వేలకోట్లకుపైగా అవసరం కాగా, రూ.855 కోట్లను కేటాయించింది. వేదవతి, ఆర్‌డిఎస్ కుడికాలువకు ఒక్క పైసా విదల్చని పరిస్థితి ఉంది. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి రూ.లక్ష కోట్లకు పైగా అవసరం కాగా.. రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో కేవలం రూ.11,908 కోట్లను కేటాయించింది. ఇలా అరకొర కేటాయింపులతో రాష్ట్రంలోని ఏ ప్రాజెక్టూ పూర్తయ్యే పరిస్థితి లేదని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

నాటక రంగ దినోత్సవ శుభాకాంక్షలు : పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమాహార కళ అయిన నాటకం, వర్తమాన సమాజాన్ని, మానవ జీవితాలను, భిన్న మనస్తత్వాలను ప్రతి తరంలోనూ ఆవిష్కరిస్తూనే ఉంటుందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ప్రపంచ నాటక రంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాటక రంగం నుంచి వచ్చిన నటులు, దర్శకులు తదుపరి వెండితెరపైన కావచ్చు, బుల్లి తెరపైన కావచ్చు తమ కళను ప్రదర్శించడంలో తమదైన ప్రత్యేకతను చూపుతూనే ఉన్నారన్నారు. తాను నటుడుగా కెమెరా ముందుకు వచ్చేందుకు విశాఖపట్నంలో సత్యానంద్ దగ్గర శిక్షణ పొందానని, ఆయన తమతో నాటికలు, నాటకాలు, వీధి నాటకాలు ప్రదర్శింపజేయించేవారని, నటనలో మెలకువలు చెప్పేవారని అన్నారు.

నడక మార్గాల్లో దివ్యదర్శనం టోకెన్లు

- టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి- తిరుమల

సందర్శకుల కోరిక మేరకు ఏప్రిల్ ఒకటి నుంచి ప్రయోగాత్మకంగా వారం రోజుల పాటు అలిపిరి మార్గంలో పది వేలు, శ్రీవారిమెట్టు మార్గంలో ఐదు వేల దివ్యదర్శనం టోకెన్లు మంజూరు చేస్తామని, ఆ తరువాత వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకుంటామని టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి వెల్లడించారు.

తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం ఇఒ ఎవి.ధర్మారెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. వేసవి దృష్ట్యా ఏప్రిల్ 15 నుంచి జులై 15 వరకూ భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఈ దృష్ట్యా సందర్శకులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ విఐపి బ్రేక్, శ్రీవాణి, టూరిజం కోటా, వర్చువల్ సేవలు, రూ.300 దర్శన టికెట్లు తగ్గించనున్నామని తెలిపారు. ఈ మూడు నెలల పాటు విఐపిలు సిఫారసు లేఖలను తగ్గించాలని కోరారు. శ్రీవారి దర్శనం కోసం సామాన్య భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా త్వరితగతిన దర్శనం కల్పించడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఆలయ మాఢ వీధులు, రద్దీ ఉన్న ప్రాంతాల్లో కూల్ పెయింటింగ్ వేస్తామని తెలిపారు. తిరుమలలో 7500కు పైగా గదులు ఉన్నాయని, వీటిలో 40 వేల మందికి సరిపడా వసతి అందుబాటులో ఉందన్నారు. దాదాపు 85శాతం గదులు సామాన్యుల కోసమే కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల ప్రవేశపెట్టి ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా గదుల కేటాయింపులో పారదర్శకతను పెంచడం జరిగిందని తెలిపారు.

గంటన్నరలో 3.26 లక్షల టికెట్లు బుకింగ్

తిరుమల శ్రీవారి టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. ఏప్రిల్ మాసానికి సంబంధించిన రూ.300 ప్రత్యేక దర్శన టికెట్లను టిటిడి సోమవారం ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. 3.26 లక్షల టికెట్లు కేవలం గంటన్నర వ్యవధిలోనే సందర్శకులు బుక్ చేసుకున్నారు. గతంలో 45 నిమిషాల్లో టికెట్లు మొత్తం అమ్ముడుపోయిన సందర్భాలు ఉన్నాయి.


కోటమ్మ భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం జగన్

వరికూటి కోటమ్మకు సిఎం నివాళి

- కుటుంబసభ్యులకు భరోసా

ప్రజాశక్తి-టంగుటూరు (ప్రకాశం జిల్లా)

వైసిపి ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి మాతృమూర్తి వరికూటి కోటమ్మ (82) భౌతికకాయాన్ని సోమవారం సిఎం జగన్మోహన్‌రెడ్డి సందర్శించి.. నివాళులర్పించారు. కోటమ్మ కుటుంబసభ్యులు వరికూటి అశోక్‌బాబు, ఆయన సతీమణి లక్ష్మి, వరికూటి అమృతపాణి, ఆయన సతీమణి పశుసంవర్ధక శాఖ జెడిఎ డాక్టర్ బేబీరాణి, ఇతర కుటుంబ సభ్యులను సిఎం పరామర్శించారు. వయోభారంతో శనివారం ఉదయం కోటమ్మ మరణించిన విషయం తెలిసిందే. ఆమె భౌతికకాయానికి సిఎం జగన్‌తో పాటు మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, జడ్‌పి ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ నివాళులర్పించారు. కోటమ్మ స్వగ్రామం ప్రకాశం జిల్లాలోని టంగుటూరు మండలం కారుమంచి గ్రామంలో ఆమె అంత్యక్రియలు ముగిశాయి.

అచ్చెన్న హత్య కేసులో ముగ్గురు అరెస్టు

- సూత్రధారి అసిస్టెంట్ సర్జన్ సుభాష్ చంద్రబోసు : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చెన్న అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. ఆయనది హత్యగా నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్‌పి అన్బురాజన్ సోమవార విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. డిడి అచ్చెన్నను ఈనెల 12న పశుసంవర్ధక శాఖలో పనిచేసే అసిస్టెంట్ సర్జన్ సుభాష్‌చంద్రబోస్, కలసపాడుకు చెందిన బావలూరి చెన్నకృష్ణ, గుర్రంకొండకు చెందిన బాలాజీ నాయక్ బలవంతంగా వాహనంలోకి ఎక్కించి రాయచోటికి తీసుకెళ్లారు. ఆయనకు మద్యం తాగించి అదే రోజు మధ్యాహ్నం గువ్వల చెవురు ఘాట్ లోయలో పడేశారు. సాక్ష్యాధారాలను రూపుమాపేందుకు అచ్చెన్న మొబైల్‌ను తీసుకుని ఫోన్ ఒక చోట, సిమ్ కార్డు మరో చోట పారవేశారు. తన తండ్రి కనిపించడం లేదని ఈనెల 14న తన కుమారుడు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 24న గువ్వలచెరువు ఘాట్‌లో అచ్చెన్న అనుమానాస్ప స్థితిలో మృతిచెందినట్లు పోలీసులు గుర్తించారు. ఈనెల 26న సాయంత్రం ముగ్గురు నిందితులు కడప విఆర్ఓ ఎదుట లొంగిపోయి తమ నేరాన్ని అంగీకరించారని ఎస్‌పి తెలిపారు. వీరిని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు విఆర్ఓ అప్పగించగా జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచామన్నారు. పశుసంవర్ధకశాఖలో విధుల్లో ఉన్న డాక్టర్ అచ్చెన్న, డాక్టర్ సుభాష్‌చంద్రబోస్ మధ్య తీవ్ర మనస్పర్ధలున్నాయని, ఇదే హత్యకు ప్రధాన కారణమని తెలిపారు.

ఫస్ట్ సిటిజన్ బ్యాంక్ చేతికి ఎస్‌విబి

వాషింగ్టన్ : తీవ్ర సంక్షోభంలో చిక్కుకుని దివాళా తీసిన సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌విబి)ని ఫస్ట్ సిటిజన్ బ్యాంక్ కొనుగోలు చేసింది. ఫెడరల్ డిపాజిట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎఫ్‌డిఐసి) స్వాధీనంలో ఉన్న ఎస్‌విబి డిపాజిట్లు, రుణాలను ఫస్ట్ సిటిజన్స్ బ్యాంక్ ఆధీనంలోకి వచ్చాయి. దీంతో సోమవారం నుంచి ఎస్‌విబి ఖాతాదారులందరూ ఇకపై ఫస్ట్ సిటిజన్ బ్యాంక్ ఖాతాదారులుగా మారనున్నారు. 2023 మార్చి 10 నాటికి ఎస్‌విబికి 167 బిలియన్ డాలర్ల ఆస్తులు, 119 బిలియన్ డాలర్ల డిపాజిట్లు ఉన్నాయి. ఫస్ట్ సిటిజన్ బ్యాంక్‌కు ప్రస్తుతం 109 బిలియన్ డాలర్ల ఆస్తులు, 89.4 బిలియన్ డాలర్ల డిపాజిట్లు ఉన్నాయి. తాజా కొనుగోలు నేపథ్యంలో ద్రవ్య లభ్యత సమస్య తలెత్తకుండా ఫస్ట్ సిటిజన్ బ్యాంక్‌కు ఎఫ్‌డిఐసి రుణ మద్దతును అందించనుంది.

సంపాదకీయం

విపక్షాలపై కక్ష

పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి జైలు శిక్ష, వెనువెంటనే ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దు.. కేంద్ర బిజెపి ముందే రాసి పెట్టుకున్న స్క్రిప్టుగా దేశ ప్రజలందరూ భావిస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులపై పథకం ప్రకారం ఇ.డి, సిబిఐ, ఎన్ఐఎ, ఐటి, ఇత్యాది వ్యవస్థలను ఉసిగొల్పి ఇబ్బందులు పెట్టడం మోడీ ప్రభుత్వానికి నిత్యకృత్యమైంది. ఆ పరంపరలో భాగమే రాహుల్ గాంధీ కేసు. నాలుగేళ్లనాడు 2019 ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీనుద్దేశించి రాహుల్ చేసిన రాజకీయ వ్యాఖ్యలు గుజరాత్ లోని కోట్లాది మంది ఒబిసి కులస్తులందరి పరువుకు నష్టం కలిగించిందన్నది అభియోగం. కర్ణాటకలోని కోలార్‌లో రాహుల్ విమర్శ చేస్తే గుజరాత్‌కు చెందిన బిజెపి ఎంఎల్ఎ పూర్ణేశ్ మోడీ సూరత్ చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో పరువు నష్టం (క్రిమినల్) కేసు వేశారు. విచారించిన కోర్టు గురువారం రాహుల్‌ను దోషిగా నిర్ధారించి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. బెయిల్ మంజూరు చేసి పైకోర్టులో అప్పీల్ చేసుకోవడానికి నెల గడువిచ్చింది. సూరత్ కోర్టు తీర్పు వెలువడిన ఇరవైనాలుగ్గంటల్లోపే రాజ్యాంగంలోని అధికరణలు, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధనలు ఉటంకిస్తూ లోక్‌సభ సెక్రటరీ జనరల్, రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. ఒకదాని వెంట మరో సన్నివేశం ఆవిష్కృతమైన తీరు బిజెపి పక్కా స్కెచ్‌ను తెలుపుతూనే ఉంది.

బిజెపి జమానాలో బ్యాంకులకు రూ.వేల కోట్లు ఎగనామం పెట్టి విదేశాలకు పారిపోయిన కరడుగట్టిన ఆర్థిక నేరస్థులైన లలిత్ మోడీ, నీరవ్ మోడీ వంటి వారి పేర్లను ఎన్నికల ప్రచారంలో ప్రస్తావించడం రాజకీయ విమర్శ అవుతుంది తప్ప ఒక నిర్దిష్ట కులానికి, ఇంటి పేరు కలిగిన వారికి మాత్రమే వర్తించదు. కానీ సూరత్ కోర్టు రాహుల్‌కు రెండేళ్ల జైలు విధించింది. ఐపిసి సెక్షన్ 499 కింద రెండేళ్ల జైలు పడటం ఇదే తొలిసారని న్యాయ నిపుణులు చెబుతున్నారు. సూరత్ మెజిస్ట్రేట్ నియామకం, హడావుడిగా సెలవుల్లేకుండా కేసు విచారణ, రెండేళ్ల జైలు శిక్ష విధింపు అసాధారణం. ఈ ప్రహసనాన్ని బట్టే రాజకీయ ప్రేరేపితం అనే భావన కలుగుతుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం (1951)లోని క్లాజ్ 8 ప్రకారం ఏదైనా కేసులో దోషిగా నిర్ధారణై రెండేళ్లకు తగ్గకుండా శిక్ష పడితే అటువంటి వ్యక్తి రాజ్యాంగ పదవులకు అనర్హుడవుతాడు. ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలుండదు. శిక్షా కాలమంతా ఎన్నికలకు దూరంగా ఉండాలి. వయనాడ్ ఎంపిగా ఉన్న రాహుల్‌గాంధీ భవిష్యత్తులో ఎనిమిదేళ్లపాటు ఎన్నికలకు దూరంగా ఉండాలి. ఈ పూర్వరంగంలో రాహుల్‌ను రాజకీయంగా సమాధి చేసేందుకు బిజెపి రచించిన పథకమని అర్థమవుతుంది. గతంలోనూ రాహుల్ గాంధీని నిలువరించడానికి బిజెపి ప్రయత్నించింది. 'దేశ్‌కా చౌకీదార్ చోర్ హై' అన్న వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు దాకా వెళ్లి క్షమాపణలు చెప్పించింది. అప్పటి కేసును సూరత్ కోర్టు ప్రస్తావిస్తూ రాహుల్ ప్రవర్తనలో మార్పు రానందున రెండేళ్ల జైలు శిక్ష విధిస్తున్నామన్న భాష్యం విస్తుగొల్పుతుంది.

లోక్‌సభ సెక్రటరీ జనరల్ ధోరణి మరీ అభ్యంతరకరం. కోర్టు తీర్పు వచ్చిందో లేదో ఆగమేఘాలపై రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసి పడేశారు. నేర స్వభావాన్ని పరిశీలించలేదు. న్యాయ నిపుణుల అభిప్రాయం తీసుకోలేదు. ఇవేమీ ఆలోచించలేదంటే ఆ వ్యవస్థపై మోడీ ప్రభుత్వ ఒత్తిడి ఉంది. వ్యవస్థలను తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడంలో మోడీ ప్రభుత్వానిది అందె వేసిన చెయ్యి. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే పార్టీలను నిరంకుశంగా అణచివేయడం బిజెపికి రివాజైపోయింది. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛను మోడీ ప్రభుత్వం హరిస్తోంది. పార్లమెంట్‌ను ప్రభుత్వమే అడ్డుకోవడం బిజెపి ప్రజాస్వామ్య హననానికి పరాకాష్ట. అదానీ కుంభకోణాల నుంచి దృష్టి మళ్లించే పన్నాగం. ఆర్థిక నేరగాడు అదానీతో బిజెపి సంబంధాన్ని పార్లమెంట్‌లో ఎలుగెత్తడం గిట్టకే రాహుల్‌పై అనర్హత వేశారు. ప్రతిపక్షాలను లేకుండా చేయడం ప్రజాస్వామ్యానికి విఘాతం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అన్ని పార్టీలూ ఉద్యమించాలి.

మహనీయుల మాట




దేశభక్తి మన చివరి ఆధ్యాత్మిక మజిలీ కాకూడదు. నేను వజ్రాల ధరనిచ్చి గాజు పూసలు కొనుక్కోను. నా జీవిత కాలంలో ఎన్నడూ దేశభక్తి-మానవత్వాన్ని అధిగమించనీయను.

- రవీంద్రనాథ్ టాగూర్,
విశ్వకవి

Rabindranath Tagore

కుప్పకూలుతున్న అమెరికన్ బ్యాంకులు


ప్రభాత్ పట్నాయక్

అమెరికా లోని సిలికాన్ వ్యాలీ బ్యాంక్, సిగ్నేచర్ బ్యాంక్‌లు కుప్ప కూలడం వెనక ఉన్న కారణాలు అంత నిగూఢమైనవీ కావు, అర్థం చేసుకోలేనివేమీ కాదు. అంతే కాదు, పెట్టుబడిదారీ ప్రపంచంలోని యావత్తు బ్యాంకింగ్ వ్యవస్థ పైన కారుమబ్బులు కమ్ముకోవడం కూడా అటువంటి విషయమే. ఒకసారి ఆ వ్యవస్థలో కొన్ని భాగాలు పతనం అవుతాయి, ఇంకోవైపు తక్కిన భాగంలోని సంస్థలు మోయలేనంత "విషపూరిత" ఆస్తులతో (పారు బకాయిలు, దివాళాకు సిద్ధంగా ఉన్న కంపెనీల షేర్లు వగైరాలతో) సతమతం అవుతూంటాయి. నిజానికి ఈ విషపూరిత ఆస్తులు పతనం చెందిన సంస్థల నష్టాలే. ఆ విధంగా మునిగిపోతున్న పార్శ్వం తక్కిన భాగంలోని సంస్థలను దిగలాగుతూ వుంటుంది. తన బ్యాంకింగ్ వ్యవస్థ ఇంత తీవ్రమైన ఒత్తిడిలో పడిపోయే పరిస్థితిలోకి అమెరికన్ పెట్టుబడిదారీ విధానం ఎలా నెట్టబడింది? అన్నదే ఇక్కడ అసలు ప్రశ్న. బ్యాంకులు పతనం కావడం, అందునా సిలికాన్ వ్యాలీ బ్యాంక్ వంటిది పతనం కావడం కేవలం ఆ బ్యాంక్‌కి మాత్రమే సంబంధించిన అంతర్గత విషయం కాదు. అది అక్కడ వ్యవస్థలో తలెత్తిన వైరుధ్యాన్ని ప్రతిఫలిస్తోంది. ఇంతకూ ఏమిటా వైరుధ్యం?

ఈ రెండు బ్యాంకులూ పతనం చెందడం వెనుక మనకు కనిపించే తక్షణ కారణం వడ్డీ రేట్లు పెరగడం. ఇక్కడ మనం ప్రస్తుతానికి సిలికాన్ వ్యాలీ బ్యాంక్ వ్యవహారానికి మాత్రమే పరిమితం అవుదాం. ఎందుకంటే అక్కడి వ్యవస్థ లోని వైరుధ్యాన్ని ఆ బ్యాంకు ఉదంతం స్పష్టంగా వెల్లడి చేస్తోంది. అదే సిగ్నేచర్ బ్యాంక్ వ్యవహారం చూస్తే కాస్త భిన్నంగా ఉంటుంది. ఆ బ్యాంక్ ఎక్కువగా క్రిప్టో కరెన్సీ లావాదేవీలను నడిపింది. ఆ క్రిప్టో కరెన్సీలు దారుణమైన విధంగా అస్థిరతకు లోనవుతాయన్న సంగతి తెలిసినదే.

వడ్డీ రేట్లు పెరిగితే బాండ్ల ధరలు వాటంతట అవే తగ్గుతాయి. ఒక బాండు ఎంత కాలానికి ఇవ్వబడిందో ఆ మొత్తం కాలం అంతటికీ (దానినే బాండు జీవితకాలం అంటారు) దానిపై వచ్చే నిజ ఆదాయం బట్టి బాండు ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారపడి వుంటుంది (ఉదాహరణకు: ఒక బాండు మీద పదేళ్ళ తర్వాత 10 శాతం అదనంగా ఇస్తాం అని చెప్పి బాండు అమ్మారనుకుందాం. బాండును కొన్ననాటికి రూపాయి విలువ కన్నా పదేళ్ళ తర్వాత ఆ రూపాయి విలువ పడిపోతే, అప్పుడు ఆ బాండు ద్వారా వచ్చే నిజ ఆదాయం తగ్గుతుంది). అందుచేత బ్యాంకుల వడ్డీ రేట్లు పెరిగితే కరెన్సీ నిజవిలువ తగ్గుతుంది గనుక బాండ్ల మార్కెట్ విలువ తగ్గిపోతుంది. అప్పుడు బ్యాంకు వద్ద తనఖా కింద ఉన్న బాండ్లకు విలువ తగ్గిపోతుంది. అంటే బ్యాంకు దగ్గర ఉన్న ఆస్తుల విలువ తగ్గుతుంది. ఆ మేరకు సాపేక్షంగా అప్పుల భారం పెరుగుతుంది. దాని వలన బ్యాంకులు ఒత్తిడికి లోనవుతాయి.

ఈ ఒత్తిడిని అధిగమించడానికి బ్యాంకు ఏవైనా చర్యలు చేపడితే అప్పుడు ఆ బ్యాంకు తాను ఒత్తిడిలో ఉన్నట్టు ఈ ప్రపంచం ముందు అంగీకరించినట్టు అవుతుంది. అటువంటి చర్యలు చేపట్టగానే ప్రజలకు దానిపై నమ్మకం సన్నగిల్లుతుంది. దానివలన ఆ బ్యాంకు వాటాల విలువ పడిపోతుంది. వాటాల విలువ పడిపోయిందని తెలియగానే డిపాజిటర్లు గాభరా పడి తమ డిపాజిట్లను వాపసు తీసుకోవడం ప్రారంభిస్తారు. ఒకసారి డిపాజిట్లు వెనక్కి తీసుకోవడం మొదలవగానే ఆ బ్యాంకు ఒక్కసారిగా కుప్పకూలుతుంది. అంటే



ఒకసారి బ్యాంకు ఒత్తిడికి లోనయితే, ఆ పైన దాని నుండి బైటపడడానికి అది ఏమి చేసినా అది పతనానికే దారి తీస్తుంది. ఒత్తిడిని అధిగమించడానికి చర్యలు చేపడితే ఏమౌతుందో చెప్పాం. ఒకవేళ ఏ చర్యలూ చేపట్టకుండా వుంటే అప్పుడు కూడా పతనం ఖాయం. అందుచేత ఆ బ్యాంకు పతనానికి బాధ్యత అంతా ఆ బ్యాంకుదే అని నెట్టెయ్యలేము. ఆ దేశంలోని స్థూల ఆర్థిక విధానాల ప్రభావం ఏమిటన్న దానిని పరిశీలించాలి.

వడ్డీ రేట్లు పెంచగానే బ్యాంకులు పతనం చెందుతాయన్న అభిప్రాయానికి ముందు చెప్పిన వాదనను బట్టి వచ్చేయకూడదు. రిజర్వు బ్యాంకు ఆదేశాల మేరకు వడ్డీ రేట్లలో మార్పులు చిన్న చిన్న మోతాదుల్లో జరుగుతూ వుంటాయి. ఒక చిన్న మోతాదులో వడ్డీ రేటు పెరిగితే దాని ఫలితంగా బ్యాంకు మీద వచ్చే ఒత్తిడిని తట్టుకోవడం సాధ్యమే. మార్కెట్‌లో ఎటువంటి అలజడికీ తావు ఇవ్వకుండా బ్యాంకులు తట్టుకోగలుగుతాయి. కాని హఠాత్తుగా కేంద్ర రిజర్వు బ్యాంకు వడ్డీ రేటును గణనీయంగా పెంచివేసిందనుకోండి. అప్పుడు తమ ఆస్తులు-అప్పుల నడుమ సమతూకం కొనసాగే విధంగా ఎటువంటి గందరగోళానికీ తావు లేకుండా చర్యలు తీసుకోవడం బ్యాంకులకు అసాధ్యం అయిపోతుంది.

ఇప్పుడు అమెరికాలో వడ్డీ రేట్లను అక్కడి ఫెడరల్ రిజర్వు గణనీయంగా పెంచింది. 2022 ఫిబ్రవరిలో 0.25 శాతం ఉన్న వడ్డీ రేటు ఫిబ్రవరి 2023 వచ్చేసరికి అమాంతం 4.75 కి పెరిగింది. ఇంత తక్కువ వ్యవధిలో అంత ఎక్కువ స్థాయిలో వడ్డీ రేటును పెంచినందువలన బ్యాంకులు తమ బ్యాలెన్స్ షీట్లను సర్దుబాటు చేసుకోవడం వాటికి అసాధ్యమే అయింది. ఇక్కడ ప్రశ్న ఏమంటే, అమెరికన్ ఫెడరల్ రిజర్వుబ్యాంకు ఎందుకు ఇంత హఠాత్తుగా ఇంత ఎక్కువ మోతాదులో పెంచింది?

నయా ఉదారవాద వ్యవస్థలో ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలో జోక్యం చేసుకోగలిగిన ఒకే ఒక్క దారి అది అనుసరించే ద్రవ్య విధానమే. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థలో చాలా కాలం పాటు ప్రభుత్వం జోక్యం చేసుకోగలిగింది. అలా జోక్యం చేసుకోగలిగిన శక్తి నయా ఉదారవాద కాలంలో బాగా తగ్గిపోయింది. జిడిపితో పోల్చినప్పుడు ద్రవ్యలోటు ఒకానొక స్థాయికి మించకుండా ఉండాలనే షరతును అంతర్జాతీయ ద్రవ్య

> **వడ్డీ రేట్లు తగ్గిపోయి, దానివలన బాండ్ల విలువలు పెరిగిపోతే, దాని కారణంగా ఆర్థిక వ్యవస్థ వేగం పుంజుకోవడం జరిగినా, జరగకున్నా, బ్యాంకింగ్ వ్యవస్థకు మాత్రం దానివలన ఎటువంటి ముప్పూ ఉండదు. బ్యాంకుల ఆస్తుల విలువలు పెరగడం ఆ బ్యాంకులను ఏ విధంగానూ దెబ్బ తీయదు. కాని, వడ్డీ రేట్లు పెరిగి, బాండ్ల విలువలు పడిపోతే, బ్యాంకుల ఆస్తుల విలువలు వాటి అప్పుల విలువలతో పోల్చినప్పుడు పడిపోతాయి. దీని వలన మార్కెట్‌లో ప్రతిస్పందనలు కలుగుతాయి. అప్పుడు బ్యాంకులు తమ వ్యాపారాన్ని కొనసాగించలేని పరిస్థితులు వస్తాయి. ఈ విధంగా వడ్డీ రేట్ల పెంపు ఒక విధంగా, తగ్గింపు మరో విధంగా బ్యాంకుల మీద ప్రభావం చూపడం వలన బ్యాంకింగ్ వ్యవస్థ మరింత దెబ్బ తింటుంది.**

పెట్టుబడి అన్ని ప్రభుత్వాల మీద విధించింది. అదే సమయంలో పెట్టుబడిదారుల పైన, సంపన్నులపైన పన్నులు పెంచడాన్ని కూడా నియంత్రించింది. అటువంటి పరిస్థితిలో దేశ ఆర్థిక వ్యవస్థ వేగం పుంజుకోడానికి వడ్డీ రేట్లు తగ్గించడం ఒక్కటే ప్రభుత్వానికి మిగిలిన దారి.

బడ్జెట్‌లో ద్రవ్యలోటును నియంత్రించే చట్టం (మన దేశంలో ఉన్నట్టు) ఏదీ అమెరికాలో లేదు. అమెరికా నుండి ద్రవ్య పెట్టుబడి ఇంకెక్కడికో బైటకు పోతుందన్న భయమూ ఆ దేశానికి లేదు. అటువంటప్పుడు ద్రవ్యలోటును పరిమితం చేసుకోవలసిన ఆవశ్యకత ఆ దేశానికి లేదు. కాని అమెరికాలో ద్రవ్యలోటును పెంచి ఆర్థిక వ్యవస్థ వేగాన్ని పెంచాలనుకుంటే దాని వలన ఇతర దేశాల్లో ఉద్యోగాలు కొత్తగా కల్పించబడతాయి తప్ప అమెరికాలో కాదు (అమెరికాలో ప్రజల కొనుగోలు శక్తి పెరిగితే వారికి కావలసిన సేవలు, సరుకులు విదేశాల నుండి తెచ్చుకోవలసిందే). పైగా విదేశీ రుణం పెరుగుతుంది. నిజానికి కరోనా మహమ్మారి కాలంలో అమెరికా తన ద్రవ్య లోటును భారీగా పెంచింది. కొందరు దాని వల్లనే ఇప్పుడు ద్రవ్యోల్బణం పెరిగిపోయిందని వ్యాఖ్యానిస్తున్నారు. హౌసింగ్ బుడగ పేలిపోయిన తరువాత (సబ్‌ప్రైమ్ సంక్షోభం) చాలా కాలం పాటు వడ్డీ రేట్లను కనిష్ట స్థాయి వరకూ తగ్గించి వేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థలో ఊపు తీసుకురావడానికి అమెరికా ప్రయత్నించింది. దాదాపు సున్నా వడ్డీ రేట్లు అమలులోకి వచ్చాయి.

2008లో హౌసింగ్ బుడగ పేలిపోయింది. 2009 నుంచీ 2022 వరకూ అమెరికా లో వడ్డీ రేట్లు 0.25 శాతం దగ్గర కొనసాగాయి. మధ్యలో 2016 నుండి 2020 కాలంలో దానిని క్రమంగా పెంచుతూ 2 శాతం దాకా తెచ్చారు. ఆ తర్వాత మళ్ళీ 2022 దాకా తగ్గింది. ఇంత అసాధారణంగా దీర్ఘ కాలం పాటు ఇంత అసాధారణంగా తక్కువ వడ్డీ రేట్లు కొనసాగించడం వలన అమెరికన్ గుత్తాధిపతులు ఎటువంటి ఇబ్బందీ లేకుండానే తమ సరుకుల రేట్లను, దానితోబాటు లాభాలను పెంచుకుంటూ పోయారు. అది అంతిమంగా ప్రస్తుత ద్రవ్యోల్బణానికి దారి తీసింది. కాని అమెరికన్ ఆర్థిక వ్యవస్థలో ఉపాధి కల్పన చాలినంత ఎక్కువ స్థాయికి ఏమీ పెరగలేదు. అధికారిక లెక్కల ప్రకారం నిరుద్యోగం 4 శాతానికి తగ్గింది. కాని అదే సమయంలో ఉత్పత్తి క్రమంలో కార్మికులు పాల్గొనే రేటు (లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్) మాత్రం తగ్గింది. ఈ రేటు 2008 నాటి స్థాయిలోనే కొనసాగుతూన్నట్టు అనుకున్నా నిరుద్యోగం మాత్రం అప్పటి నుంచీ ఎక్కువ స్థాయిలోనే కొనసాగింది. ద్రవ్యోల్బణం పెరగ్గానే వడ్డీ రేట్లు అమాంతం పెంచివేశారు. ఈ విధంగా హేతువిరుద్ధంగా ద్రవ్య విధానంలో మార్పులు చేయడం, వడ్డీ రేట్లలో ఉన్నట్టుండి మార్పులు తేవడం చూస్తే అంతర్జాతీయంగా వేగంగా సంచరించే ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం కొనసాగుతూన్నంతకాలం పెట్టుబడిదారీ విధానం పరిధిలో ప్రత్యామ్నాయాలు వేరే లేవు అన్నది కనిపిస్తోంది. ఈ విధంగా తలా తోకా లేకుండా వ్యవహరించడం అనేది ప్రభుత్వం వైపు నుండి తలెత్తిన లోపంగా అనుకోలేము. ఇది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం వలన తలెత్తిన ధోరణి.

ఈ విధంగా పెద్ద స్థాయిలో అటూ, ఇటూ మారిపోయే విధానం వెనుక మరో అంశం కూడా ప్రభావితం చేస్తున్నది. వడ్డీ రేట్లు తగ్గిపోయి, దానివలన బాండ్ల విలువలు పెరిగిపోతే, దాని కారణంగా ఆర్థిక వ్యవస్థ వేగం పుంజుకోవడం జరిగినా, జరగకున్నా, బ్యాంకింగ్ వ్యవస్థకు మాత్రం దానివలన ఎటువంటి ముప్పూ ఉండదు. బ్యాంకుల ఆస్తుల విలువలు పెరగడం ఆ బ్యాంకులను ఏ విధంగానూ దెబ్బ తీయదు. కాని, వడ్డీ రేట్లు పెరిగి, బాండ్ల విలువలు పడిపోతే, బ్యాంకుల ఆస్తుల విలువలు వాటి అప్పుల విలువలతో పోల్చినప్పుడు పడిపోతాయి. దీని వలన మార్కెట్‌లో ప్రతిస్పందనలు కలుగుతాయి. అప్పుడు బ్యాంకులు తమ వ్యాపారాన్ని కొనసాగించలేని పరిస్థితులు వస్తాయి. ఈ విధంగా వడ్డీ రేట్ల పెంపు ఒక విధంగా, తగ్గింపు మరో విధంగా బ్యాంకుల మీద ప్రభావం చూపడం వలన బ్యాంకింగ్ వ్యవస్థ మరింత దెబ్బ తింటుంది.

ఇప్పుడు వడ్డీ రేట్లు పెరిగినందువలన కేవలం అమెరికన్ బ్యాంకింగ్ వ్యవస్థ మాత్రమే కాదు, యావత్తు పెట్టుబడిదారీ వ్యవస్థలోని బ్యాంకింగ్ రంగం ముప్పునెదుర్కుంటోంది. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి వడ్డీ రేట్లు పెంచడం ఒక్కటే అధికారికంగా మార్గంగా పరిగణిస్తున్న కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. చివరికి చాలా ప్రతిష్ట కల క్రెడిట్ అండ్ సూయిస్సె బ్యాంక్ కూడా తన వాటాల ధరలు పతనం అవుతున్న పరిస్థితిని చవిచూస్తోంది. దానికి ప్రధాన పోటీదారు అయిన యు.బి.ఎస్ (స్విస్ బ్యాంక్) ఇప్పుడు స్వాధీనం చేసుకోడానికి సిద్ధపడుతోంది.

పెట్టుబడిదారీ ప్రపంచంలోని బ్యాంకింగ్ రంగానికి ఏర్పడిన ప్రమాదం ఇంకా పూర్తిగా తారాస్థాయికి చేరుకోలేదు. రానున్న కాలంలో వడ్డీ రేట్లను ఇంకా పెంచాలని ముందు అనుకున్న ఫెడరల్ రిజర్వు బోర్డు ఇప్పుడు రెండు పెద్ద బ్యాంకులు దెబ్బ తిన్న తర్వాత కాస్త నెమ్మదిగా ముందుకు కదలాలని అనుకుంటోంది. కాని ద్రవ్యోల్బణం కొనసాగినప్పుడు దానికి వడ్డీ రేట్లు మరింత పెంచడం మినహా వేరే మార్గం లేదు. ప్రస్తుతం పెట్టుబడిదారీ వ్యవస్థలో ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి నిరుద్యోగాన్ని పెంచడం ఒక్కటే దానిదగ్గరున్న మార్గం. నిరుద్యోగం పెరగాలంటే వడ్డీ రేట్లు పెంచాలి. ఇలా పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంతో తల్లకిందులవుతున్న సమయంలో కార్మిక వర్గం యూరప్ యావత్తూ నిరసన ప్రదర్శనలతో హోరెత్తిస్తోంది. ఈ నయా ఉదారవాద దశలో పెట్టుబడిదారీ విధానం ముందున్న దారి మూసుకుపోయిందని ఇప్పటి పరిస్థితి సూచిస్తోంది.

(స్వేచ్ఛానుసరణ)

విశ్లేషణ

కేంద్రం పెత్తనం.. ప్రజలకు భారం..


ఎం. వేణుగోపాలరావు

పెత్తనం కేంద్రానికి. అధిక లాభాలు ఆశ్రిత పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు. బరువు బాధ్యతలు రాష్ట్రాలకు, భారాలు ప్రజలకు. విద్యుత్ రంగంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరి, విధానాల పర్యవసానాల సారాంశం ఇది. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న, రాష్ట్రాలపై రుద్దుతున్న విధానాల అమలు వల్ల రాష్ట్రాలకు పెరుగుతున్న బాధ్యతలు, వినియోగదారులపై పెరుగుతున్న భారాలకు కేంద్రం ఎటువంటి బాధ్యతను వహించటం లేదు. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న రాష్ట్రాల విద్యుత్ పంపిణీ కంపెనీలను (డిస్కామ్) గట్టెక్కించే పేరుతో షరతులతో కూడిన పథకాలను కేంద్రం ప్రవేశపెడుతున్నది. డిస్కాముల పేరుకుపోయిన నష్టాలు, అప్పులలో అధిక భాగం రాష్ట్ర ప్రభుత్వాలు భరించటం ఈ పథకాల సారాంశం. ఆర్థిక పునర్నిర్మాణ పథకం, ఉజ్వల్ డిస్కాం ఎస్యూరెన్స్ యోజన (ఉదయ్), అందరికి విద్యుత్ వంటి పథకాలను కేంద్రం ప్రతిపాదించింది. వాటిపై రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి డిస్కాములతో ఒప్పందాలపై సంతకాలు చేయించింది. ఈ పథకాల ప్రకారం ఉభయ తెలుగు రాష్ట్రాలు గత ఎనిమిదేళ్ళుగా వేల కోట్ల రూపాయల మేరకు వాటి డిస్కాముల పేరుకుపోయిన నష్టాలను, అప్పులను భరిస్తూ వస్తున్నాయి. 2015 నవంబరు 20న ప్రవేశపెట్టిన ఉదయ్ పథకం కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిస్కాంలకు 8256.01 కోట్ల మొత్తాన్ని 2016-17లో గ్రాంటుగా సమకూర్చింది. ఈ పథకం కింద తెలంగాణ ప్రభుత్వం 2022-23 వరకు రూ.15,976.80 కోట్ల మొత్తాన్ని డిస్కామ్‌లకు సమకూర్చింది. ఇందులో రూ.8015.91 కోట్లు గ్రాంటు కాగా, రూ. 7960.89 కోట్లు ఈక్విటీగా చేసిన సర్దుబాటు. ఈ మొత్తాలు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఏటేటా సమకూర్చుతున్న వేల కోట్ల రూపాయల సబ్సిడీలకు అదనం. 2023-24 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.10135.22 కోట్ల సబ్సిడీని సమకూర్చేందుకు అంగీకరించగా, తెలంగాణ ప్రభుత్వం రూ.9124.82 కోట్ల మేరకు సబ్సిడీ ఇచ్చేందుకు అంగీకరించింది. దీనికి తోడు తెలంగాణ ప్రభుత్వం టిఎస్ఇఆర్‌సి నిర్ధారించిన ట్రూఅప్ (2022-23 వరకు ఏడేళ్ళ కాలానికి) నిమిత్తం రూ.12718.40 కోట్ల మొత్తాన్ని డిస్కామ్‌లకు చెల్లించేందుకు అంగీకరించింది. ఈ భారాల పెరుగుదలకు తన విధానాలు ప్రధాన కారణమైన మోడీ ప్రభుత్వం మాత్రం తానుగా ఇందుకు దమ్మిడీ ఆర్థిక సహాయం చేయటం లేదు. గత ఎనిమిదేళ్ళ మోడీ ప్రభుత్వ కాలంలో బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇచ్చిన రుణాల పారుబకాయిలు దాదాపు పదకొండు లక్షల కోట్ల రూపాయల మేరకు మాఫీ అయ్యాయి. ఇందులో అత్యధిక భాగం ప్రైవేటు కార్పొరేట్ సంస్థల పారుబకాయిలే. రాష్ట్ర ప్రభుత్వాల డిస్కామ్‌ల రుణాల బకాయిలలో ఈ విధంగా ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదు.

ఆ డిస్కామ్‌లు వాటికి విద్యుత్ సరఫరా చేస్తున్న ఉత్పత్తిదారులకు, ముఖ్యంగా ప్రైవేటు ఉత్పత్తిదారులకు, భారీగా బకాయి పడటంతో కేంద్రం అప్పులు మంజూరు చేయించేందుకు ప్రతిపాదించి, అందుకు రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటర్ గ్యారంటీ ఇచ్చేందుకు షరతు విధించింది. కేంద్రానికి చెందిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, గ్రామీణ విద్యుత్ సంస్థలతో అలా మంజూరు చేయించిన రుణాల మొత్తాలను విద్యుత్ ఉత్పత్తిదారులకు నేరుగా ఆ రుణ సంస్థలతో చెల్లింపచేసింది. డిస్కాములకు మంజూరు చేసిన ఆ సంస్థలు ఈ రుణాలపై బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ రేట్లు వసూలు చేస్తున్నాయి. దీనివల్ల ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తిదారుల అవసరాలు తీరుతున్నాయి. రుణాలిచ్చిన కేంద్ర ఆర్థిక సంస్థలకు లాభదాయక వడ్డీ వ్యాపారం జరుగుతున్నది. ఇలాంటి పథకాల వల్ల విద్యుత్ ఉత్పత్తిదారులకు డిస్కాముల బకాయిలు కేంద్ర రుణ సంస్థలకు చెల్లించాల్సిన రుణాల బకాయిలుగా మారుతున్నాయి.

> **అవసరం లేని ఆర్ఇ కొనుగోలు వల్ల విపరీతంగా మిగులు విద్యుత్ తేలి, వినియోగదారులపై ట్రూఅప్ రూపంలో భారాలు పడుతున్నాయి. వాటిని తగ్గించేందుకు మోడీ ప్రభుత్వం ఎలాంటి సహాయం చేయటం లేదు. మిగులు విద్యుత్తుతో విద్యుత్ ప్రాజెక్టుల ఉత్పత్తి సామర్థ్యం నిరుపయోగంగా ఉన్న మేరకు రాష్ట్రాలు పిపిఎల ప్రకారం పొందని విద్యుత్‌కు స్థిర ఛార్జీలను వేల కోట్ల రూపాయల మేరకు చెల్లించాల్సి వస్తున్నది. ఆ భారాలు వినియోగదారులపై పడుతున్నాయి.**



మంత్రివర్గంలో, పార్లమెంటులో, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించకుండా ప్రధానమంత్రి మోడీ అంతర్జాతీయ వేదికలపై ఏకపక్షంగా పునరుత్పత్తి విద్యుత్తు (ఆర్.ఇ) లక్ష్యాలను ప్రకటించారు. వాటికి అనుగుణంగా, అవసరం లేని ఆర్.ఇ ని ఆర్‌పిపిఓ పేరుతో, దాని కింద నిర్ణయించిన మితిమీరిన లక్ష్యాలకు మించి డిస్కాములు కొనుగోలు చేయటం వల్ల నివారించదగిన అదనపు భారాలు వినియోగదారులపై పడుతున్నాయి. ఈ విధానాన్ని డిస్కాములపై రుద్దుతున్న కేంద్రం ఈ భారాల నివారణకు, తగ్గింపునకు ఎలాంటి సహాయం చేయటం లేదు. అసాధారణంగా ఆర్.ఇ ని గ్రిడ్లో చేర్చేందుకు యూనిట్‌కు రూ.3.55 చొప్పున ఏటా 5325 కోట్ల రూపాయల భారం పడుతున్నదని, ఆంధ్రప్రదేశ్‌కు విద్యుత్ కొనుగోలు ఖర్చులు విపరీతంగా పెరిగి రాష్ట్ర అభివృద్ధి దెబ్బతింటున్నదని ఇంధన శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి కేంద్ర విద్యుత్ మంత్రి ఆర్.కె సింగ్‌కు 2019 సెప్టెంబరు 10న రాసిన లేఖలో వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ సబ్సిడీలను చెల్లిస్తున్నట్లుగానే, కేంద్ర ప్రభుత్వం కూడా తన పవన, సౌర విద్యుత్ ప్రోత్సాహక విధానాలకు చెల్లించటం సముచితమని మంత్రి తన లేఖలో పేర్కొన్నారు. పవన విద్యుత్తుకు యూనిట్‌కు 50 పైసల చొప్పున ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకం (జిబిఐ) కల్పించటం మినహా కేంద్రం ఇంకే సహాయం చేయటం లేదు. 2018లో అప్పటి ఎ.పి.ఇ.ఆర్.సి డిస్కామ్‌ల నుండి ఎటువంటి ప్రతిపాదన లేకుండా, బహిరంగ విచారణ కూడా లేకుండా తనంత తాను పవన విద్యుత్తు యూనిట్‌కు రూ.4.84 చొప్పున అధిక జనరిక్ టారిఫ్‌ను ఏకపక్షంగా నిర్ణయించింది. ఆనాడు పోటీ బిడ్డింగు ద్వారా దేశంలో పవన విద్యుత్ చార్జీలు యూనిట్‌కు రూ.3.50 వరకు తేలాయి. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆ అధిక జనరిక్ టారిఫ్‌కు పవన విద్యుత్ కొనుగోలుకు డిస్కాములతో దీర్ఘకాలిక పిపిఎలు చేయించి, వాటికి కమిషన్ ఆమోదం పొందింది. ఎ.పి.ఇ.ఆర్.సి జిబిఐని పవన విద్యుత్తుకు చెల్లించాల్సిన చార్జీల నుండి తగ్గించకుండా తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ డిస్కాములు అప్పీలు చేశాయి. దానిపై జిబిఐ మొత్తాన్ని జనరిక్ టారిఫ్ నుండి తగ్గిస్తూ కమిషన్ ఉత్తర్వునిచ్చింది. పవన విద్యుత్ ఉత్పత్తిదారులు దానిని సవాలు చేస్తూ హైకోర్టులో కమిషన్ ఉత్తర్వుపై పొందిన స్టే ఇంకా కొనసాగుతున్నది. ఆ పిటిషన్ ఐదేళ్ళుగా విచారణకు రాకుండా ఇంకా పెండింగులోనే ఉంది. దీనితో, జిబిఐ ప్రోత్సాహకం ప్రయోజనం వినియోగదారులకు లభించకుండా ఉత్పత్తిదారులే కొట్టేస్తున్నారు.

అవసరం లేని ఆర్ఇ కొనుగోలు వల్ల విపరీతంగా మిగులు విద్యుత్ తేలి, వినియోగదారులపై ట్రూఅప్ రూపంలో భారాలు పడుతున్నాయి. వాటిని తగ్గించేందుకు మోడీ ప్రభుత్వం ఎలాంటి సహాయం చేయటం లేదు. మిగులు విద్యుత్తుతో విద్యుత్ ప్రాజెక్టుల ఉత్పత్తి సామర్థ్యం నిరుపయోగంగా ఉన్న మేరకు రాష్ట్రాలు పిపిఎల ప్రకారం పొందని విద్యుత్‌కు స్థిర ఛార్జీలను వేల కోట్ల రూపాయల మేరకు చెల్లించాల్సి వస్తున్నది. ఆ భారాలు వినియోగదారులపై పడుతున్నాయి. ఇది ఆందోళనకర అంశమని పేర్కొంటూ, అలా చెల్లిస్తున్న స్థిర ఛార్జీల నిమిత్తం కేంద్రం సహాయం అందించాలని ఫోరం ఫర్ రెగ్యులేటర్స్ సిఫార్సు చేసింది. కేంద్ర ప్రణాళికా నిధులను సమకూర్చుతున్న పద్ధతిలోనే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం ఈ భారాన్ని 60:40 నిష్పత్తిలో భరించాలని ఫోరం సిఫార్సు చేసింది. మోడీ ప్రభుత్వం నుండి దీనిపై చలనం లేదు.

స్వచ్ఛ ఇంధన సుంకాన్ని (సిఐఎస్) టన్ను బొగ్గుకు రూ.400 చొప్పున కేంద్రం వసూలు చేస్తున్నది. దీనిని తగ్గించాల్సిన అవసరం ఉందని, పరిసరాల నియమాలను పాటించేందుకయ్యే ఖర్చుల నిమిత్తం సిఐఎస్ మొత్తాన్ని విద్యుత్ రంగానికివ్వాలని ఫోరం సిఫార్సు చేసింది. సిఐఎస్‌ను కేంద్రం జిఎస్‌టిలో చేర్చి వసూలు చేస్తున్నది. బొగ్గు, సహజ వాయువు ధరలను సహేతుకంగా నిర్ణయించాలని, ఇందుకు స్వతంత్ర రెగ్యులేటర్ను నియమించాలని ఫోరం సిఫార్సు చేసింది. బొగ్గు రవాణాకు రైల్వే చార్జీలలో కేంద్రం సబ్సిడీ యిచ్చే అంశాన్ని పరిగణించాలని సిఫార్సు చేసింది. కేంద్రం చేసిన కేటాయింపుల మేరకు సహజ వాయువును సరఫరా చేయించక పోవటంతో, ఆ ఇంధనంతో విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టులు నిరుపయోగంగా ఉన్నాయి. అయినా, పిపిఎల నిబంధనల ప్రకారం డిస్కాంలు వాటికి స్థిర ఛార్జీలను చెల్లించాల్సి వస్తున్నది. ఈ స్థిర చార్జీలను చెల్లించేందుకు కేంద్రం డిస్కాంలకు సహాయం అందించాలని ఫోరం సిఫార్సు చేసింది. మోడీ ప్రభుత్వం ఈ సహేతుక సూచనలను పట్టించుకోకుండా యథావిధిగా మొరాయిస్తున్నది. బొగ్గు దిగుమతి చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఆదేశిస్తున్న మోడీ ప్రభుత్వం, అందుకయ్యే అధిక వ్యయం భారాన్ని వినియోగదారులపై తగ్గించేందుకు ఎలాంటి సహాయం చేయటం లేదు.

రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డిఎస్ఎస్) ను 2021 జులైలో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. వ్యవసాయేతర విద్యుత్ కనెక్షన్లకు ముందస్తు చెల్లింపు (ప్రీ పెయిడ్ మీటర్లను ఏర్పాటు చేయటం, మొత్తం సాంకేతిక, వాణిజ్య (ఎ.టి అండ్ సి) నష్టాలను 12-15 శాతానికి తగ్గించటం, సగటు కాస్ట్ ఆఫ్ సర్వీస్ (ఎసిఎస్) కు, మొత్తం రెవెన్యూ అవసరాలకు (ఎఆర్ఆర్) మధ్య తేడాను పూర్తిగా తగ్గించి వేయటం ఈ పథకం లక్ష్యాలు. డిస్కామ్‌లు ఈ పథకాన్ని అమలు చేస్తే, ప్రీ పెయిడ్ మీటర్ల కొనుగోలుకు మీటరుకు రూ. 900 చొప్పున గ్రాంట్‌గా ఇస్తామని కేంద్రం ప్రతిపాదించింది. ప్రీ పెయిడ్ మీటర్ల వల్ల వినియోగదారులకు చేకూరే లాభం ఏమీ లేదు సరికదా చేతి చమురు వదులుతుంది. విద్యుత్ పంపిణీ రంగంలోకి ప్రవేశించే ప్రైవేటు పెట్టుబడిదారుల పబ్బం గడిపేందుకే ఈ ప్రీ పెయిడ్ మీటర్లను ఏర్పాటు చేయించేందుకు పై గ్రాంటును కేంద్రం ఎరగా వేసింది. రాష్ట్ర ప్రభుత్వాల డిస్కామ్‌లను నేరుగా ప్రైవేటీకరించే అధికారం తనకు లేకపోవటంతో మోడీ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పూనుకుంటున్నది.

సాంకేతిక కారణాలను మినహాయించి, డిస్కాంలు వినియోగదారులకు విద్యుత్తును నిరంతరం సరఫరా చేయటంలో విఫలమైతే జరిమానాలను చెల్లించాలనే దాకా మోడీ ప్రభుత్వం వెళ్ళింది. విద్యుత్ ప్రాజెక్టులకు తాను చేసిన కేటాయింపుల మేరకు బొగ్గు, సహజ వాయువు వంటి ఇంధనాలను సరఫరా చేయించటంలో విఫలమౌతూ, వాటికి కృత్రిమ కొరత సృష్టిస్తూ, వాటి ధరలను సహేతుకంగా నియంత్రించటంలో, తగు రవాణా ఏర్పాట్లు చేయించటంలో విఫలమౌతూ, విద్యుత్ కొరతకు కారణమవుతున్న తన వైఫల్యాలకు మాత్రం మోడీ ప్రభుత్వం ఎలాంటి బాధ్యత, జవాబుదారీతనం వహించటం లేదు. తన విధానాలు, వైఫల్యాల వల్ల డిస్కామ్‌లపై, వినియోగదారులపై పడుతున్న భారాలను తగ్గించేందుకు ఎలాంటి సహాయం అందించటం లేదు.

/వ్యాసకర్త విద్యుత్ రంగ నిపుణులు, సెల్ : 9441193749/

వార్షిక రుణ ప్రణాళిక
రూ.3,80,000 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వానికి అందిన ముసాయిదా ప్రణాళిక

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న 2023-24 ఆర్థిక సంవత్సరం కోసం వార్షిక రుణ ప్రణాళికను రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి సిద్ధం చేస్తోంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించింది. మొత్తం రూ.3,80,000 కోట్లతో ఈ ప్రణాళిక సిద్ధం చేసింది. దాదాపుగా ప్రభుత్వం కూడా ఇదే ప్రణాళికను ఆమోదించే అవకాశాలున్నాయి. ఈ ప్రణాళికలో ఎప్పటిమాదిరిగానే ప్రణాళికా రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కూడా రుణ కేటాయింపులు చేయనున్నారు. త్వరలోనే జరగనున్న సమావేశంలో దీనిని ఆమోదించనున్నారు.

గతేడాది వార్షిక రుణ ప్రణాళిక కింద రూ.3,19,480 కోట్లు కేటాయింపులు జరగ్గా, ఈ ఏడాది వార్షిక రుణ ప్రణాళికలో రూ.3,80,000 కోట్లు కేటాయింపులు ఉంటాయి. ఇందులో భాగంగా వ్యవసాయ రంగానికి రూ.1,85,000 కోట్లు కేటాయించాలని నిర్ణయించారు. ఇందులో స్వల్పకాల ఉత్పత్తి రుణాల కింద రూ.1,26,500 కోట్లు కేటాయించనున్నారు. వ్యవసాయ యాంత్రీకరణకు రూ.3 వేల కోట్లు, డెయిరీకి రూ.9 వేల కోట్లు, కోళ్ల పరిశ్రమకు రూ.1,200 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాల రుణాలకు రూ.29,800 కోట్లు కేటాయించనున్నారు. వ్యవసాయ టర్మ్ రుణాల కింద రూ.46,500 కోట్లు కేటాయించాలని నిర్ణయించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.63 వేల కోట్లు కేటాయింపులు ఉండనున్నాయి. గతేడాది కన్నా ఈ కేటాయింపులు 26 శాతం ఎక్కువ కావడం గమనార్హం. ఇతర ప్రాధాన్యతా రంగానికి రూ.23,000 కోట్లు కేటాయించాలని నిర్ణయించారు. ఇందులో ఎగుమతుల కోసం రూ.1500 కోట్లు, విద్యకు రూ.2,000 కోట్లు, ఇళ్ల నిర్మాణానికి రూ.12,200 కోట్లు, సామాజిక సౌకర్యాల కోసం రూ.500 కోట్లు, సాంప్రదాయేతర విద్యుత్ కోసం రూ.400 కోట్లు కేటాయింపులు ఉండనున్నాయి. ఇవి కాకుండా ప్రాధాన్యేతర రంగానికి రూ.1,09,000 కోట్లు కేటాయింపులు ఉంటాయి. ఇందులో వ్యవసాయానికి రూ.3,000 కోట్లు, విద్యకు రూ.800 కోట్లు, ఇళ్ల నిర్మాణానికి రూ.15 వేల కోట్లు, వ్యక్తిగత రుణాలకు రూ.22 వేల కోట్లు ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.68,200 కోట్లు కేటాయింపులు ఉంటాయి.

రూ.12.50 లక్షల కోట్లు దాటిన రాష్ట్ర అప్పు

- కేంద్రం ఎందుకు స్పందించడం లేదు? : యనమల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర అప్పు రూ.12.50 లక్షల కోట్లకు దాటిందని శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రతి పౌరుడిపై సగటున రూ.5.50 లక్షల అప్పు భారం మోపిందని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాకు వీడియో విడుదల చేశారు. రాష్ట్ర అప్పులపై కేంద్రం గానీ, ఆర్‌బిఐ గానీ ఇంతవరకు ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదని ప్రశ్నించారు. జగన్ పాలన అంతమయ్యే నాటికి ఓపెన్ మార్కెట్ బారోయింగ్స్ రూ.2.5 లక్షల కోట్లకు చేరుకుంటాయని తెలిపారు. ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ కూడా ఐదేళ్లలో ఇంచుమించు రూ.5 లక్షల కోట్లు అవుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆర్‌టిసి, విద్యుత్ ఛార్జీలు, రోజువారీ నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగి రూ.15 వేల కోట్ల భారం ప్రజలపై పడనుందని తెలిపారు. సంక్షేమానికి రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెబుతున్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో ప్రజలకు అందడం లేదని కాగ్ రిపోర్టు స్పష్టంగా చెబుతుందని పేర్కొన్నారు. ఏ అర్హత ఉందని ప్రభుత్వ సలహాదారులకు రూ.లక్షల్లో జీతాలు ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రజల ధనంతో వాలంటీర్లను ప్రభుత్వం ఏవిధంగా నియమించిందన్నారు.

వివాదాలకు కేంద్ర బిందువుగా ఉండవల్లి శ్రీదేవి

- ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి వివాదాలకు కేంద్ర బిందువుగా మారారని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ విమర్శించారు. తనకు ప్రాణభయం ఉందని చంద్రబాబు నాయుడు రాసిన స్క్రిప్ట్ చదువుతున్న ఉండవల్లి శ్రీదేవి గురించి ఎవరూ ఆలోచించడం లేదని, ఆమె భద్రతకు ఎలాంటి ముప్పు లేదని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉండవల్లి శ్రీదేవి తప్పులు చేసి దళితులకు అన్యాయం జరుగుతోందని కులాల ప్రస్తావన తీసుకురావడం సరికాదన్నారు. రాష్ట్రంలో అనైతిక రాజకీయాలకు చంద్రబాబు కేరాఫ్ అడ్రస్‌గా మారారని విమర్శించారు. తెలంగాణలో ఓటుకు నోటు కేసులో విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రాజెక్ట్‌ల నిర్మాణంలో జాప్యంతో
రూ.53 వేల కోట్లు అదనపు భారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 56 ప్రాజెక్ట్‌లకు సంబంధించి అంచనా వ్యయం 52.36 శాతం (అదనంగా రూ.53 వేల కోట్లు) పెరిగినట్లు గణాంకాలు, కేంద్ర కార్యక్రమాల అమలు శాఖ సహాయ మంత్రి రావ్ ఇందర్‌జిత్ సింగ్ వెల్లడించారు. వైసిపి ఎంపి వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.1,01,272 కోట్ల వాస్తవ అంచనా విలువతో ప్రారంభించిన 56 ప్రాజెక్ట్ పనుల అంచనా విలువ రూ.1,54,300 కోట్లకు పెరిగినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ 56 ప్రాజెక్ట్‌లలో 24 ప్రాజెక్ట్‌ల నిర్మాణంలో జరిగిన జాప్యం కారణంగా నిర్ణీత గడువులోగా పూర్తి కాలేదు. విశాఖపట్నంలో హెచ్‌పిసిఎల్ ఆధ్వర్యంలోని విశాఖ రిఫైనరీ ఆధునీకరణ ప్రాజెక్ట్‌కు రూ.20,928 కోట్ల వ్యయం అవుతుందని 2020 జూలైలో అంచనా వేయగా, 2023 అక్టోబర్‌లో సవరించిన అంచనా వ్యయం రూ.26,264 కోట్లకు చేరింది. అంటే రూ.5,336 కోట్ల అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని మంత్రి రావ్ ఇందర్‌జిత్ పేర్కొన్నారు.

2027నాటికి కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్

రూ.1,045 కోట్ల వ్యయంతో కోటిపల్లి-నర్సాపూరం రైల్వే లైన్ ప్రాజెక్ట్‌కు 2001లో ఆమోదం లభించినట్లు మంత్రి తెలిపారు. నాటి అంచనాల ప్రకారం 2009 మార్చి నాటికి ఇది పూర్తి కావలసి ఉంది. నిధుల కొరత, అటవీ భూముల సేకరణలో జరిగిన అసాధారణ జాప్యం కారణంగా ఈ ప్రాజెక్ట్ 216 నెలలు ముందుకు కదలలేదు. తాజాగా రూ.2,500 కోట్ల అంచనా వ్యయంతో 2027 మార్చి నాటికి కోటిపల్లి-నర్సపూర్ రైల్వే లైన్ నిర్మాణానికి రైల్వే శాఖ కసరత్తు చేస్తోందని మంత్రి వెల్లడించారు.

ఎట్టకేలకు
బిజెపి ఎమ్మెల్యే విరూపాక్ష అరెస్టు

బెంగళూరు : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లంచం కేసులో ఎట్టకేలకు కర్ణాటక బిజెపి ఎమ్మెల్యే మడల్ విరూపాక్షను లోకాయుక్త పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. దవణగిరి జిల్లా చన్నగిరి నుంచి బెంగళూరు వెళుతుండగా క్యాంథసంద్ర టోల్ బూత్‌కు సమీపంలో విరూపాక్షను అరెస్టు చేసినట్లు సమాచారం. ఈ అవినీతి కేసులో కొన్ని రోజుల క్రితమే విరూపాక్షకు జారీ చేసిన బెయిల్‌ను కోర్టు రద్దు చేసింది. గత నెలలో విరూపాక్ష కుమారుడు ప్రశాంత్ మడల్ రూ.40 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడటం, తరువాత ప్రశాంత్ నివాసంలో జరిగిన సోదాల్లో రూ.8 కోట్లు దొరకడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కర్ణాటక ప్రభుత్వరంగ సంస్థ కర్ణాటక సోప్స్ అండ్ డిటెర్జెంట్స్ లిమిటెడ్‌కు ఛైర్మన్‌గా ఉన్న విరూపాక్ష తరుపున ప్రశాంత్ లంచం తీసుకున్న సంగతి తెలిసిందే. కర్ణాటక సోప్స్ అండ్ డిటెర్జెంట్స్ లిమిటెడ్‌కు ముడి సరుకులు పంపిణీ చేసే కాంట్రాక్టును ఖరారు చేయడానికే ఈ లంచం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆరోపణలతో ప్రశాంత్ మడల్, విరూపాక్ష ప్రధాన నిందితులుగా లంచం కేసు నమోదయింది. దీంతో ఛైర్మన్ పోస్టుకు రాజీనామా చేయడంతో పాటు విరూపాక్ష అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. తరువాత కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంతో దవణగిరి చేరుకున్న ఎమ్మెల్యేకు భారీ స్థాయిలో స్వాగతం పలకడం కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కర్ణాటకలో బొమ్మై ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందంటూ విమర్శలు వెల్లువెత్తాయి.

కేజ్రీవాల్‌కు ఊరట

- విచారణపై స్టే పొడిగింపు


న్యూఢిల్లీ : 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పై నమోదైన కేసు విచారణపై స్టేను సుప్రీంకోర్టు సోమవారం మరిన్ని రోజులు పొడిగించింది. తనపై ఈ కేసును కొట్టివేయాలని సుప్రీంకోర్టును కేజ్రీవాల్ ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌ను విచారణను జస్టిస్ కెఎం జోసెఫ్, బి.వి.నాగరత్నలతో కూడిన ధర్మాసనం మే మొదటి వారానికి వాయిదా వేసింది. అప్పటి వరకూ విచారణపై జారీ చేసిన మధ్యంతర స్టేనూ పొడిగించింది. 2014 ఎన్నికల సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లో ప్రచారంలో మాట్లాడుతూ బిజెపి, కాంగ్రెస్‌లపై కేజ్రీవాల్ విమర్శలు చేశారు. 'కాంగ్రెస్‌కు ఓటు వేసిన వారు దేశద్రోహులు, బిజెపికి ఓటు వేసిన వారిని దేవుడు ఎప్పటికీ క్షమించడు' అని కేజ్రీవాల్ వ్యాఖ్యలు చేశారు. దీనిపై కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 125 కింద ఎఫ్ఐఆర్ నమోదయింది. ఈ కేసు విచారణ ప్రస్తుతం సుల్తాన్‌పూర్ ట్రయల్ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. ఈ కేసు కొట్టివేయాలని కేజ్రీవాల్ తొలుత అలహాబాద్ హైకోర్టులోని లక్నో బెంచ్‌ను ఆశ్రయించారు. హైకోర్టు దీనికి తిరస్కరించడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.

రాజ్యాంగాన్ని రక్షించండి

- రాష్ట్రపతికి మమతా బెనర్జీ విజ్ఞప్తి

కోల్‌కతా : దేశ రాజ్యాంగాన్ని రక్షించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం పశ్చిమబెంగాల్ పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సోమవారం ఇక్కడ పౌర సన్మానం జరిపారు. ఈ కార్యక్రమంలో మమతా మాట్లాడుతూ ఈమేరకు విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల పశ్చిమ బెంగాల్ పర్యటన కోసం కోల్‌కతాకు చేరుకున్న రాష్ట్రపతికి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మమతా బెనర్జీ స్వాగతం పలికారు.

ఇన్నోసెంట్‌కు విజయన్ నివాళి



తిరువనంతపురం : ప్రముఖ మలయాళీ నటుడు, మాజీ ఎంపి ఇన్నోసెంట్(75) ఆదివారం కన్నుమూశారు. ఆయన భౌతిక కాయాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఇన్నోసెంట్ గత 10 సంవత్సరాలుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆయన మరణం తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని విజయన్ ట్వీట్ చేశారు. ఇన్నోసెంట్ అద్భుతమైన నటుడని, ఆయన దృఢమైన రాజకీయ విధానాన్ని అనుసరించారని పేర్కొన్నారు. ఇన్నోసెంట్ 500కు పైగా చిత్రాల్లో నటించడమేగాక, లోక్‌సభకు ఎల్‌డిఎఫ్ బలపరిచిన ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఒక పర్యాయం ప్రాతినిధ్యం వహించారు.

నమీబియా చీతాల్లో ఒకటి మృతి

భోపాల్ : గత ఏడాది నమీబియా నుంచి దేశానికి తీసుకొచ్చిన ఎనిమిది చీతాల్లో ఒకటి కిడ్నీ వ్యాధితో సోమవారం మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్ (కెఎన్‌పి)లో మరణించింది. ఈ విషయాన్ని అటవీ శాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. దాదాపు నాలుగున్నరేళ్ల ఉన్న ఆడ చితా సాషా కిడ్నీ వ్యాధితో మరణించినట్లు చెప్పారు. ఎనిమిది చీతాలను మధ్యప్రదేశ్‌లోని షియోపూర్ జిల్లాలోని కెఎన్‌పిలో సెప్టెంబరు 17 నుంచి ఉంచుతున్న సంగతి తెలిసిందే. వీటిల్లో రెండు చీతాలను అడవిలోకి విడుదల చేశారు. సాషా కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో ఉంటుంది. దీంతో చికిత్స కోసం మళ్లీ క్వారంటైన్‌లోకి తీసుకొచ్చారు. అయినా కిడ్నీ వ్యాధి ముదిరి మరణించింది.

బండరాయి పడి ఇద్దరు గిరిజనులు మృతి

ప్రజాశక్తి - సాలూరు (విజయనగరం జిల్లా)

మండలంలోని కొత్తవలస సమీపాన గల విద్యాస్టోన్ క్వారీలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘ టనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. క్వారీలో పేలుళ్ల కోసం ఏర్పాట్లు చేస్తుండగా భారీ వర్షం పడింది. దీంతో అక్కడ నుంచి కిందకి వచ్చిన ముగ్గురు కార్మికులు సామాగ్రిని తీసుకుని రావడానికి క్వారీ పైకి వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగింది.

ఇఒఐకి విశాఖ స్టీల్

డబ్బు అయినా ఇవ్వండి... ముడి సరుకైనా పంపండంటూ ప్రకటన

ప్రయివేట్ సంస్థల ముందు మోకరిల్లేలా కేంద్రం కుట్ర

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో, ఎంవిపి.కాలనీ

దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా నడుస్తోన్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ స్థాయిని కేంద్ర ప్రభుత్వం దిగజార్చుతోంది. దొంగదెబ్బ తీయాలని చూస్తోంది. స్టీల్ ఉత్పత్తికి డబ్బులైనా ఇవ్వండి లేదా మెటీరియల్ అయినా ఇవ్వండి అంటూ ప్రయివేట్ సంస్థల ముందు మోకరిల్లేలా స్టీల్ యాజమాన్యం ద్వారా కుట్ర చేసింది. కోల్, ఐరన్ ఓర్ ముడి సరుకును నేషనల్ మినరల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండిసి) ద్వారా సమకూర్చకుండా చేతులెత్తే సింది. దీంతో, గడిచిన కొద్ది రోజులుగా రా మెటీరియల్ లేక స్టీలు ఉత్పత్తిపై ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ప్రయివేట్ సంస్థలను ఆశ్రయించాల్సి వచ్చింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వహణకు కావలసిన ముడి పదార్థాల సరఫరాకు ప్రయివేట్ వారిని ఆహ్వానిస్తూ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఇఒఐ)ను సోమవారం జారీ చేసింది. డబ్బులుగానీ, ముడిసరుకుగానీ సరఫరా చేస్తే అందుకు ప్రతిగా స్టీలును ఇస్తామంటూ సోమవారం ప్రకటన జారీ చేసింది. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేట్ సంస్థల ముందు మోకరిల్లేలా కేంద్ర ప్రభుత్వం చేస్తోందని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్లకు ధారదత్తం చేసేందుకు, ఉత్పత్తిని దెబ్బతీసేందుకు ఒకదాని వెంట మరొక కుట్రకు



పాల్పడుతోందని అంటు న్నారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా 774 రోజు లుగా ఆందోళన చేస్తోన్నా కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గకపోవడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ఖండించిన స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్

ఇఒఐ జారీ చేయడాన్ని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్, యు.రామస్వామి ఖండించారు. ముడి పదార్థాల సరఫరాకు సహకరించాల్సిన కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకొని, ఆ పనిని ప్రయివేటుకు అప్పగించడం తగదని పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా స్టీల్ ప్లాంట్‌కు ముడి పదార్థాలు లేవంటూ ఎప్పుడైనా ఉత్పత్తిని ఆపేయవచ్చు అంటూ ప్రచారం చేయడాన్ని, యూనియన్లకు కనీసం చెప్పకుండా ముడి పదార్థాల సరఫరా కోసం ప్రయివేటు వారిని ఆహ్వానించడాన్ని తప్పుపట్టారు. ప్రస్తుత ముడి పదార్థాల సమస్య గురించి యూనియన్లకు, కార్మికులకు తెలియజేయాల్సిన బాధ్యత యాజమాన్యానికి ఉందని పేర్కొన్నారు. ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో నడిపించేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరుతూ యూనియన్ల నాయకులు ఢిల్లీ వెళ్లి ప్రభుత్వ ప్రతినిధులతో మాట్లాడే ప్రయత్నం చేస్తుండగా యాజమాన్యం ఏకపక్షంగా ఇఒఐ పిలవడం తగదని తెలిపారు. తక్షణమే యూనియన్లతో చర్చించాలని, కార్మికులకు ఈ విషయం వివరించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఏ స్టీల్ పరిశ్రమకూ రాని ముడి పదార్థాలు, రైల్వే రేకుల కొరత విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రమే రావడం వెనుక ప్రభుత్వ కుట్ర ఉందని పేర్కొన్నారు.

పణంగా కార్మికుల సొమ్ము

అదాని షేర్లకు ఇపిఎఫ్‌ఒ రక్ష.. క్లిష్ట సమయంలోనూ పెట్టుబడుల కొనసాగింపు

న్యూఢిల్లీ : తీవ్ర ఒత్తిడిలో కొనసాగుతున్న అదాని గ్రూపు కంపెనీలకు ఉద్యోగ, కార్మికుల సొమ్మును పణంగా పెడుతున్నారు. అదాని కంపెనీలు తీవ్ర ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నాయని అమెరికన్ సంస్థ హిండెన్‌బర్గ్ ఆరోపణల తర్వాత ఆ కంపెనీల షేర్లు తీవ్ర పతనాన్ని చవి చూస్తున్నాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో అదానీని కాపాడటానికి ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్‌ఒ) ఉద్యోగుల సొమ్మును వాడుతోంది. దాదాపుగా 27.73 కోట్ల మంది ప్రయివేటు, ప్రభుత్వ రంగ ఉద్యోగ, కార్మికుల సొమ్ము ఇందులో ఉంది. హిండెన్‌బర్గ్ దెబ్బతో అనేక పెద్ద ఇన్వెస్టర్లు అదానీ కంపెనీల్లో పెట్టుబడులకు వెనుకాడుతుండగా.. మరోవైపు ఇపిఎఫ్‌ఒ మాత్రం అదాని ఎంటర్‌ప్రైజెస్, అదాని పోర్ట్స్ అండ్ అండ్ స్పెషల్ ఎకనామిక్ జోన్ (ఎపిసెజ్)లో పెట్టుబడులను కొనసాగిస్తోంది. ఇపిఎఫ్‌ఒలోని 15 శాతం కార్పస్ ఫండ్స్‌ను స్టాక్ ఎక్స్చేంజీల్లో పెట్టుబడులుగా పెడుతోంది. 2022 మార్చి నాటికి రూ.1.57 లక్ష కోట్ల నిధులను బిఎస్ఇ, ఎన్ఎస్ఇల్లోని పలు సూచీల్లో ఇన్వెస్ట్ చేసింది. మరో రూ.8,000 కోట్లను 2022–23లో పెట్టుబడులుగా పెట్టింది.



అదాని గ్రూపు అక్రమాలపై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ జనవరి 24న రిపోర్టు చేసింది. అప్పటి నుంచి అదానీ కంపెనీల షేర్లు పేక మేడలా కూలిపోయి.. ఇప్పటికీ తీవ్ర ఒత్తిడిలోనే ఉన్నాయి. ఎల్ఐసి తర్వాత అదానీ కంపెనీల్లో అత్యధికంగా ఇపిఎఫ్‌ఒ ట్రస్టీ పెట్టుబడులే ఉన్నాయి. అదానీ స్టాక్స్ 50 శాతం మేర క్షీణించాయి. ఈ సూచీల్లో పెట్టుబడులపై పెద్ద ఇన్వెస్టర్లతో పాటు రిటైల్ మదుపర్లు ఆచీతూచీ వ్యవహరిస్తున్నారని నిపుణులు పేర్కొంటున్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ఇపిఎఫ్‌ఒ మరిన్ని పెట్టుబడులకు సిద్ధం అవుతోందనే రిపోర్టులు ఉద్యోగ, కార్మికులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. అదాని స్టాక్స్‌ల్లో ఇపిఎఫ్‌ఒ పెట్టుబడులపై సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ నీలమ్ శామి రావును ది హిందూ పత్రిక మార్చి 23న వివరణ కోరగా ఆయన స్పందించలేదు.

అదాని స్టాక్స్‌ల్లో తక్కువ పెట్టుబడులే ఉన్నప్పటికీ.. ట్రస్టీ రాబడిని దెబ్బతీస్తుందని ఓ అధికారి పేర్కొన్నారు. కాగా.. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రి భూపేందర్ యాదవ్ అధ్యక్షతన జరిగే రెండు రోజుల బోర్డు సమావేశంలో ఈ అంశం తెరపైకి రావొచ్చన్నారు. అదాని షేర్లలో భారీ క్షీణత వల్ల రిటర్న్లు తగ్గొచ్చు. దీంతో పిఎఫ్ సభ్యులకు చెల్లించే వార్షిక వడ్డీ రేటులో కోత విధించే అవకాశం ఉంది. మార్చి 24 నుంచి ఇప్పటి వరకు అదాని ఎంటర్‌ప్రైజెస్ షేర్ 49 శాతం, ఎపిసెజ్ స్టాక్స్ 19 శాతం పతనమయ్యింది. సోమవారం సెషన్‌లోనూ బిఎస్ఇలో అదాని ఎంటర్‌ప్రైజెస్ షేర్ 1 శాతం పతనమై రూ.1,723కు దిగజారింది. ఇంట్రాడేలో 1,682 కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. ఎపిసెజ్ షేర్ 1.43 శాతం నష్టపోయి 629 వద్ద ముగిసింది.

బాపట్ల ప్రభుత్వాసుపత్రికి వైసిపి రంగులు

ప్రజాశక్తి - బాపట్ల



ఆసుపత్రిని పరిశీలిస్తున్న నరేంద్రవర్మ

బాపట్ల ప్రభుత్వ ఆస్పత్రికి వైసిపి రంగులు వేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ ఆస్పత్రిని 3.50 కోట్లతో ఆధునికీకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఆస్పత్రికి వైసిపి రంగులు వేశారు. ఈ అంశం చర్చనీయాంశం కావడం తో టిడిపి బాపట్ల నియోజకవర్గ బాధ్యులు వి.నరేంద్ర వర్మ సోమవారం పార్టీ నాయకులతో కలిసి ఆస్పత్రిని సందర్శించారు. ప్రజల సొమ్ముతో నడుపుతున్న ఆస్పత్రికి ఒక పార్టీకి సంబంధించిన రంగులను ఎలా వేస్తారని వైద్యాధికారులను నిలదీశారు. వైసిపి ప్రచారం కోసం, ఆర్భాటాల కోసం.. పార్టీ రంగులు వేస్తారా? అని ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వ కార్యాలయాలకు వైసిపి రంగులు వేస్తే కోర్టు మొట్టికాయలు వేసిన సంగతిని గుర్తు చేశారు. పేరుకే జిల్లా కేంద్రంలో పెద్దాసుపత్రి అని, అందులో రోగులకు కనీస సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్న విషయం శాసనసభ్యులకు కనిపించడం లేదా? అని విమర్శించారు.

పరిహారం... పరిహాసం...

ప్యాకేజీ, పునరావాసానికి నోచుకోని టిటిపిఆర్ నిర్వాసితులు

ఏటా మొక్కుబడి కేటాయింపులు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

తోటపల్లి, తారకరామతీర్థసాగర్ (టిటిపిఆర్) ప్రాజెక్టులో భూములు, ఊళ్లు కోల్పోయిన నిర్వాసితులకు దశాబ్దాలు గడిచినా నష్టపరిహారం, పునరావాసం అందలేదు. అవసరం మేరకు నిధులు కేటాయించకుండా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడమే ఇందుకు ప్రధాన కారణం. నిర్వాసిత సమస్యల అధ్యయనానికి గతేడాది జులైలో ఆర్ అండ్ ఆర్ కమిషనర్ జిల్లాలో పర్యటించినప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు. నిలువ నీడలేక, వ్యవసాయ భూములకు దూరమై నిర్వాసితుల బతుకు భారమైంది. జిల్లాలో నాలుగు మండలాల్లో 24 వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరం వాసులకు తాగు అందించేందుకు 2004లో రామతీర్థసాగర్ నిర్మాణం చేపట్టారు. పునరావాసానికి ఒక్కో కుటుంబానికి రూ.5.5 లక్షలు చొప్పున సుమారు రూ.77 కోట్లు, పడాలపేట, ఎటి అగ్రహారం వాసులకు వన్‌టైన్ సెటిల్‌మెంట్‌కు రూ.43.74 కోట్లు, కోరాడపేట వాసులకు పునరావాసం నిమిత్తం రూ.54.66 కోట్లు అవసరం. మొత్తం రూ.175.4 కోట్లకు అధికారులు ప్రతిపాదనలు చేశారు. ప్రభుత్వం 2023–24 బడ్జెట్‌లో రూ.10 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ నిధులు ఏ మేరకూ సరిపోయే పరిస్థితి లేదు. 2003లో తోటపల్లి నిర్వాసితులకు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం అప్పట్లో రూ.53 వేలు ఇచ్చింది. ఈ నిధుల చాలనందున ఇంటి నిర్మాణాలు మధ్యలోనే నిల్చిపోయాయి. నిర్వాసిత కాలనీలు మొండి గోడలు, పునాదుల స్థాయిలో ఇప్పటికీ ఉన్నాయి. ఇంటి నిర్మాణానికి కనీసం రూ.5 లక్షలు ఇవ్వాలని నిర్వాసితులు చాలా కాలంగా కోరుతున్నా పాలకుల చెవికెక్కడం లేదు. భూసేకరణ నాటికి తాత్కాలికంగా వలస వెళ్లిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని కోరుతున్నా పట్టించుకొనే నాథుడు కరువయ్యాడు. నందివానివలస గ్రామస్తులకు ఇంకా పరిహారం చెల్లించలేదు. బాసంగి మిగులు భూములకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. బంటువానివలస, పిన్నింటి రామినాయుడువలస గ్రామాల వారికి పట్టాలు ఇచ్చినా స్థలాలు చూపలేదు. కోటవానివలస గ్రామస్తులకు రోడ్డు సౌకర్యం కల్పించలేదు. పిఆర్ఎన్ వలసలో మౌలిక సదుపాయాలు లేవు. నిర్వాసిత గ్రామాల్లోని ఆలయాలకు నష్టపరిహారం, తమకు ప్యాకేజీలు ఇవ్వలేదంటూ కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరం మేరకు నిధులు కేటాయించాలని, అర్హులందరికీ పునరావాసం, ప్యాకేజీ అమలు చేయాలని కోరుతున్నారు.

‘బిల్కిస్ బానో’ దోషితో వేదిక

- గుజరాత్‌లో బిజెపి ఎంపి, ఎమ్మెల్యే నిర్వాకం
- వేదికపై ముందు వరుసలో కూర్చున్న శైలేశ్ భట్
- సోషల్‌మీడియాలో నెటిజన్ల ఆగ్రహం

అహ్మదాబాద్ : దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన బిల్కిస్ బానో కేసులో దోషులుగా తేలినవారిలో ఒకరైన శైలేశ్ భట్.. బిజెపి ఎమ్మెల్యే, ఎంపీలతో కలిసి గుజరాత్‌లోని ఒక ప్రభుత్వ కార్యక్రమంలో వేదిక పంచుకున్నాడు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ముందురుసలో కూర్చున్నాడు. వీటికి సంబంధించిన ఫొటోలను ఎమ్మెల్యే, ఎంపీలిద్దరూ తమ ట్విట్టర్ ఖాతాల్లో సైతం పోస్టు చేయటం గమనార్హం.

మాకు ఆశ్చర్యం అనిపించలేదు : బిల్కిస్ భర్త రసూల్

బిజెపి ప్రజాప్రతినిధులతో వేదిక పంచుకున్నది శైలేశ్ భట్ అని బిల్కిస్ బానో భర్త యాకుబ్ రసూల్ కూడా ధ్రువీకరించాడు. “వీరు (దోషులు) జైలు నుంచి బయటకు వచ్చినపుడు సత్కారాలు అందుకున్నారు. అధికారంలో ఉన్నవారితో వారు వేదిక పంచుకోవడం మాకు ఆశ్చర్యంగా అనిపించడం లేదు. ఇప్పుడు మాకున్న ఏకైక ఆశ సుప్రీంకోర్టే” అని రసూల్ అన్నారు. మహిళపై సామూహిక లైంగికదాడి కేసులో దోషిగా తేలి.. ప్రస్తుతం పెరోల్‌పై బయట ఉన్న వ్యక్తిని బిజెపి ఎమ్మెల్యే, ఎంపీలు తమ కార్యక్రమాల్లో భాగం చేయడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారి తీరు పట్ల సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం



చేశారు. దహోడ్ జిల్లా సింగ్వడ్ తాలూకాలోని కర్మాడీ గ్రామంలో గుజరాత్ నీటి సరఫరా మరియు మురుగునీటి బోర్డు (జీడబ్ల్యూఎస్ఎస్‌బీ) ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి దహోడ్ ఎంపీ జస్వంత్‌సిన్హ్ భభోర్, లిమ్ఖేడ ఎమ్మెల్యే శైలేశ్‌భాయ్ భభోర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను భభోర్ సోదరిలిద్దరూ తమ ట్విట్టర్ ఖాతాల్లో షేర్ చేశారు. దహోడ్ జిల్లా సమాచార విభాగం కూడా ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను విడుదల చేసింది.

నేను పాల్గొన్నది పబ్లిక్ ఈవెంట్ : శైలేశ్‌భట్

ఇందులో భట్.. వేదికపై ముందు వరుసలో జస్వంత్‌సిన్హ్, సింగ్వడ్ పంచాయతీ అధ్యక్షులు కాంతా దమోర్‌లకు మధ్యలో కూర్చున్నట్టు కనిపించింది. తాను హాజరైన జిడబ్ల్యూఎస్ఎస్‌బి కార్యక్రమం అనేది ఒక పబ్లిక్ కార్యక్రమమనీ, తాను ఇంతకంటే చెప్పడానికి ఏమీ లేదని భట్ మాట్లాడటం గమనార్హం. ఈ తతంగంపై మాట్లాడటానికి జస్వంత్‌సిన్హ్ నిరాకరించారు. ఎమ్మెల్యేగా తాను చాలా బిజీగా ఉండటం కారణంగా వేదికపై ఉన్నది ఎవరో చూడలేదని శైలేశ్‌భాయ్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి భట్ వచ్చాడన్న దానిపై తాను పరిశీలిస్తానని తెలిపారు. వేదికపై ముందు వరుసలోనే కూర్చున్న భట్ తనకు కనిపించలేదని ఎమ్మెల్యే చెప్పడం గమనార్హం. భట్‌ను ఈ కార్యక్రమానికి ఎవరు ఆహ్వానించారో తనకు తెలియదని జిడబ్ల్యూఎస్ఎస్‌బి డిప్యూటీ ఇంజినీర్ ప్రదీప్ కుమార్ తెలిపారు. బిల్కిస్ బానోపై సామూహిక లైంగికదాడిలో 11 మంది దోషులను గుజరాత్ ప్రభుత్వం పెరోల్‌పై విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో దోషుల విడుదలను సవాలు చేస్తూ బాధితురాలు బిల్కిస్ బానో, ఇతరులు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేసిన విషయం విదితమే.

అమెరికా పాఠశాలలో కాల్పులు: ఆరుగురి మృతి

వాషింగ్టన్ : అమెరికాలో తుపాకీ కాల్పులకు మరో ఆరుగురు బలయ్యారు. అమెరికాలోని టెన్నిసీ రాష్ట్ర రాజధాని నాష్‌విల్లేలో ఈ దారుణం జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం ఒక ప్రాథమిక పాఠశాలలోకి హేండ్ గన్‌తో ప్రవేశించిన ఓ యువతి సిబ్బంది, విద్యార్థులపై కాల్పులకు పాల్పడింది. దీంతో, ముగ్గురు చిన్నారులతో సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో సదరు యువతి మరణించింది. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు.

చెరువుల భూములపై అధికార నేతల కన్ను

తరతరాలుగా సాగు చేసుకుంటున్న దళితులను తరిమేసేందుకు యత్నాలు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కాకినాడ జిల్లాలో మంత్రి దాడిశెట్టి రాజా ప్రాతినిధ్యం వహిస్తోన్న తుని నియోజకవర్గ పరిధి తొండంగి మండలం కోదాడలో అనేకేళ్లుగా దళితులు సాగు చేసుకుంటున్న చెరువు భూములపై కొందరి అధికార పార్టీ నేతల కన్ను పడింది. ఎలాగైనా ఆ భూములను స్వాధీనం తీసుకోవడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో కుట్రలు పన్నుతున్నారు.

తొండంగి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 1లో 103 ఎకరాల చెరువు భూములను కొత్త కోదాడ, పాత కోదాడ, కాలనీ కోదాడ, కొమ్మనాపల్లి గ్రామాలకు చెందిన సుమారు 500 మంది దళితులు మూడు తరాల నుంచి సాగు చేసుకుంటున్నారు. పూర్వపు రోజుల్లో ఈ చెరువు నీటితో చుట్టుపక్కల గ్రామాల భూముల్లో పంటలను సాగు చేసేశారు. అనంతరం పంపా రిజర్వాయర్ ఏర్పాటు, పిబిసి కాలువ అందుబాటులోకి రావడంతో చెరువు నీరు అవసరం లేకుండా పోయింది. అప్పటి నుంచి ఈ చెరువు భూమిని దళితులు సాగు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు.



నకిలీ డాక్యుమెంట్లతో ఆక్రమణకు యత్నాలు

ఈ భూముల్లో 48 ఎకరాలు తమవేనంటూ అనపర్తి నియోజకవర్గానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ ముఖ్య నేతల అండదండలు, పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో ఆ భూముల నుంచి వెళ్లగొట్టాలని చూస్తున్నారని, చెరువు భూముల్లోకి వెళితే కేసులు పెడతామంటూ రెవెన్యూ అధికారులు తమను హెచ్చరిస్తున్నారని దళితులు వాపోతున్నారు. సిపిఎం, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో వారు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం



మా తాతల కాలం నుంచి గ్రామానికి చెందిన చెరువు భూములను సాగు చేసుకుంటున్నాం. ఇప్పుడు ఉన్నట్టుండి ఈ ప్రభుత్వ భూమికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తమదేనంటూ కొందరు వ్యక్తులు వస్తున్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించాలి. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ఈ భూములకు సంబంధించి తమకు పట్టాలు ఇవ్వాలి.

– బూర్తి లోవరాజు, దళిత రైతు, కోదాడ

బెదిరింపులు సరికాదు



అనేక ఏళ్లుగా దళిత రైతులు సాగు చేసుకుంటున్న భూములకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నించడం శోచనీయం. నకిలీ డాక్యుమెంట్లను తయారు చేసిన వారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి. పోలీసులు, రెవెన్యూ అధికారుల బెదిరింపులను నిలుపుదల చేయాలి.

– ఎం.రాజశేఖర్, సిపిఎం జిల్లా కన్వీనర్, కాకినాడ జిల్లా

రైతులకు అండగా పోరాడుతాం



చెరువు భూములను ఆక్రమించుకోవాలని చూస్తే దళిత రైతుల పక్షాన నిలిచి పోరాడుతాం. ఇప్పటికే తహశీల్దార్, ఆర్‌డిఒలకు వినతిపత్రాలు ఇచ్చాం. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణ ప్రయత్నాలు అడ్డుకుని దళితులకు పట్టాలు ఇవ్వాలి.

– జి.అప్పారెడ్డి, జిల్లా కార్యదర్శి, ఎపి రైతు సంఘం

అదానీపై జెపిసి విచారణ జరిపించాల్సిందే

- పార్లమెంటును ప్రభుత్వమే అడ్డుకుంటోంది
- ప్రతిపక్ష నేతలపై దాడులకు పరువునష్టం రూటును దుర్వినియోగపరచొద్దు
- సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్

న్యూఢిల్లీ : ఈ నెల 25, 26 తేదీల్లో ఢిల్లీలో సమావేశమైన సిపిఎం పొలిట్‌బ్యూరో పలు కీలకాంశాలపై చర్చించిన అనంతరం ఒక ప్రకటన విడుదలజేసింది. ప్రతిపక్ష నేతలపై వేధింపు చర్యలను తీవ్రంగా ఖండించింది. ప్రతిపక్షాల నేతలను టార్గెట్‌గా చేసుకుని ఇడి, సిబిఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో నిర్లజ్జగా దాడులు చేయించిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు క్రిమినల్ పరువు నష్టం రూటును దుర్వినియోగ పరుస్తోందని విమర్శించింది. అదానీ కుంభకోణంపై జెపిసితో విచారణ జరిపించాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

ప్రతిపక్ష నేతలపై వేధింపులు

ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని, వారిని ఎంపిలుగా అనర్హుల్ని చేసేందుకు నేరపూరితమైన పరువునష్టం మార్గాన్ని బిజెపి ఉపయోగించుకోవడాన్ని పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. రాహుల్ గాంధీకి శిక్ష పడిన తీరు, ఆ వెను వెంటనే ఆయనను లోక్‌సభ సభ్యుడిగా అనర్హుడిగా ప్రకటించేందుకు తొందరపడడం చూస్తుంటే విమర్శలను ఏమాత్రమూ తట్టుకోలేని అసహనం బిజెపిలో ఎంతగా పేరుకుపోయిందో అర్థమవుతుంది. బిజెపి అనుసరిస్తున్న ఈ నిరంకుశ ధోరణి రోతపుట్టిస్తున్నది.

ప్రతిపక్ష పార్టీల నేతలను లక్ష్యంగా చేసుకుని కేంద్ర దర్యాప్తు సంస్థలను దారుణంగా దుర్వినియోగం చేస్తున్న బిజెపి చేష్టలకు ఇదొక పరాకాష్ట. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు వివిధ రాష్ట్రాల్లో తమ రాజకీయ ప్రత్యర్థులపై పలు ఎఫ్‌ఐఆర్‌లు, కేసులు పెట్టాయి. ఆప్ నేత, ఢిల్లీ డిప్యూటీ ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా ఇప్పటికే అరెస్టయి జైల్లో వున్నారు. తాజాగా వేధింపులకు గురవుతున్న వారిలో లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వి యాదవ్, వారి కుటుంబం (ఆర్‌జెడి), కవిత (బిఆర్‌ఎస్) ఇతరులు అనేక మంది వున్నారు.

అదానీని విచారించాలి

2014 నుండి భారతదేశాన్ని శాసిస్తున్న కార్పొరేట్-మతోన్మాద సంబంధాల్లో అత్యంత హేయమైన తీరును హిండెన్‌బర్గ్ నివేదిక బట్టబయలు చేసింది. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినపుడు, ఫోర్బ్స్ అంచనాల ప్రకారం, అదానీ గ్రూపు మార్కెట్ పెట్టుబడుల విలువ 710కోట్ల డాలర్లుగా వున్నాయి. 2022 నాటికి వచ్చేసరికి, ఒక్కసారిగా ఈ ఆస్తులు 20వేల కోట్ల డాలర్లకు ఎగబాకాయి. 2014లో అంతర్జాతీయ ర్యాంకింగ్‌లో అదానీ స్థానం 609గా వుండగా, 2022 వచ్చేసరికి నాటకీయంగా ప్రపంచంలోనే రెండో అతి పెద్ద కుబేరుడిగా మారాడు.

అదానీ గ్రూపు పాల్పడిన దారుణమైన, హేయమైన తప్పుడు చర్యలను, అక్రమాలను బిజెపి ప్రభుత్వం నిస్సిగ్గుగా సమర్ధించుకొస్తోంది. అదానీ గ్రూపునకు, ఆశ్రిత పెట్టుబడిదారులతో వున్న సంబంధాల కారణంగా ప్రజలు ఎంతగానో కష్టపడి సంపాదించుకుని, ఎస్‌బిఐ, ఎల్‌ఐసి వంటి జాతీయ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల్లో దాచుకున్న పొదుపు మొత్తాలను వేలాది కోట్ల రూపాయల మేర లూటీ చేయడానికి మోడీ ప్రభుత్వం వీలు కల్పించింది. అదానీ వ్యవహారం బట్టబయలైనప్పటికీ ఆ మొత్తం ఉదంతంపై ఏ రకమైనా విచారణ జరిపించడానికీ ప్రభుత్వం మొండిగా తిరస్కరిస్తున్నది. అదానీ గ్రూపు అక్రమాల భాగోతంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)తో దర్యాప్తు జరిపించాలన్న డిమాండ్‌ను పొలిట్‌బ్యూరో పునరుద్ఘాటించింది. చట్ట నిబంధనలకనుగుణంగా అదానీ గ్రూపుపై చర్యలు తీసుకోవాల్సిందేనని నొక్కి చెప్పింది.

అసాధారణ రీతిలో పార్లమెంట్‌ను స్తంభింపచేసిన బిజెపి !

తమ పాలనలో వ్యాపారవేత్తలతో ప్రభుత్వ మిలాఖత్ వికృతరూపం దాల్చడంపై ప్రతిపక్షాలు సంధిస్తున్న ప్రశ్నలకు తట్టుకోలేని బిజెపి, పార్లమెంట్‌లో దీనిపై చర్చ జరిగేందుకు ససేమిరా అంటున్నది. అలాగే దీనిపై జెపిసి ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను అంగీకరించేందుకు కూడా అది మొండిగా తిరస్కరిస్తోంది.

భారతదేశ ప్రజాస్వామ్యం స్థితిగతులపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ప్రకటనను సాకుగా తీసుకుని రోజుల తరబడి పాలక పార్టీ సభ్యులు లోక్‌సభ కార్యకలాపాలను స్తంభింప చేయడం ఇదివరకెన్నడూ కనీవినీ ఎరుగనిది. అదానీ కుంభకోణంపై ఎలాంటి చర్చకు అది మొండిగా తిరస్కరించింది. ఇది కేంద్ర బడ్జెట్‌ను గిలెటిన్ చేసే స్థితికి దారి తీసింది.

రాజ్యాంగ అధికారాలకు విఘాతం

పార్లమెంట్ కార్యకలాపాలను స్తంభింప చేయడంతో పాటూ, కేంద్ర న్యాయ శాఖ మంత్రి, ఉప రాష్ట్రపతి వంటి రాజ్యాంగ ఉన్నత పదవుల్లో ఉన్నవారు పదే పదే ప్రకటనల రూపంలో న్యాయ వ్యవస్థపై దాడులు కొనసాగిస్తూనే వున్నారు. న్యాయవ్యవస్థను కార్యనిర్వాహక వర్గం నియంత్రించేందుకు జరుగుతున్న ఈ యత్నాలను తప్పనిసరిగా ఓడించాలి.

బిజెపియేతర పాలిత రాష్ట్రాల్లో బిజెపి రాజకీయ లక్ష్యాలను నెరవేర్చే పాత్రను గవర్నర్లు పోషిస్తున్నారు.

పదును తేలుతున్న మతోన్మాద ధోరణులు

మైనారిటీ కమ్యూనిటీలకు చెందిన సభ్యులపై ఒక పథకం ప్రకారం దాడులకు పాల్పడుతున్న సంఘటనలు పెరుగుతుండడం పట్ల పొలిట్‌బ్యూరో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గో గూండాలు ముస్లిం యువతను టార్గెట్‌గా చేసుకుని వారిని హతమార్చుతున్న ఘటనలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నది. చర్చిలపై , క్రైస్తవులపై ముఖ్యంగా క్రైస్తవ గిరిజనులపై అనేక రాష్ట్రాల్లో దాడులు జరుగుతున్నాయి. వీటన్నింటికీ సంబంధించి వివిధ కొత్త తప్పుడు కథనాలు, చరిత్రలు కల్పించబడుతున్నాయి. ముఖ్యంగా సమీప భవిష్యత్తులో ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో మతోన్మాద ధోరణులకు మరింత పదును పెట్టేందుకు ఈ చర్యలకు పాల్పడుతున్నారు.

ఒబిసి కోటా కింద ముస్లింలకు రిజర్వేషన్లు రద్దుచేయాలని కర్ణాటక బిజెపి ప్రభుత్వం నిర్ణయించింది. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే సమయంలో ఇది చోటు చేసుకుంది. రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలపై విస్తృత దాడులు, వేధింపులు ఉధృతమయ్యాయి.

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలు

మీడియా వ్యవస్థపై పట్టు వున్న మోడీ ప్రభుత్వం ఎన్నికలపరంగా అజేయులమనే ధోరణిని ప్రచారం చేస్తూ వస్తోంది. కానీ ఇది పూర్తిగా తప్పుదారి పట్టించే ధోరణి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో, బిజెపి గుజరాత్‌ను నిలబెట్టుకోగా, హిమాచల్ ప్రదేశ్‌లో అధికారాన్ని కోల్పోయింది. గత 15ఏళ్లుగా తన నియంత్రణలో వుంటూ వచ్చిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌ను కూడా కోల్పోయింది.

మూడు ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో మొత్తంగా 180సీట్లకు గానూ బిజెపి కేవలం46సీట్లను మాత్రమే గెలుచుకోగలిగింది. త్రిపురలో బిజెపి ఎంఎల్‌ఎల సంఖ్య 46 నుండి 32కి పడిపోయింది. నాగాలాండ్‌లో 12సీట్లు గెలుచుకుని 2వ స్థానంలో నిలిచింది. మేఘాలయలో కేవలం రెండు సీట్లను గెలుచుకుని మిగిలిన 58సీట్లలో డిపాజిట్లను కూడా కోల్పోయింది. పోలైన ఓట్ల దృష్ట్యా చూసినట్లైతే, త్రిపురలో బిజెపికి 38.97 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. నాగాలాండ్‌లో 18.81శాతం ఓట్లు రాగా, మేఘాలయలో కేవలం 9.33శాతం ఓట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే, స్థానిక ప్రాంతీయ పార్టీలతో కలిసి మూడు రాష్ట్రాల్లో ప్రభుత్వంలో వుంది.

పూనే జిల్లాలోని కాస్బా పేట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బిజెపి సిట్టింగ్ స్థానం, గత రెండు దశాబ్దాలుగా బిజెపి అధీనంలో వున్న సీటును కాంగ్రెస్ అభ్యర్థి కైవసం చేసుకున్నారు.

పశ్చిమ బెంగాల్‌లోని సాగర్‌దిఘి ఉప ఎన్నికల్లో 2011 నుండి తృణమూల్ గెలుస్తూ వచ్చిన సీటును కాంగ్రెస్ గెలుచుకుంది. 2021లో తృణమూల్ ఈ సీటును బిజెపిపై 50వేల ఓట్ల మెజారిటీతో గెలుచుకుంది. కాంగ్రెస్-వామపక్ష అభ్యర్థి దాదాపు 23వేల ఓట్ల తేడాతో ఈ సీటును గెలుచుకుని బిజెపిని మూడో స్థానానికి నెట్టివేశారు.

ఎంజిఎన్ఆర్ఇజిఎస్‌ను నాశనం చేస్తున్నారు

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం ప్రభుత్వం తప్పనిసరి చేసిన జాతీయ మొబైల్ పర్యవేక్షక వ్యవస్థ యాప్‌ను తక్షణమే రద్దు చేయాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. ఈ యాప్‌లో సాంకేతిక ఇబ్బందులు వున్న కారణంగా కార్మికులు సగానికి సగం వేతనాలు కోల్పోయినట్లు వార్తలందుతున్నాయి. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ కార్మిక శక్తిలో ప్రధానంగా వున్న మహిళా కార్మికులు యాప్‌ను ఉపయోగించాలంటే స్మార్ట్ ఫోన్లు కొనుగోలు చేసేందుకు రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బడ్జెట్‌లో ఈ పథకానికి నిధులు భారీగా కోత కోయడం, దానికి తోడు వేతనాలు చెల్లింపులు సుదీర్ఘ కాలం పెండింగ్‌లో వుండడంతో పాటు యాప్‌ను కూడా ప్రవేశపెట్టడంతో ఈ పథకం అసమర్ధంగా తయారైంది.

త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు

త్రిపుర శాసనసభకు జరిగిన ఎన్నికల ఫలితాలపై పొలిట్‌బ్యూరో ప్రాథమికంగా విశ్లేషణ జరిపింది. ప్రతిపక్ష పార్టీలు పనిచేయలేని, నిరంతరంగా దాడులకు గురయ్యే ఒక అసాధారణ పరిస్థితిలో ఈ ఎన్నికలు నిర్వహించబడ్డాయి. గత ఐదేళ్లలో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురి చేసేలా వ్యవహరించారని పేర్కొంది. ఆ భయానక పరిస్థితులను, భౌతిక దాడులను తట్టుకుని ప్రతిపక్ష పార్టీలక అనుకూలంగా ఓటు వేసిన వారందరికీ పొలిట్‌బ్యూరో కృతజ్ఞతలు తెలియచేసింది.

ఆశించిన రీతిలో ఓట్లను, సీట్లను గెలుచుకోవడంలో విఫలమవడంతో ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని బిజెపి దారుణమైన, భయంకరమైన దాడులకు దిగడం ఆరంభించింది. సిపిఎంను ప్రధాన లక్ష్యంగా చేసుకుని సాగుతున్న దాడులను పొలిట్‌బ్యూరో ఖండించింది. భయోత్పాతం, బెదిరింపులు, దోపిడీలు, కార్యాలయాలు, ఇళ్లకు నిప్పంటించడం, ఆస్తులను ధ్వంసం చేయడం, జీవనోపాధికి ఉపయోగించే సాధనాలను రిక్షాలు, మూడు చక్రాల బళ్ళు వంటి వాటిని నాశనం చేయడం, పంటలను ముఖ్యంగా రబ్బర్ తోటలను ధ్వంసం చేయడం, చేపల చెరువుల్లో విషం కలపడం వంటి ఇలా వెయ్యికి పైగా సంఘటనలు చోటు చేసుకున్నాయి.

సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్‌లకు చెందిన ఏడుగురు పార్లమెంటరీ సభ్యుల బృందం త్రిపురలో పర్యటించి, పరిస్థితులను సమీక్షించింది. ఆ బృందంపై కూడా పోలీసుల సమక్షంలోనే బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ దుండగులు దాడి జరిపారంటే రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వ హయాంలో ఎంత ప్రమాదకరమైన పరిస్థితి నెలకొందో అర్థమవుతోంది.

ఉధృతమవుతున్న ప్రజా పోరాటాలు

వివిధ వర్గాల్లో పెరుగుతున్న ప్రజా పోరాటాలను పొలిట్‌బ్యూరో గుర్తించింది.

మార్చి 20న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) విజయవంతంగా కిసాన్ మహా పంచాయత్‌ను నిర్వహించింది. దీనికి పెద్ద సంఖ్యలో రైతాంగం హాజరైంది. వ్యవసాయంపైపెరుగుతున్న కార్పొరేట్ నియంత్రణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని పిలుపిచ్చింది.

నాసిక్ నుండి ముంబయికి మహారాష్ట్ర కిసాన్ సభ మార్చి 12న మూడో లాంగ్ మార్చ్‌ను ప్రారంభించింది. ముంబయికి ప్రదర్శన చేరుకోవడానికి ముందుగానే, షిండే-బిజెపి రాష్ట్ర ప్రభుత్వం అన్ని డిమాండ్లను ఆమోదించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉల్లిపాయలకు క్వింటాల్‌కు రూ.350 సబ్సిడీ ఇవ్వడం, 88వేల మందికి పైగా రైతులకు రుణాల రద్దుతో సహా అన్ని డిమాండ్లను అంగీకరించింది.

అనేక రాష్ట్రాల్లో విద్యుత్ కార్మికులు సమ్మెలకు దిగుతున్నారు. దీంతో సమైక్యంగా, కృతనిశ్చయంతో కార్మిక సంఘాలు సాగించే కార్యాచరణ ముందు బిజెపి ప్రభుత్వం తల వంచాల్సిన పరిస్థితి వస్తోంది. దేశంలోని పలు ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్మికులు, స్కీమ్ కార్మికులు ఇలా అందరూ సమ్మెలకు దిగుతున్నారు.

ఏప్రిల్ 5వ తేదీన పార్లమెంట్‌కు జరిపే మజ్దూర్-కిసాన్ మార్చ్‌కు తన పూర్తి సంఘీభావాన్ని, మద్దతును పొలిట్‌బ్యూరో పునరుద్ఘాటించింది.

పెరుగుతున్న ఆర్థిక భారాలు

ఎలాంటి చర్చ జరగకుండానే 2023-24 సంవత్సర కేంద్ర బడ్జెట్‌ను ఆమోదించడాన్ని పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఆర్థిక మాంద్యం, ఉపాధి ఉత్పత్తి లేదా సామాన్యుల కొనుగోలు శక్తి పెరగడం వంటి సమస్యలను పరిష్కరించడంలో బడ్జెట్ దారుణంగా విఫలమైంది. దీనికి విరుద్ధంగా, ఆర్థిక లోటును కుదించేందుకు గానూ ప్రభుత్వ వ్యయాన్ని తగ్గిస్తోంది. మరోపక్క సంపన్నులకు మరింతగా పన్ను రాయితీలు ఇస్తోంది. గత రెండేళ్ళలో భారతదేశంలోని ఒక శాతం మంది సంపన్నుల వద్ద 40.5శాతం సంపద పోగు పడిందని ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించిన సమయంలో ఇది జరిగింది. ఆ రకంగా, ఈ సంకుచిత బడ్జెట్ ఆర్థిక సంక్షోభాన్ని మరింత ఉధృతం చేస్తుంది.

ప్రజలపై మరిన్ని భారాలు మోపబడుతున్నాయి. అందులో తాజాది ఎల్‌పిజి ధరల పెంపు. నిరుద్యోగం, ఆకలి పెరుగుతూనే వున్నాయి. మరోపక్క అసమానతలనేవి అసహ్యకరమైన స్థాయిలకు విస్తరించబడుతున్నాయి.

కేరళ ఎల్‌డిఎఫ్‌ను లక్ష్యంగా చేసుకోవడంపై ఖండన

ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని, వ్యక్తిగత దాడులకు గురవుతున్న కేరళ ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకోవడాన్ని పొలిట్‌బ్యూరో తీవ్రంగా నిరసించింది. కేరళలోని కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కూడా బిజెపితో కలిసి ఇదే తరహాలో చర్యలకు పాల్పడుతోంది. ఇటువంటి ప్రయత్నాలకు కేరళ ప్రజలు దీటైన సమాధానం ఇవ్వాలి..

కేంద్ర కమిటీ సమావేశం

ఏప్రిల్ 27, 28, 29 తేదీల్లో పార్టీ కేంద్ర కమిటీ సమావేశం న్యూఢిల్లీలో జరగనుంది.

మోసపూరిత ఖాతా అని ప్రకటించడానికి ముందు రుణ గ్రహీతలను విచారించాల్సిందే

- సమర్ధించిన సుప్రీం

న్యూఢిల్లీ : ఒక ఖాతాను మోసంగా వర్గీకరించడానికి ముందుగా సదరు ఖాతాను కలిగిన రుణ గ్రహీతను తప్పనిసరిగా విచారించే అవకాశాన్ని ఇవ్వాలని సుప్రీం కోర్టు సోమవారం పేర్కొంది. ఒకవేళ అలాంటి చర్యే తీసుకోవాల్సి వస్తే, హేతుబద్ధమైన ఉత్తర్వులతో కూడిన క్రమాన్ని అనుసరించాల్సి వుందని పేర్కొంది. డివై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ తెలంగాణా హైకోర్టు జారీ చేసిన తీర్పును సమర్ధించింది. రుణాలు తీసుకున్న వారి ఖాతాలు మోసపూరితమైనవని వర్గీకరించడానికి ముందు సదరు వ్యక్తిని విచారించే అవకాశం బ్యాంకులు తప్పనిసరిగా ఇవ్వాలని బెంచ్ పేర్కొంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేసిన విజ్ఞప్తిపై ఈ తీర్పు వెలువడింది.

అదానీని కాపాడేందుకే

(మొదటిపేజీ తరువాయి)

సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమాధానం ఇవ్వకపోవడంతో అదానీ వ్యవహారంలో కుంభకోణం జరిగిందని, అందులో మోడీ ప్రభుత్వం జోక్యం ఉందని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. పార్లమెంట్ సజావుగా నడిస్తే, ప్రజా సమస్యలను ప్రతిపక్షాలు లేవనెత్తేవని పేర్కొన్నారు.

అదానీ సోదరుడి ఆధీనంలో ఉన్న విదేశీ డొల్ల కంపెనీలు, అదానీ కంపెనీల్లో పెట్టుబడి పెట్టారని విమర్శించారు. ఈ రూ.20 వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వం డొల్ల కంపెనీ ఎలా పని చేస్తున్నాయో పరిశీలించి, మార్గదర్శకాలు ఇవ్వాలని 2018లో ఒక టాస్క్‌ఫోర్స్‌ను నియమించిందని గుర్తు చేశారు. అదే ప్రభుత్వం అదానీ వ్యవహారం బయటపడిన తరువాత డొల్ల (షెల్) కంపెనీల గురించి నిర్వచనం లేదని, నిర్వచనం లేదు కనుక తమ వద్ద సమాచారం లేదని ప్రభుత్వం పార్లమెంట్‌లో ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చిందని తెలిపారు. అదానీని కాపాడేందుకు ప్రభుత్వం ఎంతలా దిగజారిందో దీనిని బట్టి స్పష్టం అవుతుందని అన్నారు. సగానికిపైగా ఇడి కేసులన్నీ డొల్ల కంపెనీలకు సంబంధించినవేనని, కానీ ఇప్పుడు డొల్ల కంపెనీ అంటే ఏమిటో తెలియదని ప్రభుత్వం అంటుందని ఎద్దేవా చేశారు. దేశంలో మతోన్మాద ఘర్షణలు, మతోన్మాద దాడులు పెరిగిపోతుండడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలపై ఆర్థిక భారాలు పెరుగుతున్నాయని, వీటికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు జరుగుతున్నాయని తెలిపారు.

నల్ల దుస్తులతో నిరసన ర్యాలీ

- పార్లమెంటులో కొనసాగిన ప్రతిపక్షాల ఆందోళన
- రాజ్యసభలో ఆర్థిక బిల్లు ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు, అదానీ వ్యవహారంపై ప్రతిపక్షాలు నల్ల దుస్తులు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించాయి. 'సత్యమేవ జయతే' బ్యానర్ పట్టుకుని నినాదాలిస్తూ.. ప్రతిపక్ష నేతలు ప్రదర్శన చేపట్టారు. సోమవారం ఉభయ సభలు వాయిదా పడిన తరువాత ప్రతిపక్ష సభ్యులంతా పార్లమెంటు ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు చేబూని నినాదాలు చేశారు. అనంతరం అక్కడి నుంచి విజయ్ చౌక్‌కు ప్రతిపక్ష సభ్యులు మార్చ్ నిర్వహించారు. 'యే దాదాగిరి బంద్ కరో, యే మోడీ-గిరి బంద్ కరో' అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్, డిఎంకె, ఎన్‌సిపి, సిపిఎం, సిపిఐ, బిఆర్‌ఎస్, బిఆర్‌ఎస్‌కు చెందిన ఎంపిలు నలుపు రంగు దుస్తులు ధరించగా, టిఎంసి ఎంపిలు నోటికి నల్ల బ్యాడ్జీలు కట్టుకుని ఆందోళనలో పాల్గొన్నారు. 'జాగో ఇడి', 'ఇడి మోదానీ భాయ్ భాయ్' అని రాసి ఉన్న ప్లకార్డులను ఎంపిలు పట్టుకుని మార్చ్‌లో కదంతొక్కారు.



నల్ల దుస్తులతో ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష ఎంపిలు

దద్దరిల్లిన ఉభయ సభలు

పార్లమెంటు ఉభయ సభల్లో రాహుల్ అనర్హత వేటు, అదానీ వ్యవహారంపై జెపిసి వేయాలని ప్రతిపక్ష సభ్యులు నినాదాలు హోరెత్తించారు. ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేశాయి. దీంతో సోమవారం కూడా ఉభయ సభలు దద్దరిల్లాయి. లోక్‌సభలో సభ ప్రారంభం కాగానే కొంతమంది ప్రతిపక్ష ఎంపిలు వెల్‌లోకి దూసుకెళ్లి కాగితాలను చించి విసిరారు. మరికొంత మంది ఎంపిలు నల్ల రంగు క్లాత్‌ను ఊపారు. ఒక ఎంపి చేతులో ఉన్న బ్యానర్‌ను స్పీకరు కుర్చీపైకి విసిరారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. సభను స్పీకరు ఓం బిర్లా సాయంత్రం నాలుగు గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడం ప్రారంభించారు. 'ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది' అని రాసి ఉన్న ప్లకార్డులను పట్టుకుని నిరసన తెలిపారు. పలువురు సభ్యులు వాయిదా తీర్మాన నోటీసులు ఇచ్చినా లోక్‌సభ స్పీకరు అనుమతించలేదని చైర్‌లో ప్యానెల్ స్పీకర్ రమాదేవి తెలిపారు. వెంటనే సభను మంగళవారానికి వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలో కూడా ఇదేతీరు కొనసాగింది. సభ ప్రారంభం కాగానే కొందరు సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి 'మోడీ-అదానీ భాయ్, భాయ్' అంటూ నినాదాలు చేశారు. పరిస్థితి గందరగోళంగా మారడంతో సభను ఛైర్మన్ జగదీప్ ధన్‌కర్ మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల నినాదాల మధ్య కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక బిల్లును ప్రవేశపెట్టారు. మూజువాణి ఓటుతో ఆ బిల్లును ఆమోదించారు. అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు.

ప్రతిపక్షాల సమావేశం

రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో ప్రతిపక్షాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్, డిఎంకె, ఎస్‌పి, జెడియు, ఆర్‌జెడి, సిపిఎం, సిపిఐ, ఆప్, బిఆర్‌ఎస్, ఎన్‌సిపి, ఎన్‌సి, శివసేన (ఠాక్రే), ఐయుఎంఎల్, ఎండిఎంకె, కేరళ కాంగ్రెస్, టిఎంసి, ఆర్‌ఎస్‌పి తదితర పార్టీల నేతలు పాల్గొన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ముందుకు వచ్చిన వారికి కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ బంగ్లా ఖాళీ చేయాలి : రాహుల్‌కు నోటీస్

లోక్‌సభ సభ్యత్వం కోల్పోయిన రాహుల్ గాంధీ ప్రస్తుతముంటోన్న ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేయాలని లోక్‌సభ హౌసింగ్ కమిటీ నోటీసులు జారీ చేసింది. ఏప్రిల్ 22లోగా ఆయన తన బంగ్లాను ఖాళీ చేయాల్సి ఉంటుందని నోటీసుల్లో పేర్కొంది. ఖాళీ చేయడానికి ఆయనకున్న వ్యవధి 26 రోజులు మాత్రమే. 2014 నుంచి రాహుల్ ఢిల్లీ 12 తుగ్లక్ లేన్‌లోని ప్రభుత్వ బంగ్లాలో ఉంటున్నారు.

కాబూల్‌లో ఆత్మాహుతి దాడి

- ఆరుగురి మృతి

కాబూల్ : ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లో జరిగిన ఆత్మాహుతి బాంబర్ దాడి ఘటనలో ఆరుగురు మరణించారు. అనేక మంది గాయపడ్డారు. కాబూల్‌లోని విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యాలయానికి సమీపంలో సోమవారం ఈ దాడి జరిగింది. విదేశాంగ కార్యాలయానికి సమీపంలో ఆత్మాహుతి దాడి జరగడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. తాజాగా దాడికి పాల్పడింది ఎవరో ఇప్పటి వరకూ వెల్లడి కాలేదు. కాబూల్ పోలీసు అధికారులు వెల్లడించిన సమాచారం ప్రకారం మంత్రిత్వ శాఖ కార్యాలయం సమీపంలోని ఒక చెక్‌పోస్టు వద్ద ఆత్మాహుతి బాంబర్‌ను తాలిబాన్ భద్రతా సిబ్బంది గుర్తించారు. వెంటనే బాంబర్ తనకు తాను పేల్చివేసుకున్నాడు. ఈ దాడిలో మరణించిన ఆరుగురినీ సాధారణ పౌరులుగానే గుర్తించారు. గాయపడిన వారిలో ముగ్గురు భద్రతా సిబ్బంది ఉన్నారు. ఈ కార్యాలయానికి సమీపంలో జనవరి మధ్యలో జరిగిన ఆత్మాహుతి దాడిలో ఐదుగురు మరణించారు.

బిల్కిస్ బానో కేసులో కేంద్రానికి, గుజరాత్ సర్కార్‌కు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : గోద్రా అల్లర్ల అనంతర కాలంలో సామూహిక అత్యాచారానికి గురైన బిల్కిస్ బానో దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్రానికి, గుజరాత్ ప్రభుత్వానికి, ఇతరులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో 11మంది దోషులకు శిక్షను రద్దు చేయడాన్ని బానో సవాలు చేశారు. ఈ విషయంపై విచారణను ఏప్రిల్ 18కి వాయిదా వేస్తూ, ఇందులో అనేక అంశాలు ఇమిడి వున్నాయని, అందువల్ల దీన్ని సవివరంగా విచారించాల్సిన అవసరం వుందని జస్టిస్ కె.ఎం.జోసెఫ్, జస్టిస్ బి.వి.నాగరత్నలతో కూడిన బెంచ్ పేర్కొంది. సంబంధిత పక్షాలకు శిక్షను రద్దు చేసిన ఫైళ్లతో తదుపరి విచారణా సమయానికి సిద్ధంగా వుండాల్సిందిగా గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కేసులో భావోద్వేగాలు పనికిరావని, చట్టానికి మాత్రమే కట్టుబడి వుండాలని విచారణ సందర్భంగా బెంచ్ వ్యాఖ్యానించింది.

తెలంగాణ గవర్నరుపై పిటిషన్ విచారణ 10కి వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ గవర్నరు తమిళిసై సౌందరరాజన్‌పై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఏప్రిల్ 10కి వాయిదా వేసింది. పది ముఖ్యమైన బిల్లులను ఆమోదించడం లేదని, ఆయా బిల్లులను ఆమోదించేలా గవర్నరును ఆదేశించాలని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది. గవర్నరుతో సంప్రదింపులు జరుగుతున్నాయని, కనుక తమకు సమయం కావాలని కేంద్ర ప్రభుత్వం తరపున న్యాయవాదులు కోరారు. కేంద్ర ప్రభుత్వ న్యాయవాదుల విజ్ఞప్తి మేరకు పిటిషన్‌పై విచారణను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ధర్మాసనం వాయిదా వేసింది.



జర్మనీలో ఆందోళన చేస్తున్న కార్మికులు

జర్మనీలో అతిపెద్ద సమ్మె

- స్తంభించిన రవాణా రంగం

బెర్లిన్, ఫ్రాంక్‌ఫర్ట్ : దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేని రీతిలో జర్మనీలో సోమవారం అతిపెద్ద సమ్మె జరిగింది. దీంతో దేశ రవాణా రంగం పూర్తి స్థాయిలో స్తంభించింది. వెర్డి ట్రేడ్ యూనియన్, రైల్వే, రవాణా యూనియన్ అయిన ఇవిజిలు 24గంటల సమ్మెకు పిలుపిచ్చాయి. అడ్డూఅదుపు లేకుండా పెరిగిన ఆహార, ఇంధన ధరల కారణంగా ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణ ప్రభావాలను ఎదుర్కొనాలంటే అధిక వేతనాలు కావాలని ఉద్యోగులు, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఫిబ్రవరిలో ఆహార ద్రవ్యోల్బణం రికార్డు స్థాయిలో 9.3శాతానికి చేరింది. యూరప్ దేశాలను నెలల తరబడి దెబ్బ తీస్తున్న పారిశ్రామిక కార్యాచరణలో సోమవారం సమ్మె తాజాది. సమ్మె కారణంగా విమానాశ్రయాలు, బస్సు, రైల్వే స్టేషన్లు స్తంభించాయి. దీంతో లక్షలాదిమంది ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దేశంలోనే అతిపెద్దవైన మ్యునిచ్, ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయాల నుండి విమానాలు రద్దు కావడంతో టెర్మినల్స్ అన్నీ నిర్మానుష్యంగా మారాయి. రైల్వే సర్వీసులు కూడా నిలిచిపోయాయి. సమ్మె చేస్తున్న కార్మికులు ఎరుపు, పసుపు రంగు జాకెట్లు ధరించిన బూరాలు, సైరన్లు, విజిల్స్ ఊదుతూ వీధుల్లో తిరగడం కనిపించింది. మొత్తంగా నాలుగు లక్షల మంది విమాన ప్రయాణికులు ఇబ్బందులు పడినట్లు ఎయిర్‌పోర్ట్స్ అసోసియేషన్ అంచనా వేసింది.

సమాన వివాహ వయసు పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ : స్త్రీ, పురుషులిద్దరికీ వివాహానికి కనీస వయస్సు 21 ఏళ్లు ఉండాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి సుప్రీంకోర్టు సోమవారం తిరస్కరించింది. ఇలాంటి పిటిషన్ ఉద్దేశం వివాహ కనీస వయసును నిర్ణయించడానికి పార్లమెంట్‌ను చట్టం చేయాలని ఆదేశించడమేనని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇది కోర్టులకు సంబంధించిన అంశం కాదని, చట్టసభలకు చెందిన అంశమని ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ జెబి పార్దివాలాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది.


జ్యుడీషియల్ సంస్కరణలను నిరసిస్తూ ఇజ్రాయిల్‌లో సమ్మె

టెల్ అవీవ్ : ఇజ్రాయిల్ ప్రభుత్వం ప్రతిపాదించిన జ్యుడీషియల్ సంస్కరణలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా సమ్మెలు, నిరసనలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇజ్రాయిల్ కార్మిక సంఘాల సమాఖ్య అయిన హిస్త్రాడ్రట్ సాధారణ సమ్మెకు పిలుపివ్వడంతో సోమవారం టెల్ అవీవ్‌లోని ప్రధాన అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఒక్క విమానం కూడా ఎగరలేదని ఇజ్రాయిల్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ తెలిపింది. హిస్త్రాడ్రట్ సమాఖ్యలో ఆరోగ్య, రవాణా, బ్యాంకింగ్, ఇతర రంగాలకు చెందినవారు 7లక్షల మందికిపైగా వున్నారు. "ఈ క్షణం నుండే ఇజ్రాయిల్ స్తంభిస్తుంది." అని హిస్త్రాడ్రట్ చైర్మన్ అర్నాన్ బార్ డేవిడ్ ప్రకటించారు. "కార్మికులు, యజమానులు అందరూ కలిసి న్యాయ వ్యవస్థ ప్రక్షాళనను స్తంభింపచేస్తారు." అని అన్నారు. సమ్మె పిలుపుతో ఫ్యాక్టరీలు, బ్యాంకులు, షాపింగ్ మాల్స్, రెస్టారెంట్లు మొత్తంగా అన్నీ మూతపడ్డాయి. మరోవైపు ఇజ్రాయిల్ మెడికల్ అసోసియేషన్ కూడా సమ్మెకు పిలుపునిచ్చింది. కేవలం అత్యవసరమైన చికిత్సలకు తప్ప మిగిలిన సేవలన్నీ నిలిచిపోయాయని మెడికల్ అసోసియేషన్ ప్రకటించింది. ఇజ్రాయిల్ యూనివర్శిటీ అధిపతుల సమాఖ్య కూడా సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపింది. సుప్రీం కోర్టు మితిమీరిన వైఖరిని అణచివేసేందుకు జ్యుడీషియల్ వ్యవస్థలో మార్పులు తీసుకువస్తున్నామని బెంజామిన్ నెతన్యాహు ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. దీంతో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. అవినీతికేసు విచారణ నుంచి తప్పించుకునేందుకు నెతన్యాహు పన్నిన ఎత్తుగడ అని విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు.



జీవన
the family

ప్రాణి మూలాన్ని కనుగొని ...



పిల్లలూ! జీవకణ శాస్త్రం మానవ జీవితాన్ని అనేక విధాలుగా ప్రభావితం చేస్తూ వుంది. అసలు ప్రాణి మూల రహస్యాన్ని తెలియజేసిన శాస్త్రవేత్తల్లో ఫ్రాంసిస్ క్రిక్ ముఖ్యులు. మరి ఈ రోజు ఆయన గురించి తెలుసుకుందామా!

ఫ్రాంసిస్ క్రిక్‌కి ఆధునిక జీవశాస్త్ర శిల్పిగా పేరు. ఆయన తన మిత్రుడైన జేమ్స్ వాట్సన్‌తో కలిసి డి.ఎన్.ఎ. (డీఆక్సీ రైజో న్యూక్లిక్ ఆసిడ్) నిర్మాణాన్ని కనుగొనడం జన్యుశాస్త్ర విస్తరణకు ఎంతగానో తోడ్పడింది. వీరి పరిశోధనలు 19వ శతాబ్దపు డార్విన్ పరిణామ సిద్ధాంతం, మెండల్ అనువంశిక సిద్ధాతాల కొనసాగింపు.


జన్యు మార్పిడి ద్వారా జీవి లక్షణాన్ని మార్చగలిగే స్థాయికి చేరేందుకు పునాదు లేసిన ఫ్రాంసిక్ క్రిక్ ప్రారంభదశలో జీవశాస్త్ర వేత్త కాదు. కేంబ్రిడ్జిలో భౌతిక పరిశోధనా విద్యార్థిగా వున్నప్పుడు రెండవ ప్రపంచ యుద్ధం కారణంగా ఆయనకు జీవశాస్త్రంపై అభిరుచి కలిగింది. జీవరసాయన శాస్త్రాల అధ్యయనానికి పూనుకొన్నాడు. కణరసం భౌతిక లక్షణాలపై పరిశోధన చేపట్టాడు. క్రమంగా జన్యువుల అమరికను గురించి అర్థం చేసుకుని, అమైనో ఆమ్లాల ఆధారితమైన డిఎన్ఎ యొక్క రూపాన్ని అవిష్కరించారు. ఈపరిశోధనకు 1962లో నోబెల్ బహుమతి లభించింది. ఆనాటికి క్రిక్‌కు డాక్టరేట్ కూడాలేదు. క్రిక్ తన పరిశోధన కొనసాగింపుగా జీవి శరీర నిర్మాణానికి కీలకమైన మాంసకృత్తులు ఏరకంగా తయారవుతాయో తెలిపాడు.

క్రిక్ నిరాడంబర జీవితం గడిపారు. ఆయన సేవలను గుర్తించి 1999లో ఇంగ్లాండ్ దేశ అత్యున్నత అవార్డు ఆర్డర్ ఆఫ్ మెరిట్ ఇచ్చారు. తన పరిశోధనా ఫలితాల పునాదులపై విస్తరిస్తున్న జీవసాంకేతిక రంగాన్ని క్రిక్ తన జీవిత కాలంలోనే చూడగలిగాడు. మానవ జన్యువు లక్షణాలు విశదంగా క్రోడీకరించగల శాస్త్రరంగ అన్వేషణ క్రమంలోనే ఫ్రాసిస్ క్రిక్ (88) జూలై 28, 2004న మృతిచెందారు.

సరైన నీడ ఏది?

జవాబు : 2

చిన్నారులూ, ప్రియా స్కేటింగ్ చేస్తుంది. పక్కనే కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో తన సరైన నీడను కనిపెట్టండి.



నేను గీసిన బొమ్మ





- ఎస్‌కె. నిఖత్ తార, 4వ తరగతి, నారాయణ స్కూలు, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

బంగారు తల్లులు

ముక్కు, ముఖం బద్దలై గాయాలతో రక్తం కారుతున్నా.. పంటి బిగువున నొప్పిని అదిమిపట్టి ప్రత్యర్థిపై పిడిగుద్దులు కురిపించడంలో ఈ నలుగురు క్రీడాకారిణులలో విభిన్న శైలి కనబడుతుంది. కాని అవమానాలు, ఛీత్కారాలు, ఈసడింపులు అనుభవించిన వారు ఎప్పటికీ వేరు కాదు..

ఒక్క రోజులోనో.. ఒక్క సంవత్సరంలోనో.. కష్టపడిన ఫలితం కాదిది. సమాజం, కట్టుబాట్లు, సూటిపోటి మాటలు మనసును మెలిపెడుతున్నా.. ఆర్థిక కష్టాలు కన్నీళ్లు తెప్పిస్తున్నా.. గెలుపోటములు దోబూచులాడినా పడి లేస్తూ.. తమను తాము సంభాళించుకుంటూ విజయ తీరాలు చేరుకున్న క్రీడాకారిణుల స్ఫూర్తి ప్రయాణమిది. తాజాగా ఢిల్లీలో జరిగిన 'ఐబిఎ మహిళల ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్'లో నిఖత్ జరీనా, లొవ్లీనా బోర్గోహైన్, నీతూ ఘంగాస్, సావితి బోరాలు వరుసగా పసిడి పతకాలు సాధించారు.



నీతూ

గంటల వ్యవధిలో వరుసగా నాలుగు పసిడి పతకాలు సాధించిన ఈ క్రీడాకారిణులలో తొలి స్వర్ణం సాధించిన 22 ఏళ్ల నీతూ ఘంగాస్ హర్యానా భివానీ జిల్లా ధనానా గ్రామానికి చెందిన వారు. తండ్రి 3వ తరగతి ప్రభుత్వ ఉద్యోగి. తక్కువ జీతంతో ఇల్లు గడవడమే కష్టమైన పరిస్థితుల్లో కూతురు బాక్సింగ్ శిక్షణ కోసం స్కూటరుపై రోజూ 70 కిలోమీటర్లు దూరం ప్రయాణం చేసేవాడు ఆ తండ్రి. ఆ గ్రామం నుండి మరే ఇతర వాహనం బాక్సింగ్ క్లబ్‌కు వెళ్లదు. దీంతో కూతురు కల సాకారం చేసేందుకు ఆ తండ్రి ఉద్యోగాన్నీ వదిలిపెట్టాడు. వేతనం లేని మూడేళ్ల సెలవు తీసుకుని నీతూని రోజూ స్కూటరుపై ఎక్కించుకెళ్లేవాడు. ప్రయాణం సరే.. మరి ఇంటి ఖర్చులు.. శిక్షణకు అయ్యే ఖర్చు.. నీతూ ఆహారనియమాలు.. ఇవన్నీ జీతం లేని ఆ తండ్రికి పెద్ద భారం. అయినా అతను వెనుకడుగు వేయలేదు. అప్పులు తీసుకుని మరీ నీతూని ప్రపంచఛాంపియన్‌కు సిద్ధం చేశాడు. అందుకే స్వర్ణం గెలిచిన నీతూ 'ఈ పతకం నాన్నకు అంకిత'మని ప్రకటించింది. 2012 నుండి బాక్సింగ్ కెరియర్ ప్రారంభించిన నీతూ 'ప్రపంచ ఛాంపియన్‌గా నేను ఎదగడంలో మా నాన్న త్యాగం ఎంతోవుంది. ఇప్పుడు నాకొచ్చిన బహుమతి సొమ్ముతో మా నాన్న అప్పు తీర్చాలి. ఆయన మళ్లీ తన ఉద్యోగం కొనసాగించాల'ని ఆశపడుతోంది.



సావితి

కబడ్డీ క్రీడాకారిణిగా కెరీర్ మొదలుపెట్టిన సావితీ బోరా హర్యానా హిసార్ ప్రాంతానికి చెందిన అమ్మాయి. తండ్రి రైతు. జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు. రైతు కుటుంబం నుండి వచ్చిన సావితీ మొదట కబడ్డీ ఆటపై ఇష్టం పెంచుకుని దున్నేసిన పంట భూములనే శిక్షణా కేంద్రాలుగా మార్చుకుంది. ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఆటలో మంచి ప్రావీణ్యం సాధించింది. అయితే జాతీయ స్థాయి క్రీడాకారిణిగా రాణిస్తోన్న సమయంలో.. భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న సావితీకి ఆ తరువాత ఆట కొనసాగించాలనుకున్నా పరిస్థితులు అనుకూలించలేదు. బంధువుల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఆటే కావాలనుకుంటే ఊరు వదిలి వెళ్లిపోవాలన్న ఆంక్షలు వచ్చాయి. ఇన్ని ఆంక్షలు, కట్టుబాట్ల మధ్య కబడ్డీని వదిలిపెట్టింది. ఆ తరువాత బాక్సింగ్‌పై దృష్టిపెట్టి దేశంలోని అగ్రశ్రేణి క్రీడాకారిణుల సరసన ఒకరిగా నిలిచింది. 2014లో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సొంతం చేసుకున్న ఆమె ఈ 9 ఏళ్లల్లో ఒక్క పతకం కూడా సాధించలేదు. తీవ్ర ఒత్తిడితో సతమతమవుతూ పతకాలకు దూరమవుతూ వస్తున్నా ప్రపంచ ఛాంపియన్ కావాలన్న కోరికతో కఠోర సాధన చేసి మరోసారి ప్రపంచ విజేతగా నిలిచి తన సత్తా చాటింది.

నీతూ, సావితీలకు ఈ పసడి పతకాలు తొలి స్వర్ణాలైతే.. నిఖత్‌కి ఇది రెండో స్వర్ణం.. మేరీకోమ్ తరువాత వరుసగా స్వర్ణాలు సాధిస్తూ తన విజయపంథాను కొనసాగిస్తోంది. 2021లో టోక్యో ఒలింపిక్‌లో కాంస్యంతో సరిపెట్టుకున్న లవ్లీనా ఈసారి స్వర్ణంతో విజయపరంపర కొనసాగించింది.



నిఖత్

'ఆడపిల్లవి షార్ట్‌లు, స్లీవ్‌లెస్ టాప్స్ వేసుకుని ఆడడమేంటి? ముఖంపై గాయాలైతే ఎవరైనా పెళ్లి చేసుకుంటారా? వంటి ఎన్నో సూటిపోటి మాటల మధ్య నిఖత్ జరీనా బాక్సింగ్ ప్రయాణం మొదలైంది. తెలంగాణ నిజామాబాద్‌లో సాధారణ మధ్యతరగతి కుటుంబంలో ఎండి జమీల్ అహ్మద్, పర్వీన్ సుల్తానా దంపతుల నలుగురు ఆడపిల్లల్లో మూడో సంతానంగా 1996లో జరీన్ జన్మించింది. 9వ తరగతి నుండే బాక్సింగ్ ఆడడం మొదలుపెట్టిన నిఖత్, 2020 టోక్యో ఒలింపిక్స్‌కు 52 కేజీల విభాగంలో బాక్సింగ్ దిగ్గజం మేరీకోమ్‌ను నేరుగా ఎన్నికచేయడాన్ని వ్యతిరేకించింది. ట్రయల్ పోటీల్లో పాల్గొనాలన్న సవాలు విసిరి మేరీకోమ్‌తో తలపడి ఓడింది. ఆ పరాభావం నిఖత్‌ను మానసికంగా ఎంతో కుంగదీసింది. 'బాక్సింగ్ దిగ్గజంతో పోటీనా? తగిన శాస్తి జరిగింది' అంటూ ఆమెపై ఎన్నో విమర్శలు చేశారు. వాటినుంచే గుణపాఠాలు నేర్చుకున్న జరీన్ ఆ తరువాత పాల్గొన్న ప్రతి పోటీలోనూ తన సత్తా చాటుతూ వస్తోంది. ఇప్పుడు వరుసగా రెండోసారి ప్రపంచ విజేతగా నిలిచింది.



లవ్లీనా..

'అయ్యో ఒక్క కొడుకూ లేడు. అందరూ ఆడపిల్లలే...' అంటూ ముగ్గురు ఆడపిల్లలున్న ఆ కుటుంబాన్ని అందరూ జాలిగా చూసేవారు. అసోం గోల్‌ఘాట్ జిల్లా బారోముఖియా గ్రామంలో నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగింది లవ్లీనా బార్గహైన్. మట్టి, రాళ్లతో కూడిన దారే ఆ గ్రామాన్ని బాహ్య ప్రపంచానికి కలిపేది. వ్యవసాయంలో తండ్రికి తోడుగా పొలం పనుల్లో పాల్గొనే సాధారణ యువతిగా నాట్లు వేయడం, కోత కోయడం వంటి పనుల్లో సాయంగా ఉండే లవ్లీనా పాఠశాల రోజుల నుండే ఆటపోటీల్లో చురుగ్గా పాల్గొనేది. అక్కలిద్దరూ కిక్‌బాక్సింగ్‌లో రాణిస్తుంటే.. తాను బాక్సింగ్‌ను ఎంచుకుంది. అయితే ఆమె బాక్సింగ్ ప్రయాణం అంత సులువుగా సాగలేదు. రాళ్ల రప్పలతో నిండి ఉన్న రోడ్డుపై బాక్సింగ్ క్లబ్‌కు చేరేందుకు సైకిల్‌పై 3, 4 కిలోమీటర్ల దూరం ప్రయాణించేది. ఇంటికొచ్చేసరికి ఒక్కోసారి ఒంటినిండా గాయాలయ్యేవి. అయినా పట్టుదలతో అనుకున్న లక్ష్యం చేరేవరకు వదిలిపెట్టేది కాదు.

అసోం నుంచి ఒలింపిక్స్ అర్హత సాధించిన తొలి మహిళా బాక్సర్‌గా రికార్డు సృష్టించిన లవ్లీనా తండ్రి బతుకుదెరువు కోసం చిన్న చిన్న ఉద్యోగాలు చేసేవారు. నెలకు రూ.1500 నుంచి రూ.2000 ఆదాయంతో ముగ్గురు పిల్లలను పోషించడం గగనమైన పరిస్థితుల్లో పిల్లలందరూ ఆడపిల్లలని నాన్నను అందరూ జాలీగా చూసేవారు. కాని నాన్నకు ఆ భావం అసలు ఉండేది కాదు. కొడుకుల్లేరని.. కూతుళ్లే ఉన్నారని.. ఎప్పుడూ దిగులుపడలేదు. మా గ్రామంలో అమ్మాయిలు జీన్స్ ధరించేవారు కాదు. సాంప్రదాయ దుస్తుల్లోనే ఉండేవారు. అటువంటి చోట మీకు ఇష్టమైన దుస్తులు వేసుకోండి. బైకులు నడపండి, నచ్చినట్లుగా జుట్టును కత్తిరించుకోండి. మనకు నచ్చింది మనం చేయొచ్చు. అయితే మనపై వస్తున్న విమర్శలు తప్పని నిరూపించేందుకు ఏదైనా సాధించాల'ని చెప్పిన తల్లిదండ్రుల మాటలను నిజం చేసి చూపించింది.

ప్రోత్సాహం, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో అవరోధాలను ఎదిరించి ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఈ పేదింటి పిల్లల లాంటి వాళ్లు మనచుట్టూ ఎంతోమంది.. సరైన అవకాశాలు కల్పిస్తే ఎన్నో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తామని నిరూపించిన ఈ మహిళా శక్తి దేశంలో ప్రతి మహిళకు చేరాలి. అప్పుడు ప్రతి పోటీ పసిడిమయమే.. ప్రతి రోజూ పర్వదినమే..

'గేమ్ ఛేంజర్' ఫస్ట్ లుక్

హీరో రామ్ చరణ్, కియారా అద్వానీ జంటగా నటిస్తున్న మూవీ 'గేమ్ ఛేంజర్'. ఈ చిత్రానికి శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా చెర్రీ అభిమానులకు డబుల్ సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. దీంతో పాటు టైటిల్‌ను కూడా రివీల్ చేశారు. రామ్ చరణ్ బైక్‌పై కళ్లద్దాలు పెట్టుకుని కూర్చొని ఉన్న లుక్ పోస్టర్‌ను చూసిన మెగా ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.




ఎన్టీఆర్ 30 సెట్‌లో కెన్నీ బేట్స్



కొరటాల శివ, జూనియర్ ఎన్టీఆర్ కాంబినేషన్లో 'ఆరసి 30' చిత్రం రాబోతున్నారని తెలిసిందే. జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. హాలీవుడ్ యాక్షన్ కొరియోగ్రాఫర్ కెన్నీ బేట్స్ ఇప్పటికే కొరటాల టీంతో జాయిన్ అయ్యారు. మత్స్యరంగంపై ఆధారపడే ఓ గ్రామం, హార్బర్, పోర్ట్ మాఫియా బ్యాక్ డ్రాప్ చుట్టూ తిరిగే కథాంశంతో సాగే ఈ చిత్రంలో గూస్ బంప్స్ తెప్పించే యాక్షన్ సన్నివేశాలుం డబోతున్నాయి. మొదటి షెడ్యూల్‌లో కార్గో షిప్‌లో వచ్చే యాక్షన్ సీక్వెన్స్ ను కెన్నీ బేట్స్ పర్యవేక్షణలో కొరటాల టీం షూట్ చేస్తోంది.లొకేషన్‌లో సినిమాటోగ్రఫర్ రత్నవేలు, మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ దిగిన స్టిల్స్ మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రం వచ్చే ఏడాది, ఏప్రిల్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి.

మే 12న 'ఛత్రపతి'

రాజమౌళి కాంబోలో వచ్చిన సూపర్‌హిట్ చిత్రం 'ఛత్రపతి'. ఈ చిత్రాన్ని హిందీలో రీమేక్ చేస్తోన్న విషయం తెలిసిందే. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా వి.వి.వినాయక్ దర్శకత్వంలో ఇది తెరకెక్కుతోంది. ఈ సినిమా వేసవి కానుకగా మే 12న దీన్ని విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ మేరకు 'ఛత్రపతి' టైటిల్ పోస్టర్‌ని షేర్ చేసింది. కండలు తిరిగిన దేహంతో సాయిశ్రీనివాస్ వెనుక నుంచి కనిపించాడు. ఇదొక యాక్షన్ సీక్వెన్స్‌లోని షాట్‌లా కనిపిస్తుంది. ఈ సినిమాతో ఆయన బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. పెన్ స్టూడియోస్ పతాకంపై ఇది నిర్మితమవుతోంది.






'మెగా పవర్' టైటిల్ లోగో

మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ ఆధ్వర్యంలో సత్య ఆర్ట్స్ పతాకంపై ప్రొడక్షన్ నం.1గా ఇటీవల ప్రారంభమైన చిత్రం 'మెగా పవర్'. చిత్రం టైటిల్ లోగోను సోమవారం విడుదల చేశారు. హీరో శ్రీ కల్యాణ్, హీరోయిన్ శశి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి గేదెల రవిచంద్ర దర్శకుడు. మదర్ సెంటిమెంట్‌తో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. అడబాల నాగబాబు, సాయి నిర్మల, ఇల్లా అభిషేక్, సత్యమూర్తి గేదెల నిర్మాతలు. రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా దర్శకులు మెహర్ రమేష్, కె.ఎస్ రవీంద్ర (బాబీ) ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. చిత్రంలో చిరంజీవి మీద ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఉగాది రోజున పూజా కార్యక్రమాలతో మొదలైన ఈచిత్రం మొదటి షెడ్యూల్ షూటింగ్ జరుగుతోంది.

తదుపరి లక్ష్యం ఒలింపిక్ బెర్త్‌లు

స్వర్ణ పతక విజేతలు నీతు, స్వీటీ, నిఖత్, లౌలీనా



న్యూఢిల్లీ: బాక్సింగ్‌లో స్వర్ణ పతకాలు నెగ్గిన నలుగురు బాక్సర్లు తమ తదుపరి లక్ష్యం ఒలింపిక్స్‌కు అర్హత సాధించడమేనని వెల్లడించారు. న్యూఢిల్లీలోని జరిగిన మహిళల బాక్సింగ్ ప్రపంచకప్‌లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించిన నీతు ఘంగాస్, స్వీటీ బూరతోపాటు స్టార్ బాక్సర్లు నిఖత్ జరీన్, లౌలీనా బోర్గోహైన్ బంగారు పతకాలు నెగ్గిన సంగతి తెలిసిందే. హైదరాబాద్‌కు చెందిన నిఖత్ వరుసగా రెండోసారి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. టైటిల్ అందుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'వరుసగా రెండోసారి ప్రపంచ టైటిల్ సాధించడం గొప్ప అనుభవాన్ని, అనుభూతినిచ్చిందని, ముఖ్యంగా ఒలింపిక్స్ కేటగిరీ అయిన 50కిలోల విభాగంలో సీడింగ్ దక్కేందుకు మరో ఆరు బౌట్‌లలో విజయం సాధించాల్సి ఉందని వెల్లడించింది. 2024లో జరిగే పారిస్ ఒలింపిక్స్‌తోపాటు ఈ ఏడాది జరిగే ఆసియా క్రీడలకు అర్హత సాధించడమే తన ముందున్న లక్ష్యాలని పేర్కొంది. కామన్వెల్త్ గేమ్స్ తర్వాత అత్యంత కఠినమైన పోటీల్లో ఇది ఒకటని, ఈ టోర్నీలో అన్ని దేశాలనుంచి బాక్సర్లు పోటీపడ్డారని, బ్యాక్-టు-బ్యాక్ మ్యాచ్‌లు జరగడంతో శరీరం అలసిపోయిందని, తాను దృఢంగా తయారయ్యేందుకూ ఇది దోహదపడిందని పేర్కొంది. ఈ ఏడాది ఆసియా క్రీడలు జరగనున్న దృష్ట్యా తనపై అభిమానులు గంపెడాశలు పెట్టుకున్నారని, వారి ఆశలను వమ్ము చేయనని, ఆసియా క్రీడలకు అర్హత సాధించేందుకు మరింత కష్టపడతానని పేర్కొంది. గత ఏడాది 52కిలోల విభాగంలో బరిలోకి దిగిన తాను 3, 4 కిలోలు బరువు తగ్గేందుకు ఎంతో శ్రమించాల్సి వచ్చిందని, అలాగే 50కిలోల బరువును కాపాడుకొనేందుకు ఎంతో కష్టపడుతున్నా'నని పేర్కొంది. ఇక ప్రపంచకప్ బాక్సింగ్ విభాగంలో మేరీకోమ్(ఆరు స్వర్ణాలు) తర్వాత రెండు స్వర్ణాలు గెలిచిన ఏకైక బాక్సర్ హైదరాబాద్‌కు చెందిన నిఖత్ జరీన్ మాత్రమే. ఇక 75లోల విభాగంలో 2018, 2019లో కాంస్య పతకాలను నెగ్గిన లౌలీనా బోర్గోహైన్ ఈసారి స్వర్ణ పతకం సాధించింది.

అజయ్ సింగ్ హర్షం..

మహిళల బాక్సింగ్ ప్రపంచకప్‌లో భారత్‌కు నాలుగు స్వర్ణాలు దక్కడం పట్ల భారత బాక్సింగ్ సమాఖ్య అధ్యక్షులు అజయ్‌సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ఒలింపిక్ కోటాలను సాధించేందుకు ఈ ప్రదర్శన దోహదపడుతుందని, నిఖత్ జరీన్‌తో పాటు లౌలీనా బోర్గోహైన్ ఆసియా క్రీడలకు అర్హత సాధించినట్లేనని, అధికారికంగా ప్రకటన వెలువడాల్సి ఉందన్నారు. వీరిద్దరూ ఒలింపిక్స్ బెర్త్‌లను సాధించడమే వారి ముందున్న తదుపరి లక్ష్యాలని పేర్కొన్నారు. ఈ టోర్నీలో భారత బాక్సర్ల ప్రదర్శన చారిత్రాత్మకంగా నిలిచిపోతుందన్నారు. అలాగే నీతు, స్వీటీ, లౌలీనా ప్రదర్శనలను ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీల్లేదని పేర్కొన్నారు. మహిళల ప్రపంచకప్ బాక్సింగ్ విభాగంలో ఘంగాస్(48కిలోలు), నిఖత్(50కిలోలు), లౌలీనా బోర్గోహైన్(75కిలోలు), స్వీటీ బూర(81కిలోలు) స్వర్ణ పతకాలు సాధించిన విషయం తెలిసిందే.

ఇండోర్ పిచ్ రేటింగ్ సవరణ: ఐసిసి

దుబాయ్: ఇండోర్ పిచ్ రేటింగ్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) సవరించింది. ఇండోర్‌లోని హోల్డర్ స్టేడియంకు ఐసిసి అపెక్స్ బాడీ 'పేలవ' రేటింగ్‌ను ఇంతకుముందు ప్రకటించింది. ఐసిసి జనరల్ మేనేజర్ వసీం ఖాన్, రోజర్ హార్పర్‌లతో కూడిన ఐసిసి అప్పీల్ ప్యానల్ మ్యాచ్ ఫుటేజీని సమీక్షించి భారతజట్టుకు 3 డీ మెరిట్ పాయింట్లతో కూడిన జరిమానాను విధిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో బిసిసిఐ ఆ రేటింగ్‌పై ఐసిసికి అప్పీల్ చేయగా.. 'సగటు కన్నా తక్కువ' రేటింగ్‌గా మార్పు చేస్తున్నట్లు సోమవారం వెల్లడించింది. ఈ వేదికగా జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియా జట్టు 9వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించిన సంగతి తెలిసిందే.



కోల్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా నితీశ్ రాణా

కోల్‌కతా: కోత్‌కతా నైట్‌రైడర్స్ కెప్టెన్‌గా నితీశ్ రాణా ఎంపికయ్యాడు. ఆ ఫ్రాంచైజీ సోమవారం ఓ ప్రకటనలో జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గాయంతో టోర్నీ మొత్తానికి దూరం కావడంతో ఐపిఎల్-2023 సీజన్‌కు నితీశ్ రాణాను ఎంపిక చేసినట్లు పేర్కొంది. కెప్టెన్ రేసులో వెస్టిండీస్ దిగ్గజ స్పిన్నర్ సునీల్ నరైన్, షకీబ్, ఆండీ రస్సెల్ పేర్లనూ పరిశీలించినా.. చివరకు యువ క్రికెటర్ నితీశ్ రాణావైపు ఫ్రాంచైజీ సభ్యులందరూ మొగ్గు చూపినట్లు ఆ ప్రకటనలో పేర్కొంది.

తొలి టి20లో బంగ్లాదేశ్ గెలుపు

చిట్టగాంగ్: ఐర్లాండ్‌తో జరిగిన తొలి టి20లో ఆతిథ్య బంగ్లాదేశ్ జట్టు ఘన విజయం సాధించింది. మూడు టి20ల సిరీస్‌లో భాగంగా సోమవారం జరిగిన తొలి టి20లో బంగ్లాదేశ్ జట్టు డక్‌వర్త్ లూయిస్ పద్ధతిపై 22పరుగుల తేడాతో ఐర్లాండ్‌పై గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టు 19.2 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 207పరుగులు చేసింది. ఆ దశలో మ్యాచ్ వర్షం కారణంగా కొంతసేపు నిలిచింది. వర్షం నిలిచిన తర్వాత మ్యాచ్ ప్రారంభం కాగా.. ఐర్లాండ్ లక్ష్యాన్ని డక్‌వర్త్ లూయిస్ పద్ధతిపై 8 ఓవర్లలో 103పరుగులుగా నిర్దేశించగా.. ఐర్లాండ్ జట్టు 5వికెట్ల నష్టానికి 81పరుగులే చేయగల్గింది. దీంతో మూడు టి20ల సిరీస్‌లో బంగ్లాదేశ్ 1-0 ఆధిక్యతలో నిలువగా.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రూనీ తాలూక్దార్‌కు లభించింది.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68